# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 294 | శనివారం,మే 16 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00



## ఏఎంసీఏ ప్రాజెక్టును ఆవిష్కరించిన కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు




**పుట్టపర్తి (భారత శక్తి)** అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టులకు చెందిన శిలాఫలకాలను వర్చువల్ గా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి బాటలు పడ్డాయి.

2లో..

# బండి సంజయ్‌పై ‘దుష్ప్రచారం’ ఆపండి!




- నగర సివిల్ కోర్టు కీలక ఉత్తర్వులు
- భగీరథ్ కేసు సాకుతో మంత్రిని టార్గెట్ చేయడంపై సీరియస్
- ఆ వీడియోలు, పోస్టులు వెంటనే తీసేయాలి
- ఈ నెల 26 డెడ్ లైన్.. లేదంటే కోర్టు ధిక్కరణ చర్యలే!
- రాజకీయ ప్రతిష్ట దెబ్బతీయడంపై న్యాయస్థానం ఆగ్రహం

**హైదరాబాద్ - మే 15 భారతశక్తి:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లక్ష్యంగా సాగుతున్న రాజకీయ దుష్ప్రచారానికి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అడ్డుకట్ట వేసింది. ఆయన కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసును సాకుగా చూపుతూ, సంజయ్‌ను వ్యక్తిగతంగా కించపరిచేలా చేస్తున్న ప్రచారాలపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు తక్షణమే అటువంటి కంటెంట్‌ను తొలగించాలని ఆదేశిస్తూ కీలక మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది.

### రాజకీయ కక్షసాధింపుపై న్యాయస్థానం సీరియస్

గత కొంతకాలంగా సోషల్ మీడియా వేదికగా, రాజకీయ సభల్లో బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న విమర్శలు శ్రుతిమించాయని కోర్టు అభిప్రాయపడింది. ఒక కేసును అడ్డం పెట్టుకుని కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ సాగుతున్న ఒత్తిళ్లు, వ్యక్తిగత దూషణలు ఆయన సామాజిక, రాజకీయ ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగిస్తున్నాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. “రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం చట్టరీత్యా నేరం. న్యాయస్థానం దృష్టిలో ఇది అత్యంత తీవ్రమైన విషయం.” అని కోర్టు వ్యాఖ్యానించింది.

### డెడ్ లైన్ - ఈ నెల 26 కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రధానాంశాలు ఇవే:

తక్షణ తొలగింపు:లి బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి వరకు సర్క్యులేట్ చేసిన అన్ని వీడియో క్లిప్పింగ్‌లు, పత్రికా ప్రకటనల క్లిప్పింగ్‌లు, డిజిటల్ కంటెంట్, సోషల్ మీడియా పోస్టులను తక్షణమే తొలగించాలి.

**గడువు:** ఈ నెల 26వ తేదీలోగా అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించని పక్షంలో సంబంధిత వ్యక్తులు, సంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**వాల్ పోస్టర్లు:** బహిరంగ ప్రదేశాల్లో అతికించిన వాల్ పోస్టర్లను సైతం సంబంధిత యంత్రాంగం తొలగించాలని ఆదేశించింది.

### ప్రతిష్టకు భంగం కలిగించే కుట్ర?

కేంద్ర హోం శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణంలో, సంజయ్‌ను నైతికంగా దెబ్బతీసేందుకు పక్కా ప్రణాళికతో ఈ ప్రచారం సాగుతోందని బాధితుడి తరఫు న్యాయవాదులు వాదించారు.

ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు, ఇకపై అటువంటి ప్రచారాలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించింది. ఈ ఉత్తర్వులతో విపక్షాల దూకుడుకు బ్రేక్ పడినట్లయింది.రాజకీయాల్లో ఆరోగ్యకరమైన విమర్శలు ఉండాలి తప్ప, కుటుంబ సభ్యుల కేసులను వాడుకుని వ్యక్తిగత దాడులకు దిగడం సరికాదన్న కోర్టు తీర్పు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పెట్రోలియం నిల్వల రంగాల్లో సహకారంతోపాటు

## పలు వ్యూహాత్మక ఒప్పందాలు

- యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు




**న్యూస్ ఢిల్లీ (భారత శక్తి)** ఐదు దేశాల పర్యటనలో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరుకున్న ప్రధాని నరేంద్రమోదీ యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు పశ్చిమాసియా సంక్షోభంపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఎల్‌పీజీ సరఫరా, వ్యూహాత్మక పెట్రోలి యం నిల్వల రంగాల్లో సహకారంతోపాటు పలు ఒప్పందాలు చేసుకున్నారు. భారత్‌లో మౌలిక సదుపాయాల రంగంలో 5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. అలాగే, వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటుపై యూఏఈతో ఎంవోయూతో ఒప్పందం చేసుకున్నారు. మరోవైపు, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో యూఏఈపై ఇరాన్ దాడిని మోదీ ఖండించారు.”పశ్చిమాసియా యుద్ధం ప్రభావం ప్రపంచం మొత్తంపై ఉంది. అయితే, భారత్ ఎప్పుడూ చర్చలు, సంప్రదింపులకే ప్రాధాన్యమిస్తుంది. చమురు రవాణాకు కీలక మార్గమైన హార్మూజ్ జలసంధి ఎప్పుడూ తెరిచే ఉండాలి. అదేవిధంగా హార్మూజ్‌పై అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలి. అలాగే, ఇరాన్, యూఏఈని లక్ష్యంగా చేసుకున్న తీరు ఆమోదయోగ్యం కాదు. కానీ, ప్రస్తుత పరిస్థితిని యూఏఈ సంయమనంతో ఎదుర్కోవడం ప్రశంసనీయం. భారత్ ఎప్పుడూ యూఏఈతో చేతిలో చేయి వేసే నడిచింది. యూఏఈతో

2లో..

## భోజ్‌శాల ‘సరస్వతీ’ నిలయమే!

- దశాబ్దాల వివాదానికి తెరదించిన హైకోర్టు..
- ముస్లిం పక్షాల వాదనలు తిరస్కరణ
- ఏఎస్ఐ సర్వే ఆధారంగా కీలక తీర్పు
- ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని కేంద్రానికి ఆదేశం.



**హైదరాబాద్ మే 15 భారతశక్తి:** మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న భోజ్‌శాల-కమల్ మౌలా వివాదానికి ఇండోర్ హైకోర్టు సంచలన తీర్పుతో తెరదించింది. పురావస్తు శాఖ (ASI) సమర్పించిన శాస్త్రీయ ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న ద్విసభ్య ధర్మాసనం.. ఆ వివాదాస్పద కట్టడం సంస్కృత విద్యాకేంద్రమైన ‘వాగ్దేవి’ (సరస్వతి) ఆలయమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు హిందూ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిస్తూ, సదరు ప్రాంగణాన్ని పూర్తిగా పురావస్తు శాఖ స్వాధీనంలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

### చారిత్రక ఆధారాలే కీలకం

ఈ ప్రాంగణం పరమార వంశానికి చెందిన రాజా భోజుడు నిర్మించిన అద్భుతమైన సంస్కృత పాఠశాల అని చరిత్రకారులు ఎప్పటి నుంచో వాదిస్తున్నారు. తాజాగా ఏఎస్ఐ నిర్వహించిన 98 రోజుల సుదీర్ఘ సర్వేలో వెలుగుచూసిన అంశాలు కోర్టు తీర్పులో కీలకంగా మారాయి.

### కట్టడ నిర్మాణ శైలి:

అక్కడ లభించిన శిల్పాలు, స్తంభాలపై ఉన్న చెక్కడాలు హిందూ దేవాలయ నిర్మాణ శైలిని పోలి ఉన్నాయని సర్వే తేల్చింది.

**వాగ్దేవి విగ్రహం:** ఇక్కడ సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడానికి కోర్టు కేంద్రానికి అనుమతినిచ్చింది.

**ప్రత్యామ్నాయ మార్గం:** మసీదు కోసం ముస్లిం వర్గాలు వేరే స్థలాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మాసనం సూచించింది.

### ఏమిటీ వివాదం?

మధ్యయుగం నాటి ఈ కట్టడాన్ని హిందువులు వాగ్దేవి ఆలయంగా, ముస్లింలు కమల్ మౌలా మసీదుగా భావిస్తారు. 2003 నుంచి అమల్లో ఉన్న ఏఎస్ఐ

2లో..

# నీట్ ముసుగులో నిలువు దోపిడీ

## - సూత్రధారి కులకర్ణి అరెస్ట్



- అక్షర వ్యాపారంలో ‘కెమిస్ట్రీ’ మాస్టర్.. పుణేలో పట్టుకున్న సీబీఐ
- రూ. వందల కోట్ల దందా.. వ్యవస్థల కళ్లుగప్పి ప్రశ్నల విక్రయం
- తెర వెనుక ‘పెద్దల’ హస్తంపై అనుమానాలు!




**హైదరాబాద్ మే 15, భారత శక్తి :** లక్షలాది మంది పేద విద్యార్థుల డాక్టర్ కలలను చిదిమేస్తూ, అక్షరాలను అంగడి సరుకుగా మార్చిన నీట్ యూజీ-2026 ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతంలో అసలు ‘డొంక’ కదిలింది. ఈ దేశవ్యాప్త కుంభకోణానికి ప్రధాన సూత్రధారి, కెమిస్ట్రీ ప్రొఫెసర్ పీవీ కులకర్ణిని సీబీఐ అధికారులు పుణేలో కరడుగట్టిన నేరగాడిలా చుట్టుముట్టి అరెస్ట్ చేశారు. ప్రశ్నపత్రాల తయారీ ప్యానెల్‌లో ఉంటూనే, కంచే చేను మేసిన చందంగా వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఈ ప్రొఫెసర్ బాగోతం ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

### వ్యవస్థల గుండెల్లో కన్నం!

ప్రశ్నపత్రాల రూపకల్పనలో అత్యంత కీలకమైన బాధ్యతల్లో ఉన్న కులకర్ణి, తన మేధస్సును నేరానికి వాడాడు. ఎన్‌టీఏ (చీూ) లోపల ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని, కెమిస్ట్రీ విభాగానికి సంబంధించిన ప్రశ్నలను గుట్టుచప్పుడు కాకుండా బయటకు చేరవేసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి.


**డిజిటల్ దొంగతనం:** సాధారణ మెయిల్స్ కాకుండా, ట్రేస్ చేయడానికి వీల్లేని ‘ఎన్‌క్రిప్టెడ్’ యాప్స్ మరియు డార్క్ వెబ్ వేదికగా ఈ దందా సాగించినట్లు సీబీఐ గుర్తించింది.

ఐపీ అడ్రస్ గుట్టురట్టు: నిందితుడు

2లో..

# కోర్టు మెట్లెక్కిన ‘దీదీ’

## మాజీ ముఖ్యమంత్రి హోదాలో నల్లకోటుతో వాదనలు!



- అసెంబ్లీ ఓటమి తర్వాత అనూహ్య నిర్ణయం.. హైకోర్టులో లాయర్‌గా మమత ఎంట్రీ
- హింసపై విచారణ కోరుతూ పిటిషన్.. లైసెన్స్‌పై నివేదిక కోరిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

**కోల్ కత్తా: మే 15 భరతశక్తి,:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో సంచలనం చోటుచేసుకుంది. ఎన్నికల్లో పరాజయం అనంతరం మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కొత్త అవతారమెత్తారు. పరిపాలనా పగ్గాలను కాసేపు పక్కన పెట్టి, న్యాయవాదిగా నల్లకోటు ధరించి కోల్‌కతా హైకోర్టు బోనులో నిలబడ్డారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాతి హింసపై తన పార్టీ నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై ఆమె స్వయంగా

2లో..

# గొలుసుకట్టుకు ‘హైడ్రా’ జీవం!

- మహానగరంలో కనుమరుగైన 625 చెరువుల గుర్తింపు.. పునరుద్ధరణే లక్ష్యంలి
- వరదల కట్టడికి మాస్టర్ ప్లాన్.. పర్యాటక క్షేత్రాలుగా జలాశయాలు

**హైదరాబాద్ -మే 15 భారతశక్తి:** ఒకప్పుడు గొలుసుకట్టు చెరువులకు నెలవైన హైదరాబాద్ మహానగరం ఇప్పుడు వరద గుప్పిట్లో చిక్కుకోవడానికి ప్రధాన కారణం ఆ వ్యవస్థ చిన్నాభిన్నం కావడమేనని హైడ్రా విశ్లేషించింది. నగరంలో గతంలో ఉన్న 1,384 చెరువుల్లో ఏకంగా 625 చెరువులు ఆక్రమణల పర్వంలో ఉనికిని కోల్పోయాయని హైడ్రా గుర్తించింది. మిగిలిన 759 చెరువులు సైతం ఆక్రమణల ముప్పులో ఉన్న నేపథ్యంలో, వాటన్నింటికీ పునరుజ్జీవం పోసి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు హైడ్రా నడుం బిగించింది.

### ముంచెత్తుతున్న ఆక్రమణలు.. పర్యావరణ ముప్పు



2లో..

## ఏఎంసీఏ ప్రాజెక్టును ఆవిష్కరించిన కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు




పుట్టపర్తిలో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకం. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగానూ పుట్టపర్తి మారుతుందని అన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారు. ఆధునికతరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఒ౦అం ప్రాజెక్టు ఏర్పాటు అవుతోంది. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. ఆపరేష్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారు. ఇ లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు ధన్యవాదాలు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందని అన్నారు.అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగాం... జెట్ స్పీడ్ తో అనుమతులిచ్చాం. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ప్రాజెక్టుతో మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తాయి. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయి. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీహరికోట అంతరిక్షశక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికే అండగా నిలుస్తుంది.

గతంలో రాయలసీమ రతనాల సీమ.. కానీ వివిధ కారణాల వల్ల కరవుసీమగా మారిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆ పరిస్థితిని మార్చామని అన్నారు.ఆనాడు ఎన్టీఆర్, ఈనాడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తున్నాం.

ప్రతీ ఎకరాకూ నీరిచ్చేలా కార్యాచరణ చేపట్టాం. కియా పరిశ్రమకు నీరిచ్చాం. లక్ష కోట్ల రూపాయలతో సీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేస్తున్నామని అన్నారు.

## పెట్రోలియం నిల్వల రంగాల్లో సహకారంతోపాటు పలు వ్యూహాత్మక ఒప్పందాలు

భారత్ అనుబంధం ఇకముందూ కొనసాగుతుంది- నరేంద్ర మోదీ, భారత ప్రధానిఇంధన భద్రతపైనే ఫోకస్?పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్రమోదీ ఐదు దేశాల పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, యూఏఈ అధ్యక్షుడితో జరిగిన భేటీలో పశ్చిమాసియా యుద్ధంతో నెలకొన్న పరిస్థితులపై ఇరుదేశాధినేతలు చర్చించారు. అలాగే, యూఏఈలో నివసిస్తున్న 45లక్షల మంది భారతీయుల భద్రతపై చర్చలు జరిపారు. గుజరాత్‌లోని ద్వారక జిల్లా వాడినార్‌లో భారీ నౌకా మరమ్మతుల క్లస్టర్‌ను ఏర్పాటు చేసే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత మౌలిక సదుపాయాల రంగంతోపాటు ఆర్బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్‌లో దాదాపు 40వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న తరుణంలో భారత్‌కు యూఏఈ అత్యంత విశ్వసనీయమైన ఇంధన భాగస్వామిగా నిలుస్తుందని ఈ ఒప్పందాలు స్పష్టం చేస్తున్నాయి.

## గొలుసుకట్టుకు 'హైడ్రా' జీవం!

నగరంలో సంభవిస్తున్న ఆకస్మిక వరదలకు చెరువులు, నాలాల ఆక్రమణలే ప్రాథమిక కారణమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే ఉత్తరప్రదేశ్‌లో సంభవించిన గాలివాన వంటి విపత్తులు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణల వల్ల నీటి ప్రవాహ మార్గాలు మూసుకుపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, అందుకే గొలుసుకట్టు అనుసంధానాన్ని తిరిగి పునరుద్ధరించడమే తమ ప్రాధాన్యతని తెలిపారు.

### మరో 1300 చెరువులే లక్ష్యం.. 10 ఏళ్ల రోడ్‌మ్యాప్

చెరువుల పరిరక్షణ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో మార్పు తెచ్చేలా 10 ఏళ్ల సుదీర్ఘ కార్యాచరణను హైడ్రా సిద్ధం చేసింది.

### తొలి విడత విజయం:

ఇప్పటికే ఆరు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా, మరో 14 చెరువుల వద్ద అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

నలుదిక్కులా ట్యాంక్ బండ్‌లు: నగరానికి నాలుగు వైపులా ఉన్న ప్రధాన చెరువులను ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

**ప్రయోజనాలు:** 1,300 చెరువులను పునరుద్ధరించడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడమే కాకుండా, నగర ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

### మురికి కూపాలుగా కాదు.. ఆహ్లాదకర కేంద్రాలుగా!

ఒకప్పుడు దుర్వాసనతో మురికి కూపాలుగా ఉన్న చెరువులు ఇప్పుడు పర్యాటక కేంద్రాలుగా మారుతున్నాయి.

**సౌకర్యాలు:** చెరువుల చుట్టూ బండ్ల నిర్మాణం, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ఆటస్థలాలను ఏర్పాటు చేస్తున్నారు.

### నిదర్శనాలు:

అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, పాతబస్తీలోని బమ్రుకున్ ఉద్ దౌలా చెరువుల అభివృద్ధి దీనికి నిదర్శనంగా నిలిచాయి.

### నాలాల ప్రక్షాళనతో తప్పిన ముప్పు

చెరువులతో పాటు నాలాల పునరుద్ధరణపై కూడా హైడ్రా దృష్టి సారించింది. ప్యాట్నీ నాలా వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించడం వల్ల నీటి ప్రవాహం సాఫీగా సాగుతోందని, దీనివల్ల ఎగువన ఉన్న 20కి పైగా కాలనీలకు వరద ముప్పు తప్పిందని కమిషనర్ వివరించారు. పర్యావరణ హితమైన నగర నిర్మాణమే లక్ష్యంగా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## నారాయణపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు పరిశీలించిన ఎంపీడీవో కృష్ణయ్య



**కోహెడ** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నారాయణపూర్ గ్రామంలో ఎన్ఆర్ ఈజిఎస్ పనులు పరిశీలించిన ఎంపీడీవో కృష్ణయ్య ఆయన మాట్లాడుతూ.వేసవి కాలము ఎండలు ఉన్నందున కూలీలందరు ఉదయము 6 గంటలకు లోపు పనికి హాజరుకావాలని ఆయన అన్నారు. పనిచేసిన అందరికీ కూలి డబ్బులు వారం కాకముందే అందరి అకౌంట్స్ నందు జమ చేయడం జరుగుతుందన్నారు. కూలీలు అందరూ పెద్ద మొత్తంలో రావాలని కోరారు. శుక్రవారం 180 మంది కూలీలు హాజరయ్యారు ఆయన అన్నారు. ఎక్కువ సంఖ్యల కూలీలు వచ్చే విధంగా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్,పంచాయతీ కార్యదర్శి రాజక కుమార్ ఆదేశించారు.పనులు జరుగుతున్న ప్రదేశంలో హరి పుష్పలత, పాలకవర్గం ఏర్పాటుచేసిన అల్పాహారం కూలీలకు స్టీల్ ప్లేట్ల లో ఉపయోగించారు. కూలీలకు అందరికీ ప్లాస్టిక్ ప్లేట్లను వాడ వద్దని ప్లాస్టిక్ వలన వివిధ రకాల జబ్బులు రావడం జరుగుతుందని నిషేధించాలని అన్నారు.

# నీట్ ముసుగులో నిలువు దోపిడీ







వాడిన ల్యాప్‌టాప్ ఐపీ అడ్రస్‌లను విశ్లేషించగా, డేటా లీక్ అయిన సమయం.. పరీక్షా పత్రాల తయారీ సమయంతో సరిపోలింది.

### కోచింగ్ మాఫియాతో కుమ్మక్కు:

కులకర్ణి కేవలం ఒక ప్రొఫెసర్ మాత్రమే కాదు, దేశవ్యాప్త కోచింగ్ మాఫియాకు 'గోల్డెన్ హ్యాండ్'గా మారాడు.

1. **ఒక్కో తలకు రూ. 50 లక్షలు:** దళారుల ద్వారా ఒక్కో విద్యార్థి నుంచి రూ. 30 నుంచి 50 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.
2. **నెట్‌వర్క్ విస్తృతి:** పుణే కేంద్రంగా సాగిన ఈ దందా బీహార్, రాజస్థాన్, తెలంగాణ మీదుగా దేశమంతటా పాకింది. హవాలా మార్గంలో వందల కోట్లు చేతులు మారినట్లు బ్యాంకు లావాదేవీలు స్పష్టం చేస్తున్నాయి.

### అక్షర యజ్ఞంలో 'అపవిత్ర' హస్తం:

ప్రశ్నపత్రాల తయారీ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమున్నా, కులకర్ణి వాటిని లోపలికి ఎలా తీసుకెళ్లాడనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. భద్రతా సిబ్బంది కళ్లుగప్పి తీసుకెళ్లాడా? లేక ఉన్నతాధికారుల అండదండలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో 'భారత శక్తి' ఆరా తీస్తోంది. సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు, ఆ సమయంలో విధుల్లో ఉన్న ఇతర సిబ్బందిని కూడా విచారిస్తున్నారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం:

కష్టపడి చదివే విద్యార్థులకు మొండిచేయి చూపుతూ, పైసలున్న వారికే సీట్లు దక్కేలా చేసిన ఈ 'అక్షర దొంగ'ను కఠినంగా శిక్షించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కులకర్ణి అరెస్టుతోనే ఈ కథ ముగిసిపోలేదు.. దీని వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనా యంత్రాంగంలోని 'పెద్ద తిమింగలాల'ను బయటకు లాగాల్సిందే.

"పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోతే మేధావుల కంటే మాఫియానే దేశాన్ని శాసిస్తుంది. కులకర్ణి అరెస్ట్ ఒక ఆరంభం మాత్రమే కావాలి. వ్యవస్థలో వేళ్లూనుకున్న అవినీతి పురుగులను ఏరిపారేసే వరకు 'భారత శక్తి' పోరాటం కొనసాగుతుంది."

# భోజ్‌శాల 'సరస్వతీ' నిలయమే!





### నిబంధనల ప్రకారం..

1. మంగళవారం: హిందువులు పూజలు నిర్వహించేవారు.
2. శుక్రవారం: ముస్లింలు నమాజ్ చేసుకునేవారు.

అయితే, ఈ ఒప్పందాన్ని సవాలు చేస్తూ హిందూ సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఇది మూలతః ఆలయమని, పూర్తి హక్కులు తమకే కల్పించాలని కోరాయి. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు, వాస్తవాలను వెలికితీసేందుకు శాస్త్రీయ సర్వేకు ఆదేశించింది.

### బిగుతుగా బందోబస్తు

తీర్పు నేపథ్యంలో ధార్ జిల్లాలో ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సున్నిత ప్రాంతాల్లో నిఘా పెంచారు. తీర్పు వెలువడిన వెంటనే హిందూ సంఘాలు హర్షం వ్యక్తం చేయగా, ముస్లిం పక్షాలు పైకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది."ఈ తీర్పు కేవలం ఒక స్థల వివాద పరిష్కారం మాత్రమే కాదు.. మరుగునపడిన భారతీయ విద్యా వైభవానికి, చారిత్రక సత్యానికి లభించిన గుర్తింపు." –

# కోర్టు మెట్లెక్కిన 'దీదీ'



వాదనలు వినిపించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

### పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు: మమత

రాష్ట్రంలో జరుగుతున్న దాడుల నుంచి ప్రజలను కాపాడేందుకు న్యాయస్థానం తక్షణమే జోక్యం చేసుకోవాలని మమతా బెనర్జీ కోర్టును అభ్యర్థించారు. ఎన్నికల తర్వాతి హింసాకాండలో పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని, బాధితులకు రక్షణ కరువైందని ఆమె తన వాదనల్లో పేర్కొన్నారు. ఈ అల్లర్ల వెనుక ఉన్న శక్తులను అరికట్టేందుకు న్యాయపరమైన ఆదేశాలు అవసరమని కోరారు.

### ప్రభుత్వ కౌంటర్.. ఆర్డర్ రిజర్వ్

టీఎంసీ తరఫున మమత చేసిన వాదనలను ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. పిటిషన్‌లో పేర్కొన్న హింసాత్మక ఘటనలు, బాధితుల వివరాలు అస్పష్టంగా ఉన్నాయని, ప్రాథమిక ఆధారాలు లేవని వాదించారు. దీనిపై ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేస్తుందని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు బెంచ్.. తన మధ్యంతర ఉత్తర్వులను రిజర్వు చేసింది. త్వరలోనే వీటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించింది.

### రంగంలోకి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (BCI)

మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉండి కోర్టులో ప్రాక్టీస్ చేయడంపై 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' తక్షణమే స్పందించింది. న్యాయవాదిగా మమతా బెనర్జీ అర్హతలపై ఆరా తీసింది. దీనిపై 48 గంటల్లో నివేదిక ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది.

### నిబంధనలు ఏం చెబుతున్నాయి?

- రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నా లేదా లాభదాయకమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నా వారి న్యాయవాద లైసెన్స్ సస్పెన్షన్‌లో ఉంటుంది.
- తిరిగి ప్రాక్టీస్ చేయాలంటే బార్ కౌన్సిల్ నుంచి ముందస్తు అనుమతి పొంది, లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలి.
- మమత ఈ ప్రక్రియను పూర్తి చేశారా లేదా అన్న కోణంలో BCI విచారణ చేపట్టింది.ఒకవైపు రాజకీయ వైఫల్యం, మరోవైపు న్యాయపోరాటం.. ఈ రెండింటి మధ్య మమతా బెనర్జీ వేసిన ఈ అడుగు బెంగాల్ రాజకీయాలను ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.

## మొక్కు తీర్చుకున్న వెంకట్రావుపేట సర్పంచ్ బండారు కవిత

### – కాలి నడకన 3550 మెట్లు ఎక్కి తిరుమల శ్రీవారిని దర్శించిన సర్పంచ్ కుటుంబం



**సిద్దిపేట, మే15 ( భారత శక్తి ):**సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామ సర్పంచ్‌గా ఘన విజయం సాధించిన సందర్భంగా చేసిన మొక్కును వెంకట్రావుపేట సర్పంచ్ బండారు కవిత భక్తిశ్రద్ధలతో తీర్చుకున్నారు. భర్త స్వామి గౌడ్, కుమార్తెలు జ్యోష్ణ, స్నేహలతో కలిసి తిరుమల శ్రీవారిని కాలి నడకన దర్శించుకున్నారు. భక్తి నామస్మరణల మధ్య ఒక్కో మెట్టుకు భక్తి బొట్టు పెట్టుకుంటూ మొత్తం 3550 మెట్లు ఎక్కి ఏడుకొండల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సర్పంచ్‌గా గెలిస్తే మెట్ల మార్గంలో తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకుంటానని గతంలో చేసిన సంకల్పాన్ని ఈ సందర్భంగా నెరవేర్చుకున్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగేందుకు ఆశీస్సులు ప్రసాదించాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## ఎన్నాళ్లీ లీకులు...

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాసిక్ వైద్యుడు డాక్టర్ శుభం ను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. విచారిస్తున్న క్రమంలో దారుణమైన నిజాలు బయటపడుతున్నాయి. శుభం వైద్యుడిగా కొనసాగుతున్నాడు. కానీ ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదు. ఇతడి స్వస్థలం నందగావ్. ఇతడు నాసిక్ ప్రాంతంలో కోచింగ్ కారిడార్ ప్రాంతంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. దాని నేమ్ బోర్డు లో శుభం పేరు ముందు డాక్టర్ అని రాసి ఉంటుంది. స్థానికంగా అతడు తనను తాను డాక్టర్గా పరిచయం చేసుకున్నాడు. అంతేకాదు ఎంబిబిఎస్, బిడిఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రయత్నాల సాగించే విద్యార్థులకు అతడు సలహాలు ఇస్తుంటాడు. 2021లో భోపాల్ సమీపంలోని సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు ఇతడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పోలీసులు విచారణలో ఆ యూనివర్సిటీ వీసీని సంప్రదించారు. అప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీ కి వెళ్ళాడు. ఆ తర్వాత తరగతులకు హాజరు కాలేదు.నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత విచారణ జరుగుతున్న కొద్ది అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ ను శుభం పదిలక్షలకు కొనుగోలు చేశాడు. కొరియర్ లో ప్రశ్నపత్రం వస్తే.. దానిని పిడిఎఫ్ లాగా మార్చాడు. ఆ తర్వాత దానిని గురుగ్రామ్ ప్రాంతంలో ఒక వ్యక్తికి 15 లక్షలకు అమ్మాడు. ఈ పేపర్ మొత్తం అనేక రాష్ట్రాలను చుట్టింది. పలువురు విద్యార్థులు రెండు నుంచి ఐదు లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే క్వశ్చన్ పేపర్ లీకేజీ బయటపడడంతో.. శుభం పరారీ లో ఉన్నాడు. తర్వాత తనను ఎవరు గుర్తుపట్టకుండా ఉండడానికి గుండు చేయించుకున్నాడు. అయితే పోలీసులు డిజిటల్ ఆధారాలు సేకరించి అతడిని అరెస్ట్ చేశారు. శుభం సోదరుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ అనేది ఈ పరీక్ష రాసిన విద్యార్థుల గుండెల్లో దిగి న బాకు మాత్రమే కాదు, లక్షలాది జీవితా ల్లో ఒక్కసారిగా వెలుగు ఆరిపోవడం లాంటి ది కూడా. నెలల తరబడి కాదు, ఏళ్లుగా నిద్ర మానేసి, ఫోన్లు దూరం పెట్టి, పండుగలు వదిలేసి, తమ యౌవనాన్ని ప్రశ్నాపత్రాల మధ్య బంధించిన పిల్లలకు పరీక్ష రద్దు అనే రెండు మాటలు వార్తలా వినిపించవు.

అవి గుండెలమీద పడే బరువులా అనిపిస్తాయి.పాపం, పుణ్యం తెలియకుండా కష్టాన్ని మా త్రమే నమ్ముకొని ఈసారి బాగా రాశామని, మంచి ర్యాంకు వస్తుందని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఇప్పుడు మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. విద్యార్థుల కంటే ఎక్కువగా వారి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతు న్నారు. పైసా పైసా కూడబెట్టి పిల్లలను చదివించారు. కొందరు బంగారం అమ్మారు. మరికొందరు పొలాలు తాకట్టు పెట్టారు.మధ్యతరగతి కుటుంబాల్లో డాక్టర్ అవ్వాలనే కల ఒక వృత్తిపై ఆశ మా త్రమే కాదు. అది ఒక తరాన్నే మార్చే ఆశ యం. ఇప్పుడు వారిని వెంటాడుతున్నది పరీక్ష రద్దయిందనే బాధ మాత్రమే కాదు, మళ్లీ అదే స్థాయిలో రాయగలమా? అనే భ యం కూడా. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ, ఒకసారి విరి గిపోయిన మనసును తిరిగి అదే ధైర్యంతో నిలబెట్టడం అంత సులభం కాదు.పేపర్ లీక్ అయిందని, నిర్వహణలో లో పాలు జరిగాయని, అవకతవకలపై అనుమానాలు వచ్చాయని అధికారిక కారణాలు విని పించవచ్చు. కానీ, ఇక్కడ అసలు ప్రశ్న ఇం కొకటి ఉంది. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షలలో ఒకటైన నీట్ను కూడా నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేకపోతే వి ద్యార్థులు ఇంకేం నమ్మాలి? పరీక్షల మీద నమ్మకం కూలిపోవడమనేది కేవలం విద్యావ్యవస్థ సమస్య కాదు. అది సమాజ నైతికత కదలిపోతున్నదని చెప్పడానికి సంకేతం.ఎందుకంటే పరీక్షలు కేవలం మార్కులు ఇ వ్వవు. నువ్వు కష్టపడితే ముందుకు వెళ్లగలవనే విశ్వాసాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు అ దే విశ్వాసం ముక్కలవుతోంది. దేశవ్యాప్తం గా ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. వారిలో చాలా మంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. వాళ్లకు ప్రతిభ ఒక్కటే మూలధనం.కానీ, ఇప్పుడు ఎక్కడో, ఎవరో వ్యవస్థను మోసం చేస్తే తన కష్టం వృథా అవుతుందా? అనే భయం పెరుగుతోంది. ఇది ఏ విద్యార్థికైనా అత్యంత ప్రమాదకరమైన మానసిక స్థి తి. ఎందుకంటే ఆశ కోల్పోయిన యువత ఇ చ్చే నిశ్శబ్దం కన్నా భయంకరమైనది మరొకటి ఉండదు.నీట్ చుట్టూ ఇప్పుడు మరో పెద్ద ప్రశ్న నిలుస్తోంది. కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ఒకే రోజు, ఒకే పరీక్షతో నిర్ణయించడం నిజంగా న్యాయమేనా? ఒక గ్రామంలో తె లుగు మీడియంలో చదివిన విద్యార్థి, అత్యం త ఖరీదైన కోచింగ్ తీసుకున్న నగర విద్యార్థితో ఒకేస్థాయిలో పోటీ పడుతున్నాడని చెప్పడం సులభం. కానీ, వాస్తవ పరిస్థితులు అంత సమానంగా లేవు. ఒకరికి టెస్ట్ సిరీస్లు, ప్రత్యేక శిక్షణ, డిజిటల్ సదుపాయా లు ఉంటే, మరొకరికి కనీసం సరైన విద్యుత్ సదుపాయం కూడా ఉండకపోవచ్చు.అయినా ఇద్దరికీ ఒకే మెరిట్ కొలమానం వర్తింపజేయడం నిజంగా సమానత్వమేనా? మెరిట్ అనే పదం వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ మెరిట్ వెనుక కుటుంబ పరిస్థితి ఏమిటి? ఆర్థిక స్థితి ఏమిటి? అవకాశాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? అ నే ప్రశ్నలూ ఉంటాయి. కొందరు కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి సిద్ధమవుతుంటే, మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వనరుల మధ్య చదువుతు న్నారు. పరీక్ష అందరికీ ఒకటే కావచ్చు. కానీ, అవకాశాలు మాత్రం అందరికీ ఒకేలా లేవు.నీట్ వంటి పరీక్షలు వచ్చిన తర్వాత విద్య అంటే జ్ఞానం అనే భావన క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పుడు చాలామంది విద్యా ర్థులు పాఠాన్ని అర్థం చేసుకోవడానికి కాదు, ప్రశ్నకు సరైన సమాధానం గుర్తుపెట్టుకోవడానికి మాత్రమే చదువుతున్నారు. పాఠశా లలు విద్య నేర్పే స్థలాలుగా కాకుండా, పరీక్షలకు సిద్ధం చేసే గదులుగా మారిపోతున్నా యనే విమర్శలు పెరుగుతున్నాయి.

కోట్ల రూపాయల కోచింగ్ పరిశ్రమ విద్యార్థుల ఆశలను మాత్రమే కాదు, వారి భయాలను కూడా వ్యాపారంగా మార్చేసిందిఉదయం నుంచి రాత్రి వరకు టెస్టులు, ర్యాంకులు, పోలికలు, ఒత్తిళ్లు... ఇవన్నీ కలిసి విద్యార్థి బాల్యాన్ని మెల్లగా మింగేస్తున్నాయి. డాక్టర్ కావాలనే కల ఇప్పుడు చాలామందికి సేవాభావం కంటే బతుకుపోరాటంగా మారిపో యింది. ఈ వ్యవస్థలో పిల్లలు చదువుకుం టూ పెరగడం లేదు. కేవలం ఒత్తిడి మధ్య పెద్దవాళ్లు అవుతున్నారు.నీట్ గురించి మాట్లాడేటప్పుడు మనం మార్కులు, ర్యాంకులు, సీట్ల గురించి ఎక్కువగా మాట్లాడతాం. కానీ, విద్యార్థుల మాన సిక ఆరోగ్యం గురించి చాలా తక్కువగా చర్చిస్తాం. ఒక విద్యార్థి సంవత్సరాల కష్టం ఒక్క పరీక్షపై ఆధారపడినప్పుడు, అతని మనసులో భయం కలగడం సహజం. 'ఫలితం రాకపోతే నా విలువ ఏమిటి?' అనే ప్ర శ్న చాలామంది పిల్లల్ని కుంగదీస్తోంది.

బయటికి కనిపించేది చదువు మాత్రమే.కానీ వారు తమ మనస్సులలో ఒంటరితనం, ఆందోళన, నిరాశతో కూడిన యుద్ధం చేస్తున్నారు. పరీక్ష రద్దు వార్త వచ్చిన క్షణంలో కొందరు ఆగ్రహం వ్యక్తం చేసి ఉండొచ్చు. కొందరు ఏడ్చి ఉండొచ్చు. కానీ, ఇంకా ప్రమాదకరమైన స్పందన మరొకటి ఉంది. అది నిశ్శబ్దం. ఎందుకంటే చాలామంది పిల్ల లు ఇప్పుడు అలసిపోయారు; కేవలం చదువుతో కాదు, నిరంతర ఒత్తిడితో.ఇప్పుడు చేయాల్సింది మళ్లీ పరీక్ష నిర్వహించడం మాత్రమే కాదు. ముందుగా విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి నిర్మించాలి. తప్పు ఎక్కడ జరిగిందో స్పష్టంగా చెప్పాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విచారణలు పారదర్శకంగా జరగాలి. ఎందుకంటే రహస్యంగా జరిగే విచారణలు అనుమానాలను మరింత పెంచుతాయి. పరీక్షా నిర్వహ ణ వ్యవస్థను సాంకేతికంగా మరింత భద్రం గా మార్చాలి. ప్రశ్నాపత్రాల రవాణా నుంచి పర్యవేక్షణ వరకు ప్రతి దశలో డిజిటల్ ట్రాకింగ్ ఉండాలి.అంతకంటే ముఖ్యంగా, ఒకే పరీక్షతో జీవితాన్ని నిర్ణయించే విధానం గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చ ప్రారంభం కావాలి. స్కూల్ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలా? బహుళ దశల మూల్యాంకనం అవసరమా? రాష్ట్ర విద్యావ్యవస్థల పాత్ర పెరగాలా? అనే ప్రశ్నలపైనా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.విద్యార్థులకు ప్రత్యేక మద్దతు, స్థానిక భాషల్లో నాణ్యమైన వనరులు అందుబాటులోకి రావాలి. అలాగే ప్రతి కీలక పరీక్ష తర్వాత విద్యార్థులకు, తల్లిదండ్రులకు మానసిక కౌన్సెలింగ్ సపోర్ట్ కూ డా అవసరం. ఎందుకంటే పిల్లలు విఫలమవుతున్నది చదువులో కాదు, ఒత్తిడిని ఒం టరిగా మోయడంలో.దేశ భవిష్యత్తు పరీక్షా హాళ్లలో కూర్చు న్న ఆ పిల్లల చేతుల్లోనే ఉంది. వాళ్లు ప్రశ్నపత్రాలకు సమాధానాలే రాయడం లేదు, త మ జీవితాన్ని రాస్తున్నారు. అలాంటి సమయంలో వ్యవస్థ వాళ్లకు కనీస న్యాయం కూ డా ఇవ్వలేకపోతే, అది పాలనా వైఫల్యమే కా దు, సమాజంగా మనం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన క్షణం. ఎందుకంటే ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే. కానీ, ఒక త రం మనసులో విరిగిపోయిన నమ్మకాన్ని మళ్లీ నిర్మించడం చాలా కష్టం.

# 24న ఎక్స్‌పీరియమ్ పార్క్‌లో 'తాటి మ్యూజిక్ మేళా'

**- గీత వృత్తికి పూర్వవైభవం రావాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

**- రామదేవ్ రావును కలిసిన 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్ది శంకర్**



హైదరాబాద్, మే15 భారతశక్తి:తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన తాటి, ఈత చెట్ల రక్షణే ధ్యేయంగా ఈ నెల 24న ఎక్స్‌పీరియమ్ పార్క్ లో "తాటి (బాణణ్) మ్యూజిక్ మేళా" నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రాధాన్యత ఇదే..

రాష్ట్రవ్యాప్తంగా తాటి, ఈత మొక్కలను పెద్ద ఎత్తున పెంచే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గీత కార్మికుల సంక్షేమంతో పాటు, ప్రకృతి పానీయాల ప్రాధాన్యతను చాటిచెప్పేలా ఈ మేళా సాగనుంది. ఈ కార్యక్రమంలో వాసుదేవ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు.

### రామదేవ్ రావుతో పెద్ది శంకర్ భేటీ

కాగా, ఎక్స్‌పీరియమ్ పార్క్ వ్యవస్థాపకులు రామదేవ్ రావును "రెడీ టు సర్వ్' ఫౌండేషన్" వ్యవస్థాపక అధ్యక్షుడు 'పెద్ది శంకర్' మర్యాదపూర్వకంగా కలిశారు. సమాజ హితం కోసం రామదేవ్ రావు చేస్తున్న కృషిని శంకర్ కొనియాడారు. ఈ నెల 24న జరిగే మ్యూజిక్ మేళాకు రావాల్సిందిగా రామదేవ్ రావు ఆహ్వానించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, సంస్కృతిని బలోపేతం చేసేందుకు రామదేవ్ రావు చేపట్టిన ఈ ప్రయత్నం స్ఫూర్తిదాయకమని

# పెట్రోల్, డిజిల్ ధరల పెరుగుదలపై
# ఎల్బీనగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ నిరసన జ్వాల



ఎల్బీనగర్, మే 15 (భారత శక్తి ): కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుడిపై మోపుతున్న పెట్రో భారాన్ని నిరసిస్తూ నేడు ఎల్బీనగర్ చౌరస్తా హోరెత్తింది. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నేతృత్వంలో, గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి ప్లకార్డులు పట్టుకొని భారీ నిరసన చేపట్టారు.

నిరసన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పెట్రోల్, డిజిల్ ధరలను ఒక్కసారిగా 110 దాటించి సామాన్యుడి నడ్డి విరవడం దుర్మార్గమని మండిపడ్డారు. ముడి చమురు ధర తక్కువ ఉన్నప్పుడు ధరలు తగ్గించి సామాన్య ప్రజలకు భారం తగ్గించలేదు, అలాగే నేడు ముడిచముడు ధర పెరిగిందని ప్రజల మీద భారం వేయడం ప్రజా వ్యతిరేకం... కేంద్రం సెస్సుల పేరుతో, రాష్ట్రం వ్యాట్ (వాబా) పేరుతో ప్రజల రక్తాన్ని తాగుతున్నాయని ధ్వజమెత్తారు.

పొరుగు రాష్ట్రాల్లో ధరలు తక్కువగా ఉన్నా, మన వద్ద తగ్గించకపోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యమేనని ఎండగట్టారు.తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, లేదంటే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు.

# జనాభా గణన పక్కాగా జరగాలి

**- శంషాబాద్‌లో హౌస్ లిస్టింగ్ ప్రక్రియను తనిఖీ చేసిన కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

**- జూన్ 9 లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశం**



**హైదరాబాద్, మే 15: భారత శక్తి** జనాభా లెక్కల సేకరణలో క్షేత్రస్థాయిలో ఎలాంటి తప్పులు జరగకూడదని, ప్రతి ఇంటి డేటా పక్కాగా నమోదు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. శంషాబాద్‌లోని ఎన్యూమరేషన్ బ్లాక్ నంబర్లు 83, 94లలో కొనసాగుతున్న జనాభా లెక్కల గృహాల జాబితా (హౌస్ లిస్టింగ్) ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ సుమన్ రావుతో కలిసి క్షేత్రస్థాయి అమలు తీరును సమీక్షించారు.

### క్షేత్రస్థాయిలో పరిశీలన

గృహాల జాబితా నమోదులో ఎన్యూమరేటర్లు అనుసరిస్తున్న విధానాలను కమిషనర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లతో మాట్లాడి డేటా సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగారు. రికార్డుల నమోదులో ఖచ్చితత్వం పాటించాలని, ఏ ఒక్క ఇంటిని వదలకుండా ప్రతి గడపకూ వెళ్లాలని స్పష్టం చేశారు.

### గడువులోగా పూర్తి చేయాలి

ప్రస్తుతం జరుగుతున్న ఈ ప్రక్రియను నెల రోజుల్లోగా, అంటే జూన్ 9 నాటికి పూర్తి చేయాలని అధికారులకు డెడ్ లైన్ విధించారు. జనాభా గణన విధులకు ఆటంకం కలగకుండా సంబంధిత ఫీల్డ్ అధికారులు, బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లను వెంటనే ఈ విధుల్లో నియమించాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు.

### పౌరులు సహకరించాలి

"దేశాభివృద్ధికి కీలకమైన జనాభా లెక్కల సేకరణలో ప్రజలు భాగస్వాములు కావాలి. ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించి సహకరించాలి."

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**- తిరుమలగిరి ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి మార్కెట్‌లో అవగాహన సదస్సు**




**సికింద్రాబాద్, మే 15: భారత శక్తి** రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ బి. సుమతి, ట్రాఫిక్ డీసీపీ కె. రాహుల్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బోయిన్‌పల్లి మార్కెట్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ సభ్యులు, వాహనదారులు, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

### అలసత్వమే అనర్థం.. నిబంధనలే కవచం

ప్రయాణ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలకు తీరని లోటును మిగిలిస్తుందని ఏసీపీ హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో పాటించాల్సిన ముఖ్యమైన అంశాలను వివరించారు:

హెల్మెట్ ధారణ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

**మద్యం సేవించి డ్రైవింగ్:** మద్యం మత్తులో వాహనం నడపడం ఆత్మహత్యతో సమానమని, దీన్ని విడనాడాలని సూచించారు.

**మైనర్ డ్రైవింగ్:** పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**మొబైల్ వాడకం:** డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడటం వల్ల ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

**సీట్ బెల్ట్ & సిగ్నల్స్:** కారు ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకూడదని సూచించారు.

### 30 ఏళ్ల నిబద్ధతకు సత్కారం

ఈ కార్యక్రమంలో ఒక విశేషం చోటుచేసుకుంది. గత 30 ఏళ్లుగా ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా, క్రమశిక్షణతో ఆటో నడుపుతున్న డ్రైవర్ రమణయ్య ను పోలీసులు ప్రత్యేకంగా గుర్తించారు. ఆయన సురక్షిత డ్రైవింగ్ సేవలను కొనియాడుతూ అధికారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌కు రమణయ్య ఒక రోల్ మోడల్ అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి. సర్దార్ నాయక్, ఆర్ఐ ఐ.వి. రమణయ్య, ఎస్ఐలు మరియు మార్కెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సన్న రకం వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలి

## - ఆర్డీవో సదానందం

**సిద్దిపేట , మే 15( భరత శక్తి ):** సన్న రకం వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని ఆర్డీవో సదానందం అన్నారు. వానాకాలం - 2026 సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు మరియు పురుగుల మందుల సరఫరాపై దుబ్బాక డివిజన్ పరిధిలోని డీలర్లతో దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట రెవెన్యూ డివిజనల్ అధికారి సదానందం మాట్లాడుతూ రైతులు సన్న రకం వరి సాగు చేసేలా డీలర్లు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సన్న రకాల వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్న నేపథ్యంలో బీపీటీ--5204, తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, జైశ్రీరామ్, KNM--1638, WGL--44, WGL--962, JGL--1798 వంటి సన్న రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఈ రకాల సాగుతో మార్కెట్‌లో మంచి డిమాండ్‌తో పాటు మిల్లింగ్ నాణ్యత మెరుగ్గా ఉండి రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు.అనంతరందుబ్బాక ఏడీఏ కాంపాటి మల్లయ్య మాట్లాడుతూ ప్రతి డీలర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ ఉన్న కంపెనీల ఉత్పత్తులనే విక్రయించాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల ధరల పట్టికలను షాపుల వద్ద ప్రదర్శించడంతో పాటు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. అధిక ధరలకు విక్రయాలు చేసినట్లయితే శాఖాపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించి



రోజువారీ అమ్మకాలు, నిల్వలను నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, దుబ్బాక సీఐ రాజేష్, ఏఓలు మోహన్, మల్లేష్, సత్యనేష్, ఎస్సై రవికాంత్ రావు, ఏఈఓలు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పరిస్థితి

# అగమ్య గోచరంగా మారింది

## – బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు రాజులు – మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 15 ( భారత శక్తి ):**ఎలాంటి షరతులు లేకుండా రైతులు పండించిన మొక్కజొన్న పంటను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలి మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు అన్నారు.హాజీపూర్ మండలంలోని గుడిపేట మరియు సబ్బపల్లి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించి,రైతులతో మాట్లాడి కొనుగోలు నిర్వహకులు మొక్కజొన్న పంటకు ఒక ఎకరానికి 26 క్వింటాలు మాత్రమే తీసుకుంటున్నారు,ఎలాంటి షరతు లేకుండా ఎకరానికి 40 క్వింటాలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు,అదేవిధంగా కాంటా అయిన తర్వాత పంటను తరలించడానికి బ్యాగుకు 2 రూపాయల చొప్పున అడుగుతున్నారు,గతంలో రెండు రూపాయలు అనేది ఎప్పుడూ తీసుకోలేదు,ఇది అవినీతికి నిలువెత్తు నిదర్శనం కదా అని డిమాండ్ చేశారు.కొనుగోలు నిర్వాహకులు మొక్కజొన్న పంటకు ఎకరానికి 26 క్వింటలు మాత్రమే తీసుకుంటామని అంటున్నారు ఎలాంటి తరుగు లేకున్నా 40 క్వింటల్లు తీసుకోవాలి. ఒకవేళ కొనుగోలు నిర్వాహకులు తీసుకోకపోతే రైతుల దగ్గర నుండి దళారులు తక్కువ రేటుతో పంటను కొనుగోలు చేసే అవకాశం ఉంది.అంతేకాక రైతు పండించిన పంటలను కొనవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి అని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు రాజుల బతికిన కాలం చూసాం కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది అని అన్నారు. వెంటనే రైతుల పండించిన పంటను ఎలాంటి షరతులు తరుగు లేకుండా కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతుల తరపున బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది అని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొనుగోలు నిర్వాహకులతో కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని తెలిపారు.దీనిపై ఉన్నత అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది.

# పెండింగ్ లో ఉన్న కూలీల వేతనాలు విడుదల చేయాలి

- రెండుసార్లు ఫోటోలు తీసే విధానం రద్దు చేయాలి.
- వి బి జి రాంజీ చట్టం రద్దు చెయ్యాలి. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పునరుద్ధించాలి
- ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా
- ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య



**మెదక్ జిల్లా నర్సాపూర్ మే 15 (భారత శక్తి న్యూస్):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నర్సాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ధర్నాను ఉద్దేశించి ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా చేసిన అనేక పోరాటాల ఫలితంగా పార్లమెంట్ లో వామపక్షాలు మద్దతుతో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ప్రతి కుటుంబానికి వంద రోజుల పని గ్యారెంటీ చేస్తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 2005లో ఆమోదించింది. 2006 అక్టోబర్ 2 నుండి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. దీని ద్వారా కోట్లాదిమంది వ్యవసాయ వ్యవసాయ కార్మికులకు,చిన్న, మధ్య తరగతి రైతాంగానికి చేతినిండా పని కల్పించబడింది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు పని కోసం పేదల వలసలు తగ్గాయి .గ్రామీణ వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులలో కనీస వేతనాలను పెంచుకున్నారు .ఆడ మగ తేడా లేకుండా సమాన వేతనాలు దేశంలో మొదటిసారి అమలు జరిగాయి. కోట్లాది రూపాయలను కేంద్ర ప్రభుత్వం వేతనాల రూపంలో పేదలకు ఇవ్వడం వలన ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది . పేదరికం,అప్పుల ఊబి నుండి కోట్లాది నిరుపేద కుటుంబాలు బయటపడ్డాయి.2008లో ప్రపంచంలో ఆర్థికమాంద్యం వచ్చినప్పుడు భారతదేశాన్ని గట్టెక్కించినది గ్రామీణ ఉపాధి హామీ చట్టం. పట్టణ ప్రాంతాల పేదలకు ఉపాధి పని పెట్టాలని, 100 రోజుల పని దినాలను 200 రోజులకు పెంచాలని,రోజు కూలి రూ 600 ఇవ్వాలని దేశవ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు ఉధృతం అవుతున్న తరుణంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది. దీని స్థానంలో విబిజి రామ్ జి చట్టాన్ని తెచ్చింది.గతంలో 90% నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 60 శాతం మాత్రమే ఇస్తాము 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని నిర్ణయం చేసింది . పని దినాలను 125 రోజులకు పెంచినట్లే పెంచి వ్యవసాయ సీజన్ లో 60 రోజుల పనిని బంద్ చేస్తామని పేర్కొన్నది. కనీస వేతనం రోజు కూలి రూ 178 గా పేర్కొన్నది .ఇది రాజ్యాంగబద్ధ పని హక్కును హరించడమే. పని కల్పించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకో చూస్తున్నది. రోజు కూలి రూ 307 ఇవ్వాలి. కానీ రూ 150 మించి పడటం లేదు. వీటిని కూడా అనేక గ్రామాలలో గత సంవత్సరం చేసిన పనికి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు. ఇప్పుడు చేస్తున్న పనికి నాలుగు వారాలుగా వేతనాలు ఇవ్వలేదు. వారం వారం కూలీల వేతనాలు ఇవ్వాలి అనే చట్టం డైరెక్షన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. ఎండలు తీవ్రంగా పెరుగుతున్నాయి కానీ పని ప్రదేశంలో త్రాగడానికి నీరు నీడకు టెంటు,ఓ ఆర్ ఎస్, మెడికల్ కిట్ నువ్వంటే కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ...బిజెపి ప్రభుత్వం పేదలపై కక్షగట్టి పనిని తీసివేయాలని చూస్తున్నది. అందులో భాగమే అని ప్రదేశంలో ఉదయం సాయంత్రం ఫోటోలు ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడానికి నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం తెచ్చింది.అడవులు గుట్టలలో పని దగ్గర ఫోన్ సిగ్నల్స్ సరిగా లేక ఫోటోలు అప్లోడ్ కావడం లేదు. ఫలితంగా పని చేసిన కూలీలు పనికిరాని వారుగా రికార్డులలో నమోదు అవుతున్నది. మరొకవైపు డ్రోన్ యంత్రం ద్వారా ఫోటోలు తీస్తున్న వాటిని లెక్కలోకి తీసుకోవడం లేదు. కొత్తగా ఐరిస్ ఫోటోలు తీస్తామంటున్నారు.మెట్ల వ్యవస్థను రద్దు చేశారు. పని దినాలు తక్కువ పేరుతో అసిస్టెంట్లను తీసి వేస్తున్నారు. ఆధార్ కార్డు ,జాబ్ కార్డు , బ్యాంకు ఎకౌంటు నంబర్ల లింకు పేరుతో లక్షలాదిమంది జాబ్ కార్డు లను తొలగించారు .నిధులలో భారీ కోత దీవించారు. ఆన్లైన్ పేమెంట్ పేరుతో వేతనాలను పెండింగ్ లో పెడుతున్నారు. తక్షణమే ఈ విధానాలను రద్దు చేయాలి. అడిగినవారికి జాబ్ కార్డు ఇవ్వాలి.కూలీల పొట్ట కొట్టే విబిజీ రాం జీ చట్టం రద్దు చేయాలి. పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి. పట్టణ పేదలకు ఉపాధి పని కల్పిస్తాం పని దినాలను 150 రోజులకు పెంచుతాం , రోజు కూలి రూ 400 ఇస్తాం అన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాశీ.నర్సాపూర్ మండలంలో పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.వేతనాలు బకాయిలున్నాయని అన్నారు.టెంట్, ఓ ఆర్ ఎస్, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

### "పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తాం:ఎంపీడీఓ"

నర్సాపూర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్, మంచి నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ పంపిణి చేయడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. బకాయి వేతనాలు చెల్లిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల శ్రీనివాస్, ఆంజనేయులు, యాదయ్య, పి శ్రీనివాస్, సుగుణ, రంగయ్య, యాదమ్మ, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు

# NEET UG పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ఆగ్రహ జ్వాలలు



రేగొండ మే 15 (భారత శక్తి) యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో చేసినారు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని యువజన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ మాట్లాడుతూగత 10 సంవత్సరాల్లో వరుసగా 89సార్లు జరుగుతున్న పేపర్ లీక్‌లు కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని .విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల ఆశలు, యువత భవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా నాశనం చేస్తోందని...దేశంలో చదువుకునే విద్యార్థులకు భద్రత ఇవ్వలేని ప్రభుత్వం అధికారంలో ఉండే అర్హత కోల్పోయిందని" అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చీూ నే స్వయంగా పేపర్ లీక్ జరిగినట్లు అంగీకరించి పరీక్షను రద్దు చేయడం దేశ విద్యా వ్యవస్థకు మచ్చ అని అన్నారు. పేపర్ లీక్ మాఫియాకు అండగా నిలుస్తున్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును కాపాడే వరకు యువజన కాంగ్రెస్ పోరాటం ఆగదని అని కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచుల మహేశ్, రేగొండ మండల అధ్యక్షులు కోయిలా క్రాంతి చిట్యాల మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్, శాయంపేట మండల అధ్యక్షులు సాదు నాగరాజు టేకుమట్ల మండల అధ్యక్షులు కొలుగూరి అనిల్ మొగుళ్ళపల్లి మండల ఉపాధ్యక్షులు మెరుగు సురేష్ గౌడ్ యువజన కాంగ్రెస్ నాయకులు, బోయినీ మధుకర్,బొమ్మ కిరణ్, పున్నం ప్రవీణ్,కీర్తి రాజు, మేకల శివ,మహేశ్ , గట్టు కుమార్,నాగరాజు, నరేందర్ రెడ్డి, సుమన్, రాజకుమార్, సురేష్, శ్రీను, హరీష్, కిషన్ మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

# పుస్తకాలు చదువుకోని బావి భారత పౌరులు గా నిలవండి




**ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మే15** ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక ఐదవ రోజు - 15 మే 2026విద్యా వారోత్సవాల నిర్వహణ కార్యాచరణ ప్రణాళిక తెలంగాణ ప్రభుత్వం కళాశాల విద్యాశాఖ కమిషనరేట్ వారు జారీచేసిన సర్క్యులర్ ప్రకారం 11 మే 2026 నుండి 17 మే 2026 వరకు నిర్వహించబడునున్న విద్యా వారోత్సవాల అమలుకు అనుకూలంగా ఐదవ రోజు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాలు:- మన గ్రంధాలయ జ్ఞానోత్సవం( కళాశాల స్థాయి )ప్రధాన కార్యక్రమాలు:- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐదవ రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబాబాద్ లో తెలంగాణ కవి అందెశ్రీ రచించిన "నిప్పుల వాగు"తెలంగాణ ఉద్యమ పాట అనే పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి లక్ష్మణ్ నాయక్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణలో అందెశ్రీ రచించిన అనేక పుస్తకాలలో ఇది గొప్ప పుస్తకం అని కొనియాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఉన్న అనేకమంది కవుల యొక్క ప్రతిబింబం ఈ పుస్తకమని ప్రశంసించారు. అలాగే ప్రతి విద్యార్థిని విద్యార్థులు జీవితంలో అనేక మంచి పుస్తకాలు చదువుకొని క్రమశిక్షణగా మెలిగి మంచి బావి భారత పౌరులుగా తయారవ్వాలని సూచించారు. అలాగే శుక్రవారం కళాశాల లైబ్రరీలో అనేక పుస్తకాలను ప్రదర్శించడం జరిగింది. పుస్తకాలు మానవులకు మంచి నేస్తాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల గ్రంథ పాలకులు డాక్టర్ డి.రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ జూపూడి అనిల్ కుమార్ అధ్యాపకులు డాక్టర్ మసూద్ అహ్మద్, డాక్టర్ వి సాంబశివరావు, డాక్టర్ బి వినోద్ కుమార్ , డాక్టర్ డి. రాజశేఖర్, డాక్టర్ అన్నపూర్ణ డాక్టర్, బి హాతిరామ్, డాక్టర్ ఖాసీంషా, యం.సుమన్, డాక్టర్ పి యుగేందర్, డాక్టర్ యం వీరు, డాక్టర్ కే సుమలత, యం సంతోష్ కుమార్, జె రవితేజ , వై యాకయ్య,ఓ ఉదయ్ కుమార్, యన్ నరేష్, డి ఎస్ రామన్న, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం.!

- రైతులు ఆందోళన చెందవద్దు
- పౌరసరఫరాల అధికారి శివకుమార్







మణుగూరు/పినపాక మే 15 (భారతశక్తి): ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని పౌరసరఫరాల శాఖ అధికారి గుంటి శివకుమార్ అన్నారు. శుక్రవారం మణుగూరు, పినపాక పాడి సెంటర్లను పరిశీలించారు. మణుగూరు మండలంలోని రామానుజవరం పాడి సెంటర్లో 260 క్వింటాల ధాన్యం, పినపాక లోని పాడి సెంటర్లో మరో 260 క్వింటాల ధాన్యం ను లారీల్లో లోడు చేసి ధనలక్ష్మి బాయిల్డ్ రైస్ మిల్లు లక్ష్మీపురంకు తరలించినట్లు తెలిపారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో అరబోసిన ధాన్యం ను పరిశీలించారు. గ్రామస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు ఎదురైతే స్థానిక అధికారులను సంప్రదించాలన్నారు.

# మహిళా సంక్షేమానికి మరో అడుగు.. ?

## మహిళా భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




ఎల్బీనగర్, మే 15 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన మహిళా భవనాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.మహిళలకు ఆర్థిక, సామాజిక పరంగా మరింత బలాన్ని చేకూర్చేందుకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని తెలిపారు.మహిళా భవనం ద్వారా స్థానిక మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు మరియు వివిధ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు.అనేక సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం తగిన చొరవ చూపడం లేదని విమర్శించారు. పేదలు, కార్మికులు, మహిళలు, యువత కోసం ప్రత్యేక పథకాలు అమలు కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.ప్రజలకు న్యాయం జరిగేలా మంచి పాలన అందించడమే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని కానీ ఇప్పుడున్న ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని తప్పుడు వాగ్దానాలతో కాలం వెళ్ళబుచుతున్నారని ఆమె పేర్కొన్నారు. అలాగే రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గతంలో పలు చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. మొదట్లో కొన్ని అభివృద్ధి పనులు ప్రజలకు అర్థం కాలేదని, కానీ తరువాత వాటి ప్రయోజనాలు స్పష్టంగా కనిపించాయని అన్నారు. చిన్న రోడ్లను విస్తరించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని భావించామని, అయితే కొన్ని ప్రాంతాల్లో ఇంకా ట్రాఫిక్ జామ్ సమస్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఏది ఏమైనా ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్ని అమలుపరిచే అంత వరకు ప్రజల పక్షాన పోరాడుతామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమంలో

# పాల్గొన్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**కొలిమిగుండ్ల** బనగానపల్లి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నాడు ప్రజా దర్బారు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజా దర్బారులో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి వినతి పత్రాలను అందజేశారు. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిగత కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 12 నాటికి మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే
# గురుకుల విద్యాలయాన్ని సిద్ధం చేయాలి
**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప, మే 15(భారత శక్తి ) : జిల్లాలో అధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల విద్యాలయాన్ని జూన్ 12 నాటికి సిద్ధం చేసి నిర్వహణలోకి రానుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో నూతనంగా రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులు సంబందిత అంశాలపై సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాల, జూ.కళాశాల వెనుకబడిన తరగతులు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనుందన్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాలయాన్ని ఈ విద్యా సంవత్సరం ప్రారంభం (జూన్ 12) నాటికి నూతన భవనంలో సదుపాయాలు సిద్ధం చేసి తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు. నిర్దిష్ట సమయంలోగా కాంట్రాక్ట్ ఏజెన్సీలు నిర్లక్ష్యం వహించి పనులు పూర్తి చేయకపోతే కాంట్రాక్టు రద్దు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే కాంట్రాక్టర్లు పనుల తత్సరంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం తరగతుల ప్రారంభం నాటికి అన్ని పెండింగ్ పనులు పూర్తి చేసి.. కొత్త భవనంలో హాస్టల్, తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు.అలాగే ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను నిర్ణీత గడువులోగా సిద్ధం చేయాలని సంబందిత అధికారులను అదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ జి. చంద్రశేఖర్, ఈఈ మాధవి, డిఈ జగదీశ్వర్ రెడ్డి, బిసి రెసిడెన్షియల్ విద్యాసంస్థలు కోఆర్డినేటర్ రామ కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ హరిత, కాంట్రాక్టు ఏజెన్సీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని
# రోడ్డు పై రైతుల నిరసన
**రైతుల నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర.**



రేగొండ మే 15 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లింగాల గ్రామంలో మక్క రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి చూస్తున్నా మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతులు మిల్లు ఎదుట రోడ్డుపై ధర్నాకు దిగారు.ఈ ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు.ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు మిల్లుల వద్ద ట్రాక్టర్లతో పడిగాపులు కాస్తున్నా రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు రోజులుగా మక్క లోడ్లతో మిల్లు వద్దే ఉంటున్నామని, కానీ అధికారులు కొనుగోలు ప్రక్రియ ప్రారంభించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.రోజుకు ఒక్కో ట్రాక్టర్‌కు రెండు వేల రూపాయల వరకు కిరాయి చెల్లించాల్సి వస్తోందని, ఇప్పటికే వేలాది రూపాయలు నష్టపోయామని రైతులు వాపోయారు. వెంటనే కొనుగోలు ప్రారంభించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూరైతులను ఇంతలా ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు .పంట పండించేందుకు రైతు చేసిన కష్టాన్ని ప్రభుత్వం గౌరవించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, వెంటనే అధికార యంత్రాంగం స్పందించి మక్క కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అంకం రాజేందర్ మాజీ సర్పంచ్ బిక్య నాయక్ మాజీ ఎంపీటీసీ పగడాల ఐలయ్య వివిధ గ్రామాల పార్టీ నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్న

## ధర్మపురి గ్రంథాలయానికి 100 పుస్తకాలను అందజేసిన 11వ వార్డ్ కౌన్సిలర్ జక్కు పద్మ రవీందర్



జగిత్యాల మే 15 (భారతశక్తి ప్రతినిధి ) జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగణభట్ల దినేష్ పిలుపుతో గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మపురి 11వ వార్డ్ కౌన్సిలర్ జక్కు పద్మ రవీందర్ 100 గ్రూప్ 1, గ్రూప్ 2 కు సంబంధించిన పుస్తకాలను వారి కుమారుడు ఎక్సైజ్ సబ్ఇన్స్పెక్టర్ జక్కు ప్రమోద్ చైతన్య సహకారంతో ధర్మపురి గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జక్కుపద్మ రవీందర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ అందించడం ఆనందంగా ఉందని ఇదే బాటలో గతంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారందరూ స్థానిక గ్రంథాలయాలకు తోడ్పాటు అందించాలని కోరారు.

## జగిత్యాల జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరియు
# రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల,మే 15 ( భారత శక్తి ప్రతినిధి): జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ధర్మపురి మండలం, జైన, రాజారాం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, దుబ్బల గూడెం గ్రామంలో మొక్కజొన్న గోదాం అలాగే దమ్మన్న పేట గ్రామంలోని పరమేశ్వర రైస్ మిల్, ధనలక్ష్మి రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఐకెపి కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు.అదేవిధంగా రాష్ట్రంలో మరియు జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్ఫలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్ఫాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వస్తున్న వరి ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేసిన వెంటనే లారీలను త్వరితగతిన పంపించాలని మిల్లర్లను ఆదేశించారు. రైతులు మరియు రవాణాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు.మిల్లుల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, మిల్లింగ్ సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిల్లర్లు హమాలీలను అందుబాటులో ఉంచుకొని వచ్చిన ధాన్యాన్ని దింపుకోవాలని అలాగే మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లు, అధికారులు సమన్వయం చేసుకొని కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ , సివిల్ సప్లైస్ డిఎం జితేంద్ర ప్రసాద్ , తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.


# రాయపట్నం చెక్‌పోస్ట్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల, మే 15 ( భారత శక్తి ప్రతినిధి ): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని రాయపట్నం చెక్‌పోస్ట్‌ను బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మరియు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ , డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మరియు పోలీసు అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. చెక్‌పోస్ట్ వద్ద భద్రతా ఏర్పాట్లు, వాహనాల తనిఖీలు, రాత్రి పహారా విధులు మరియు సిబ్బంది అప్రమత్తతను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లా సరిహద్దుల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలు, అక్రమ రవాణా మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజలు కూడా పోలీసులకు సహకరించి వదంతులను నమ్మకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ్ నర్సింహారెడ్డి మరియు ధర్మపురి ఎస్సై జి మహేష్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా
# తెలంగాణ రూపు దిద్దుకుంటోంది

**- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు - వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి**
**- మంత్రి దామోదర్ రాజనర్సింహా**
**- కెజేఎస్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్--xx కు శంకుస్థాపనచేసిన మంత్రులు**




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి మే 15: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగారపల్లి గ్రామ శివారులో కే జేఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్--xx కు శుక్రవారం శంకుస్థాపన చేశారు.రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి



అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత



ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లు ఏర్పాటుకానున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 9 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఎదగనున్న నేపథ్యంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు.జహీరాబాద్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని నిమ్జ్



ను అతిపెద్ద పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.65 శాతం పైగా యువత నైపుణ్యాలను వినియోగించుకొని తెలంగాణను మరింత శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను గుర్తించి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.తెలంగాణ దేశంలో అత్యధిక వరి ధాన్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా నిలిచిందని, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు వంటి ఉత్పత్తులలో కూడా రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు విలువను పెంచే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటవడం రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు.పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ,




ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్‌చెరు గుర్తింపు పొందిందన్నారు. అదే తరహాలో వెనుకబడిన ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇంత పెద్ద స్థాయిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న కే జేఎస్ ఇండియా యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు.పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. మెదక్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి స్వర్గీయ ఇందిరా గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఏర్పడిన పారిశ్రామిక ప్రోత్సాహక చర్యలే కారణమన్నారు.సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఇంకా అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టి జి ఐ ఐ సి చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, టీజీఐఐసి ఎండి శశాంక్ , మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి,
స్థానిక ప్రజాప్రతినిధులు, కంపెనీ చైర్మన్ గిరీష్ జైన్,ఎండి సి.పి. రాంకా , అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు

**- కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ**



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి మే 15 : సంగారెడ్డిలో ప్రజా ప్రజాపాలన ప్రగతి పాలనలో భాగంగా తారా ప్రభుత్వ కళాశాలలో విద్యా వారోత్సవాలలో ఐదవ రోజు కళాశాలలో లైబ్రరీ మరియు ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ,పుస్తక రివ్యూ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పుస్తకాలు విజ్ఞానాన్ని పెంపొందించే విజ్ఞాన సంపదని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ అన్నారు.. లైబ్రరీ,ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ ఆర్థర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు కలిగిన అతిపెద్ద లైబ్రరీ సదుపాయం అందుబాటులో ఉందని, ఇందులో పాఠ్య సంబంధించిన పుస్తకాలతో పాటు, వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు.. కళాశాల విద్యార్థులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని, పుస్త కాల ద్వారా అపారమైన జ్ఞానము పెంపొందించబడుతుందని, ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానము అభివృద్ధి చెందుతున్న కాలంలో వ్యక్తి యొక్క మనసు ప్రశాంతతను పెంపొందించేవి, మానసిక సామర్థ్యాన్ని పెంపొందించి విజ్ఞానాన్ని పెంపొందించేవి కేవలం పుస్తకాలు మాత్రమేనని, వీటిని ప్రతి ఒక్కరూ చదవడం అలవాటుగా చేసుకోవాలని తెలిపినారు .పుస్తకాలు విజ్ఞానాన్ని అందించడమే కాకుండా మానసిక ప్రశాంతతకు తోర్పడతాయని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, సంస్కృతిక సంపదను పెంపొందించుటకు, ప్రస్తుత తరం చరిత్రను తెలుసుకొని భవిష్యత్తు తరాలకు అందించడానికి మార్గదర్శకాలు పుస్తకాలేనని తెలిపారు.. విద్యా వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో లైబ్రరీ డిపార్ట్మెంట్ వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నిర్మల ,లైబ్రరీ మరియు ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ ఇనోక్ ఆర్డర్ ,వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందము తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల నియామకం



జగిత్యాల మే 15 (భారతశక్తి ప్రతినిధి): శుక్రవారం రోజున ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన కో-ఆప్షన్ ప్రత్యేక సమావేశంనిర్వహించబడిందిఇట్టి సమావేశంలో కో-ఆప్షన్ ఎన్నిక నిర్వహించగా, స్పెషల్ నాలెడ్జ్ కోటాలో మహిళా కోటాలో ఆశెట్టి మమత శ్రీనివాస్, జనరల్ కోటాలో గరిగే అరుణ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అలాగే మైనారిటీ కోటాలో మహిళా కోటాలో మొహ్మద్ నఫీజ్ సుల్తానా రఫీఉద్దీన్, జనరల్ కోటాలో షౌకత్ పాషాఏకగ్రీవంగా ఎన్నికైనారు.ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులకు చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి , కమిషనర్ ఎం. శ్రీనివాస్ రావు, వైస్ చైర్ పర్సన్ ఇందారపు రామన్న మరియు కౌన్సిల్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాలనీ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-అభివృద్ధికి అండగా ఉంటా: మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**

**- శ్రీరామ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ వినతి**



బి.ఎన్.రెడ్డి నగర్, మే 15: భారత శక్తి, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శ్రీరామ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా.. కమిటీ సభ్యులు శుక్రవారం లచ్చిరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

### అభివృద్ధి బాటలో శ్రీరామ్ నగర్

ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీరామ్ నగర్ కాలనీలో ఇప్పటికే 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని వివరించారు. రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రధాన పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన సమస్యలను కూడా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నూతన కమిటీ కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

### కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు:

సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాము గౌడ్, ట్రెజరర్ శేఖర్, గౌరవ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పుష్పాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీలు రవీందర్ రెడ్డి, రాకేష్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు కృష్ణారెడ్డి, దయానంద్ గౌడ్, అడ్వైజర్లు రంగారెడ్డి, రవీందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిస్ట్ ఫ్యూజన్ క్రికెట్ లీగ్ కు తేదీలు ఖరారు..

**ఆరు టీములతో జూన్ 9,10 న బరిలో దిగనున్న కళాబృందం..**




హైదరాబాద్ :మే ( 15) హైదరాబాద్ బిఎస్ఆర్ క్రికెట్ గ్రౌండ్ లో కళాకారులు తొలిసారి నిర్వహిస్తున్న ఆర్టిస్ట్ ఫ్యూజన్ క్రికెట్ లీగ్ జూన్ 9, 10 తేదీలు ఖరారు అయినాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి వస్తున్న సింగర్స్, టీవీ, స్టేజ్ మరియు వివిధ రంగాల కళాకారులకు ఒకే వేదికగా ఈ క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెంట్లో ఆరు టీంలు జూన్ 9న ( బి ఎస్ ఆర్ ) క్రికెట్ గ్రౌండ్ లో ఉదయం ఎనిమిది గంటలకు తలపడుతున్నట్లు టీం ఆర్గనైజేషన్స్ వెల్లడించారు.

# సూర్య వెలుగు కథనాలకు స్పందన

**-ఫాస్టఫుడ్ సెంటర్ పై మెరుపు దాడి**

**-ఆరు డొమెస్టిక్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్న పౌరసరఫరాల అధికారి**



మణుగూరు మే 15 (భారతశక్తి) : పౌరసరఫరాల శాఖ అధికారి గుంటి శివకుమార్ శుక్రవారం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై మెరుపుదాడి చేసి గృహ అవసరాలకు వినియోగించే ఆరు డొమెస్టిక్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. భారతశక్తి దినపత్రికలో బ్లాక్ మార్కెట్లో వంట గ్యాస్, పర్యవేక్షణ లోపంతో నిలువు దోపిడీ అంటూ వరుస కథనాలు ప్రచురించడంతో స్పందించిన సంబంధిత అధికారి మణుగూరు లోని ఫాస్ట్ ఫుడ్, రెస్టారెంట్లు, హోటల్లో తనిఖీలు నిర్వహించారు.

మణుగూరు పట్టణంలోని పూల మార్కెట్ సమీపంలో గల శ్రీ కనకదుర్గ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు 6 డొమెస్టిక్ సిలెండర్లను రహస్య ప్రాంతాల్లో నిల్వలు ఉంచి వినియోగిస్తున్నారు. పేదలకు చెందాల్సిన సబ్సిడీ సిలెండర్లు బ్లాక్ మార్కెట్ తరలిపోతుంటే గృహ వినియోగదారులు పడరాని కష్టాలు పడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్, రెస్టారెంట్లు, హోటల్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలకు చెక్ పెట్టడంతో గృహ వినియోగదారులు పౌరసరఫరాల శాఖ అధికారిపై ప్రశంసలజల్లు కురిపించారు.

అక్రమంగా డొమెస్టిక్ సిలెండర్లు వాడే మిగతా హోటళ్ళు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకులు అధికారులను చూసి తమ తమ సెటర్లకు తాళాలు వేసుకున్నారు. సబ్సిడీ సిలెండర్లు అక్రమంగా బ్లాక్ లో క్రయవిక్రయాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు




# సంగారెడ్డిలో టీజీఐఐసీ కార్యాలయం ప్రారంభోత్సవం

**- హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్? బాబు, దామోదర్? రాజనర్సింహ**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి మే 15 : సంగారెడ్డి పట్టణంలోని ఆదర్శ్ నగర్ లో టీజీఐఐసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని నూతన కార్యాలయంలోని కుర్చీలో కూర్చోబెట్టారు.

మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్,



నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, టీజీఐఐసీ అధికారులు ఈ సందర్భంగా నిర్మలా



జగ్గారెడ్డికి అభినందనలు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రంపై విమర్శలు

**- రైతులు, విద్యార్థుల అంశాలపై స్పందన- మంత్రి శ్రీధర్ బాబు**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి మే 15: సంగారెడ్డిలో నిర్మలా జగ్గారెడ్డి నివాసంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్ కూడా పాల్గొన్నారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 పెంచడం ప్రజలపై భారంగా మారిందని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం ధరల పెంపు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. బెంగాల్, తమిళనాడులో ఎన్నికల చివరి దశకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని అధికార వర్గాలు చెప్పి, ఇప్పుడు పెంపు చేయడం ద్వారా ఓటర్లను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గిన సమయంలో కేంద్రం ప్రజలకు ఎప్పుడైనా ఉపశమనం కల్పించిందా అని బీజేపీని ప్రశ్నించారు.ఇప్పుడు రూ.3 పెంచి, ఇంకా ధరలు పెరిగే సంకేతాలు ఇస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పై అదనపు భారం మోపి పేదల , సామాన్య ప్రజల నడ్డి విరచడమే బీజేపీ అసలు స్వరూపం" అని వ్యాఖ్యానించారు. గత 12 ఏళ్లలో అంతర్జాతీయంగా చమురు ధరలు అత్యల్ప స్థాయికి చేరినా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ప్రయోజనం కల్పించలేదని విమర్శించారు.రాజకీయ అంశాలపై స్పందిస్తూ, ప్రజలను విభజించడం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడం బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా జీవించాలని రాహుల్ గాంధీ కోరుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు విజ్ఞానవంతులని, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను అంగీకరించరని అన్నారు.రాష్ట్ర



ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికే కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులందరూ సమిష్టిగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సక్రమంగా వినియోగిస్తామని చెప్పారు.ధాన్యం కొనుగోలు అంశంపై మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి భారీగా ధాన్యం మార్కెట్కు వచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి రెండు రోజులకు ఒకసారి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్నారని, చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు. నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై కూడా మంత్రి స్పందించారు. దాదాపు 23 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వం ఆడుకుందని ఆరోపించారు. ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివిన విద్యార్థులకు



కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, "చట్టాలను చుట్టాలుగా బీఆర్ఎస్ ఉపయోగించినట్లు మేము చేయము. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది" అని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

# పేదలను దోచుకోవడమే పనిగా మోడీ పరిపాలన



**- ఎన్నికలయ్యాక వాత.. ఇంధన ధరలతో వంచన**

**- కార్పొరేట్లకు 'దోచిపెట్టి'.. సామాన్యుడిని 'ముంచిపెట్టి'**

**- దేశానికి కాంగ్రెస్ పాలనే శ్రీరామరక్ష: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం, మే 15 : భారత శక్తి "కేంద్రంలోని మోదీ సర్కార్ నిర్ణయాలు సామాన్యుడి పాలిట శాపాలుగా మారాయి. పదేళ్ల కాలంలో పేదల సంక్షేమాన్ని పాతరేసి, అడుగడుగునా ఆర్థికంగా అణచివేతకు గురిచేస్తున్నారు" అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నిప్పులు చెరిగారు. మత విద్వేషాలు, జాతీయవాదం పేరుతో ఓట్లు దండుకుని గెలిచిన తర్వాత.. ప్రజల నడ్డి విరవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.

### ఓట్ల కోసం మౌనం.. గెలిచాక పెంపు!

ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ ధరల పెంపుపై మౌనంగా ఉన్న కేంద్రం.. పోలింగ్ ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను వంచించిందని మల్‌రెడ్డి మండిపడ్డారు. ఇది 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా' తయారైందని ఎద్దేవా చేశారు. "బంగారం కొనొద్దు.. ఖర్చులు తగ్గించుకోవాలి.. వాహనాలు వాడొద్దు" అని ప్రధాని చెప్పడం ఆయన వైఫల్యానికి నిదర్శనమని, దేశం ఇలాంటి స్థితికి రావడానికి కారణం ఎవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### పీవీ, మన్మోహన్ బాటలోనే దేశం..

మూడు దశాబ్దాల క్రితం దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలే నేటికీ దేశాన్ని నడిపిస్తున్నాయని మల్‌రెడ్డి గుర్తు చేశారు. మోదీ సర్కార్ సరైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలం కావడం వల్లే నేడు ఆర్థిక విపత్తులు సంభవిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో వచ్చిన ఉపాధి హామీ పథకం వంటి ప్రజాహిత కార్యక్రమాలను నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాలపై భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కార్పొరేట్లకు 'కాపలా'.. ప్రజలకు 'తిప్పలు'..

పేద ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన మోదీ.. కార్పొరేట్ శక్తులకు వంతపాడుతున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రజలకు సరైన పాలన అందుతుందని ఆయన స్పష్టం చేశారు. మళ్ళీ కాంగ్రెస్ రావాల్సిన అవసరాన్ని నేటి పరిస్థితులు కళ్ళకు కడుతున్నాయని తెలిపారు.

# ఐస్ క్రీం తినడం వల్ల శరీరం నిజంగానే చల్లబడుతుందా?

ఐస్ క్రీం అంటే చాలా మందికి ఇష్టం.. దీనిని అన్ని వేళలా తినడానికి ఇష్టపడతారు.. ముఖ్యంగా వేసవిలో, చల్లటి పదార్థాలు తినాలని అనిపిస్తుంది. ఈ సీజన్‌లో ప్రజలు ఐస్ క్రీం ఎక్కువగా తీసుకుంటారు.. దాని నుంచి చల్లదనాన్ని పొందుతారు. కానీ ఐస్ క్రీం తినడం నిజంగా శరీరాన్ని చల్లబరుస్తుందా? ఐస్ క్రీం అంటే చాలా మందికి ఇష్టం.. దీనిని అన్ని వేళలా తినడానికి ఇష్టపడతారు.. ముఖ్యంగా వేసవిలో, చల్లటి పదార్థాలు తినాలని అనిపిస్తుంది. ఈ సీజన్‌లో ప్రజలు ఐస్ క్రీం ఎక్కువగా తీసుకుంటారు.. దాని నుంచి చల్లదనాన్ని పొందుతారు. కానీ ఐస్ క్రీం తినడం నిజంగా శరీరాన్ని చల్లబరుస్తుందా? లేదా ఇది కేవలం రుచి - మనసుకు సంతృప్తి కలిగించే విషయమా? తరచూ చాలా మందికి ఈ ప్రశ్నకు తలెత్తుతుంది.. ఈ దీనిపై నిపుణులు ఏం చెబుతున్నారు..? వైద్య శాస్త్రం ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తుంది.

ఐస్ క్రీం తినడం శరీరంపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది..? ఈ ఆసక్తికర విషయాలను తెలుసుకోండి.. మనం ఐస్ క్రీం తిన్న వెంటనే నోటి లోపల దాని చల్లని ఉష్ణోగ్రతను అనుభవిస్తాము. దీనివల్ల నాలుక - నోటి నరాలు చల్లగా అనిపిస్తాయి. దీని ప్రభావం మెదడుకు చేరుకుంటుంది.. మెదడు మన శరీరం అంతటా ఈ చల్లదనాన్ని అనుభూతి చెందేలా చేస్తుంది. అందుకే మనం ఐస్ క్రీం తిన్న వెంటనే చల్లగా అనిపిస్తుంది. మౌంట్ సెయింట్ విన్సెంట్ విశ్వవిద్యాలయం ప్రకారం.. ఐస్ క్రీం నోటికి, గొంతుకు చల్లదనాన్ని మాత్రమే అందిస్తుంది. శరీరం లోపల దాని ప్రభావం భిన్నంగా ఉంటుంది. వాస్తవానికి, ఐస్ క్రీంలో అధిక మొత్తంలో చక్కెర - కొవ్వు ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి సమయం పడుతుంది. ఐస్ క్రీం చల్లదనం కారణంగా, శరీరం జీవక్రియ




ప్రక్రియ కొంచెం నెమ్మదిస్తుంది.. కానీ కొంత సమయం తర్వాత శరీరం దానిని వేడి చేయడానికి తన పనిని వేగవంతం చేస్తుంది. అంటే, మీరు కొద్దిసేపు చల్లగా అనిపించవచ్చు.. కానీ తరువాత శరీరం మరింత వేడిని ఉత్పత్తి చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో శరీరం చల్లదనాన్ని కోరుకుంటుంది. చల్లటి పదార్థాలు తినడం - త్రాగడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది, కాబట్టి ఐస్ క్రీం కోసం డిమాండ్ పెరుగుతుంది. మనస్తత్వవేత్త డాక్టర్ ఎకె కుమార్ దీనిని ఇంద్రియ ఉపశమనం అని పిలుస్తారని తెలిపారు. అంటే శరీరం లోపలి నుండి చాలా చల్లగా లేకపోయినా, ఐస్ క్రీం తినడం మనసుకు ఉపశమనం ఇస్తుంది.. అందుకే వేసవిలో మనం ఐస్ క్రీం ఎక్కువగా తినడానికి ఇష్టపడతాము.



## అరటి పండు తిన్నాక తొక్క పడేస్తున్నారా?

అరటిపండ్లు తినడానికి ఇష్టపడతారు. చాలా మంది అరటిపండ్లతో వివిధ రకాల రుచికరమైన డిజర్ట్స్ కూడా చేస్తారు. కానీ అరటిపండ్లు మాత్రమే కాదు, అరటి తొక్కలు కూడా ఉపయోగకరంగా ఉంటాయని మీకు తెలుసా? అవును, అరటిపండు తిని తొక్క పడేసే ముందు, మీరీ విషయం తప్పక తెలుసుకోవాలి. దాదాపు అందరూ అరటిపండ్లు తినడానికి ఇష్టపడతారు. చాలా మంది అరటిపండ్లతో వివిధ రకాల రుచికరమైన డిజర్ట్స్ కూడా చేస్తారు. కానీ అరటిపండ్లు మాత్రమే కాదు, అరటి తొక్కలు కూడా ఉపయోగకరంగా ఉంటాయని మీకు తెలుసా? అవును, అరటిపండు తిని తొక్క పడేసే ముందు, మీరీ విషయం తప్పక తెలుసుకోవాలి. అరటిపండ్ల తొక్కల వల్ల కలిగే వివిధ ఉపయోగాలు మీ రోజువారీ జీవితంలో బోలెడంత డబ్బును కూడా ఆదా చేస్తుంది. నిజానికి, అరటిపండ్లు మాత్రమే కాదు.. అరటి తొక్కలు కూడా మన చర్మానికి చాలా మేలు చేస్తాయి. డ్రై చర్మ సమస్యలతో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు అరటి తొక్కలను ముఖంపై రుద్దడం ప్రయోజనకరంంగా ఉంటుంది. ఇలా ఏడు రోజులు చేస్తే, చర్మం కాంతివంతంగా మారడం పక్కా. ఇక పగిలిన పెదవులతో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు అరటిపండు తొక్కను పెదవులపై రుద్దాలి. దీనివల్ల పెదవులు మెరుస్తూ అందంగా మారుతాయి. ఇక సమస్య కూడా పరిష్కారమవుతుంది. బాల్కనీలో ఉంచిన మొక్కల ఆకులు తరచుగా మురికిగా మారుతుంటాయి.

కానీ ఆకులను ఎక్కువ నీటితో శుభ్రం చేయడం వల్ల మొక్కకు హాని కలుగుతుంది. కాబట్టి మొక్క ఆకులను శుభ్రం చేయడానికి అరటి తొక్కలను ఉపయోగించవచ్చు. దంతాలు రోజురోజుకూ పసుపు రంగులోకి మారుతున్నాయా? అయితే దంతాలను తెల్లగా ఉంచుకోవడానికి అరటి తొక్కకు మించిన ప్రత్యామ్నాయం మరొకరటి లేదంటే అతిశయోక్తి కాదు. మీ దంతాలను శుభ్రం చేసుకోవడానికి టూత్‌పేస్ట్ కంటే అరటి తొక్క చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. రాత్రి పడుకునే ముందు అరటి తొక్కతో పళ్ళు తోముకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల దంతాలు తెల్లగా మారడం కేవలం వారం రోజుల్లోనే గమనిస్తారు.

## ఎక్కువగా ఫోన్ వాడితే బ్రెయిన్ ఖరాబ్ అవుతుందా..?



ప్రస్తుత రోజుల్లో స్మార్ట్ ఫోన్లు, ఫాస్ట్ ఇంటర్నెట్ మన జీవితంలో భాగమైపోయాయి. అయితే టెక్నాలజీ వల్ల మన ఆరోగ్యానికి ఏమైనా అవుతుందా..? ముఖ్యంగా ఫోన్ వాడకం వల్ల మెదడుకు సంబంధించిన సమస్యలు వస్తాయా..? అనే అనుమానాలు చాలా మందిలో ఉన్నాయి. 5జీ, 6జీ లాంటి కొత్త టెక్నాలజీలు వేగంగా వస్తున్నాయి. ఈ మార్పుల వల్ల కొన్ని ఆరోగ్య సమస్యల భయాలు ప్రజల్లో పెరుగుతున్నాయి. ఇవి క్యాన్సర్ లాంటి పెద్ద రోగాలకు కారణమవుతాయా..? అనే ప్రశ్నలు చాలా మందిని ఆలోచింపజేస్తున్నాయి. అయితే ఇప్పటివరకు శాస్త్రీయంగా వీటికి ఎలాంటి ఆధారాలు లేవు. సాధారణంగా మొబైల్ ఫోన్లు అశీఅ ఊశీఅఱఓఱఅస్త్ర తీఖసఱఖ్ఱశీఅని విడుదల చేస్తాయి. వీటి శక్తి చాలా తక్కువగా ఉంటుంది. స్త్రఖఎమ్ఖ తీఖఎం, శ తీఖఎం లాంటి ప్రమాదకరమైన కిరణాల్లా ఇవి ప్రభావాన్ని చూపించవు. డీఎన్ ఏను నాశనం చేయగల శక్తి వీటిలో ఉండదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. చాలా మంది ఎక్కువ కాలం మొబైల్ వాడితే మెదడు సంబంధిత రోగాలు వస్తాయని అనుకుంటున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కువగా ఫోన్ వాడుతున్నారని.. దీని వల్ల వాళ్ల ఆరోగ్యానికి ఏమైనా అవుతుందేమోనని కంగారు పడుతున్నారు. కానీ ఇప్పటి వరకు దీన్ని నిరూపించే నమ్మదగిన ఆధారాలు లేవు. నరాల శస్త్రచికిత్స నిపుణులు ఈ విషయంపై మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు తక్కువ శక్తితో పనిచేసే రేడియో ట్రాన్స్‌మిటర్ల లాంటివి. బలమైన సిగ్నల్ ఉన్న చోట్ల ఇవి మామూలు ల్యాండ్ లైన్ లా పనిచేస్తాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం వీటిని తయారు చేస్తారు కాబట్టి వాడేవాళ్లకు ప్రమాదం ఉండదు అన్నారు. మొబైల్ వాడకంపై ఇంకా అనుమానాలు ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు పాటించడం మంచిది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. హెడ్ ఫోన్ లేదా హ్యాండ్స్ ఫ్రీ వాడండి.ఎక్కువసేపు ఫోన్ మాట్లాడకుండా కాల్ సమయాన్ని తగ్గించండి.ఫోన్ ను శరీరానికి దగ్గరగా పెట్టకుండా దూరంగా ఉంచండి. అవసరమైతే టెక్స్ట్ లేదా వాయిస్ మెసేజ్ వాడండి.5జీ టవర్ల వల్ల క్యాన్సర్ వస్తుందనే అపోహలు ఉన్నా.. ఇది నిజం కాదని పరిశోధనలు స్పష్టంగా చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధనా సంస్థ 2011లో మొబైల్ ఫోన్ లు విడుదల చేసే రేడియేషన్ ను గ్రూప్ 2బీ కేటగిరీలోకి వర్గీకరించింది. అంటే ఇది క్యాన్సర్ కు కారణమయ్యే అవకాశం ఉన్నదిగా భావించవచ్చు అని అర్థం. కానీ ఇది తక్కువ ఆధారాలపై మాత్రమే చేసిన అంచనా అని ఆ సంస్థనే స్పష్టంగా చెప్పింది. ఇతర పరిశోధనల ప్రకారం మొబైల్ రేడియేషన్ కి క్యాన్సర్ మధ్య స్పష్టమైన సంబంధం లేదని తేలింది. ఈ విషయంలో పూర్తి స్పష్టత రావాలంటే ఇంకా మెరుగైన, లోతైన అధ్యయనాలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ లు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి. అయితే వాటిని జాగ్రత్తగా వాడటం ద్వారా ఆరోగ్య ప్రమాదాలను నివారించవచ్చు. శాస్త్రీయంగా నిరూపించని భయాల వల్ల కంగారు పడకండి. అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదమూ ఉండదు.ఎక్కువగా ఫోన్ వాడితే బ్రెయిన్ ఖరాబ్ అవుతుందా..? చాలా మంది ఎక్కువ కాలం మొబైల్ వాడితే మెదడు సంబంధిత రోగాలు వస్తాయని అనుకుంటున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కువగా ఫోన్ వాడుతున్నారని.. దీని వల్ల వాళ్ల ఆరోగ్యానికి ఏమైనా అవుతుందేమోనని కంగారు పడుతున్నారు.

కానీ ఇప్పటి వరకు దీన్ని నిరూపించే నమ్మదగిన ఆధారాలు లేవు. నరాల శస్త్రచికిత్స నిపుణులు ఈ విషయంపై మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు తక్కువ శక్తితో పనిచేసే రేడియో ట్రాన్స్‌మిటర్ల లాంటివి. బలమైన సిగ్నల్ ఉన్న చోట్ల ఇవి మామూలు ల్యాండ్ లైన్ లా పనిచేస్తాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం వీటిని తయారు చేస్తారు కాబట్టి వాడేవాళ్లకు ప్రమాదం ఉండదు అన్నారు. స్మార్ట్ ఫోన్ లు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి. అయితే వాటిని జాగ్రత్తగా వాడటం ద్వారా ఆరోగ్య ప్రమాదాలను నివారించవచ్చు. శాస్త్రీయంగా నిరూపించని భయాల వల్ల కంగారు పడకండి. అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదమూ ఉండదు.

## గుడ్లను ఉడకబెట్టేటప్పుడు పగిలిపోకుండా ఉండాలంటే..!



సాధారణంగా చాలా సందర్భాలలో గుడ్లు ఉడకబెడుతున్నప్పుడు అవి పగిలిపోతుంటాయి..అలా పగిలినప్పుడు గుడ్డు వృధా అయిపోతుంది. సరిగ్గా ఉడకదు. అలా కాకుండా ఉండాలంటే.. గుడ్లని ఉడకబెట్టేటప్పుడు కొన్ని సింపుల్ టిప్స్ పాటిస్తే సరిపోతుంది. ఇలా చేస్తే పెంకు సులువుగా రావడమే కాదు గుడ్లలో అవసరమైన పోషకాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. దీనికి అద్భుతమైన రుచి ఉంటుంది.గుడ్లు ఉడకబెట్టేటప్పుడు వాటికి సరిపడా పెద్ద సైజు గిన్నెను తీసుకోవాలి. గిన్నెలో గుడ్లు మొత్తం మునిగేవిధంగా నీరు పోయాలి. ఇలా చేయడం వల్ల గుడ్లు ఒకదానికొకటి తగలకుండా ఉంటాయి. దాంతో పగలకుండా ఉంటాయి. మీరు గుడ్లు ఉడకబెడుతున్న గిన్నెలోని నీటిలో ఒక టీస్పూన్ ఉప్పు వేయాలి. ఇలా చేస్తే గుడ్లు పగలకుండా ఉంటాయి. ఇలా ఉప్పు నీటిలో గుడ్లను ఉడకబెట్టడం వల్ల వాటి పెంకు తీయటం సులభంగా ఉంటుంది. అలాగే, చాలా మంది కోడిగుడ్లను ఫ్రిజ్‌లో నిల్వ చేస్తుంటారు. నేరుగా వంటకు ఉపయోగిస్తారు. అలా ఎప్పుడు చేయకూడదు. మొదటగా వాటిని గది ఉష్ణోగ్రతకు తీసుకురావాలి. ఆ తర్వాత వాటిని ఉడకబెట్టాలి. మీరు చల్లటి గుడ్లను నేరుగా వేడి నీటిలో ఉడకబెట్టినట్లయితే అవి పగిలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గిన్నెలో నీరు మరుగుతుండగా గుడ్లు ఎప్పుడు అందులో వేయకూడదు. అలావేస్తే గుడ్డు నీటిలోనే పగిలిపోతాయి. ఒక గిన్నెలో 3-4 గుడ్ల కంటే ఎక్కువ ఉడకబెట్టకూడదు. ఇలా కూడా అవి పగిలిపోయే అవకాశం ఉంటుంది. ఇకపోతే, గుడ్లు ఉడకబెట్టేటప్పుడు ఎక్కువ మంట మీద ఉడికించొద్దు. మీడియం వేడి మీద మరిగించాలి. మీరు ఇలా చేస్తే, అది పగలకుండా ఉంటుంది. సుమారు 15 నిమిషాలు ఉడికిన తర్వాత గ్యాస్ ఆఫ్ చేయాలి. ఇప్పుడు గుడ్లను వేడి నీటిలో నుంచి తీసి చల్లటి నీటిలో వేయాలి. సుమారు 10 నిమిషాల తరువాత వాటి పెంకులు తీయాలి. గుడ్డు పగలకుండా ఈజీగా వచ్చేస్తుంది.


## ఈ మొక్క ఇంట్లో పెంచితే పైసలు మస్తుగా వస్తాయి..!



ఇంట్లో శాంతి, సంపద ఉండాలంటే వాస్తు ప్రకారం కొన్ని మొక్కలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అలాంటి మొక్కల్లో మందార ఒకటి. ఇది అందమైన పూల మొక్క మాత్రమే కాదు.. లక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనదిగా భావిస్తారు. ఈ మొక్కను సరైన దిశలో నాటి బాగా చూసుకుంటే ఇంట్లో ధనం పెరుగుతుందని నమ్మకం. వాస్తు నిపుణులు చెప్పినట్లు మందార పువ్వుకు దైవశక్తిని ఆకర్షించే శక్తి ఉంటుంది. ఈ మొక్కను పెంచడం వల్ల ఇంట్లో ఉండే దోషాలు పోతాయని నమ్మకం. ముఖ్యంగా ఈ మొక్కను తూర్పు లేదా ఉత్తర దిశలో పెంచితే మంచిదని చెబుతారు. ఈ రెండు దిశలు అదృష్టాన్ని ఆకర్షిస్తాయని వాస్తులో భావిస్తారు. మందార పూలు సాధారణంగా పల్లెటూళ్లలో ఎక్కువగా కనిపిస్తాయి. ఇప్పటికీ చాలా పల్లెటూరి ఇళ్లలో ఇవి నెమ్మదిగా పెరుగుతూ.. ఇంటిని శుభంగా ఉంచే మంచి చిహ్నంగా ఉన్నాయి. ఈ మొక్కను ఇంట్లో పెంచడం వల్ల లక్ష్మీ కటాక్షం లభిస్తుందని నమ్ముతారు. అయితే మొక్క ఎండిపోకుండా తరచుగా నీరు పోస్తూ జాగ్రత్తగా పెంచాలి. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారు.. అప్పుల్లో కూరుకుపోయిన వారు ఈ మందార మొక్కను ఇంట్లో పెంచితే దోషాలు తగ్గుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా శుక్రవారం రోజున మీ ఇంట్లో డబ్బు నిల్వ చేసే చోట మందార పూలను ఉంచి.. గణపతిని దుర్గాదేవిని ధ్యానిస్తే మంచి ఫలితాలు వస్తాయని నమ్మకం. ఈ పనిని 7 రోజులపాటు రోజూ చేస్తే డబ్బు సమస్యలు దూరమవుతాయట.కుటుంబ సంబంధాల్లో గొడవలు, తారసాలు జరుగుతున్నప్పుడు బంధాన్ని బలోపేతం చేసుకోవడానికి మందార పువ్వుతో ఒక పరిష్కారం ఉంది. మీరు నిద్రపోయేటప్పుడు తల కింద పెట్టుకునే దిండు కింద ఈ పువ్వును ఉంచి నిద్రపోండి. ఇది మనసును ప్రశాంతంగా ఉంచి సంబంధాలను మెరుగుపరుస్తుందని నమ్మకం.ఇంట్లో శాంతి కోరే వారు రాత్రివేళ రాగి గిన్నెలో నీటితో కలిపి మందార పూలను ఉంచి.. సూర్యోదయం సమయంలో సూర్యుడికి పూజ చేసి ఆ నీటిని ఇంటి చుట్టూ చల్లుకోవచ్చు. ఇది శుభాన్ని పెంచి, చెడు శక్తులను తొలగించడానికి సహాయపడుతుంది. ఈ విధంగా వాస్తు ప్రకారం మందార మొక్క ఇంట్లో ఉండటం వల్ల ఆధ్యాత్మిక శక్తిని కలగజేయడమే కాకుండా.. డబ్బుకు సంబంధించిన ఇబ్బందులను తగ్గించే అవకాశం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు. మన ఇంట్లో పచ్చదనం, అందం, మంచి వాతావరణాన్ని తీసుకురావడంలో ఈ మొక్క ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

## ప్రశాంతమైన గాఢనిద్రను పొందాలంటే..

ప్రశాంతమైన గాఢ నిద్ర, ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందడానికి ఉదయం వ్యాయామం చేయాలి. నిద్రపోయే ప్రదేశం ప్రశాంతంగా, ఎలాంటి శబ్దాలు లేకుండా చీకటిగా ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం కొంత సమయం కేటాయించి క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే నిద్రలేమి సమస్య నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయి. ప్రతి ఒక్కరికి నిద్ర చాలా ముఖ్యమైనది. రాత్రిపూట తగినంత నిద్ర ఉంటేనే ఆ మర్నాడు మంచి శక్తితో మేల్కొని రోజంతా చురుగ్గా ఉంటారు. కానీ,నేటి ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది నిద్రలేమి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. నిద్రకోసం వారు ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటారు. వైద్యుల సలహా మేరకు కొందరు మందులు కూడా వాడుతుంటారు. కానీ, ఇవేవీ లేకుండా ప్రశాంతమైన నిద్రను పొందాలనుకుంటే.. కొన్ని సింపుల్ టిప్స్ పాటించవచ్చు అంటున్నారు నిపుణులు. ప్రశాంతమైన నిద్రకోసం ముఖ్యంగా రాత్రి సమయంలో అతిగా భోజనం చేయకూడదు అంటున్నారు నిపుణులు. బదులుగా సులువుగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలని చెబుతున్నారు.. నిద్రకు రెండు గంటల ముందే రాత్రి భోజనాన్ని ముగించాలని సూచిస్తున్నారు. టీవీ, ఫోన్, ల్యాప్ టాప్ వంటి వాటితో రాత్రి వేళ ఎక్కువ సమయం గడపకూడదు..ఇలా చేయటం వలన ఫోన్ నుంచి విడుదలయ్యే నీలి రంగు కాంతి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. నిద్రకు సిద్ధమయ్యే ముందు గ్లాసు గోరువెచ్చని పాలు తాగడం కూడా మంచిది. పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ శరీరంలో నిద్రకు అవసరమైన మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల చక్కగా నిద్రపడుతుంది. రాత్రి సమయంలో టీ, కాఫీ, కూల్ డ్రింక్స్, కేక్స్ తీసుకోకూడదు. వీటిలో ఉండే షుగర్, కెఫిన్లు నిద్రకు



ఆటంకం కలిగిస్తాయి. రోజువారీ వ్యాయామం ద్వారా నిద్రలేమి లక్షణాలను నియంత్రించవచ్చు. రోజూ తగినంత వ్యాయామం చాలా ముఖ్యం. ప్రశాంతమైన గాఢ నిద్ర, ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందడానికి ఉదయం వ్యాయామం చేయాలి. నిద్రపోయే ప్రదేశం ప్రశాంతంగా, ఎలాంటి శబ్దాలు లేకుండా చీకటిగా ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం కొంత సమయం కేటాయించి క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే నిద్రలేమి సమస్య నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయి.

భారత శక్తి
VOICE OF INDIAN



# మనమిత్ర వాట్సప్ ద్వారా దర్శనం మరియు ఆర్జితసేవా టికెట్లు

- మనమిత్ర వాట్సప్ నందు అందుబాటులో శ్రీస్వామివారి స్పర్శదర్శనం టికెట్లు?
- దర్శనాలతో పాటు మొత్తం 18 రకాల సేవాటిక్కెట్లను మనమిత్ర ద్వారా పొందే అవకాశం
- విరాళాలు కూడా మనమిత్ర ద్వారా చెల్లించే సౌకర్యం
- మనమిత్ర ద్వారా పరోక్షసేవా టికెట్లు కూడా పొందే సదుపాయంకార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు

**శ్రీశైలం (భారత శక్తి)** శ్రీస్వామివారి స్పర్శదర్శనం టికెట్లు కూడా మనమిత్ర వాట్సప్ ద్వారా పొందే అవకాశం కల్పించామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. దర్శనాలతో పాటు మొత్తం 18 రకాల సేవాటికెట్లను మనమిత్ర వాట్సప్ ద్వారా పొందేఅవకాశం ఉందన్నారు. అదేవిధంగా విరాళాలు కూడా ఈ మనమిత్ర వాట్సప్ ద్వారా చెల్లించే వీలు కల్పించబడిందన్నారు. భక్తులకు మనమిత్రపై అవగాహన కల్పించేందుకు క్షేత్రపరిధిలో విస్తృతంగా మనమిత్ర బోర్డులను ఏర్పాటు చేయబడటం జరిగిందన్నారు. అదేవిధంగా క్యూ కాంప్లెక్సు ఎదురుగా మనమిత్ర సహాయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇంకా సి.ఆర్.ఓ కార్యాలయం, గణేశసదన్ మొదలైనచోట్ల కూడా మనమిత్ర సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. అలాగే పరోక్షసేవాటికెట్లను కూడా మనమిత్ర ద్వారా పొందవచ్చునని, శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా సేవలను పరోక్షంగా జరిపించుకునే వీలుగా దేవస్థానం ఈ పరోక్షసేవలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ఆయా పౌరసేవలను సమర్థవంతంగా, వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా వచ్చిన ఈ వాట్సాప్ గవర్నెన్స్ విధానంలో పౌరులు పలు శాఖలకు సంబంధించిన ఆయా సేవలను పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆయా సేవలను సులభతరంగా అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ నెంబరును 9552300009 అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ మన మిత్ర వాట్సాప్ ద్వారా దేవదాయశాఖ పరిధిలోని పలు ఆలయాల దర్శనం టికెట్లు, ఆర్జితసే వాటికెట్లు, ప్రసాదాల టికెట్లు మరియు విరాళాలను చెల్లించే విధానాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ వాట్సాప్ ద్వారా శ్రీశైలదేవస్థానం నందలి శ్రీస్వామివారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లను పొందవచ్చునని తెలియజేశారు. అదేవిధంగా శ్రీస్వామివారి ఆర్జిత గర్భాలయఅభిషేకం, ఆర్జితసామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతిహోమం, రుద్రహోమం, మహామృత్యుంజయహోమం, చండీహోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం మొదలైన 18 ఆర్జితసేవలకు సంబంధించిన సేవా టికెట్లను కూడా పొందవచ్చునని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి కోరారు.

## మెదక్‌లో దొంగల బీభత్సం

**మెదక్,(భారత శక్తి)** మెదక్ జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టించారు. పెద్దశంకరంపేట మండలం చీలపల్లి గ్రామంలో ఒకే రాత్రి వరుసగా నాలుగు ఇళ్లలో చొరబడి భారీగా బంగారం, వెండిని దోచుకెళ్లారు. ఈ ఘటనతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే... చీలపల్లి గ్రామానికి చెందిన రాయిని రాములు కుటుంబం ఒక వివాహ వేడుక కోసం ఊరెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు, వారి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో దాచిన సుమారు 120 తులాలకు పైగా బంగారు ఆభరణాలు, కిలో వెండిని అపహరించుకుపోయారు.

ఉదయం ఇంటికి వచ్చిన పనిమనిషి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, యజమానులకు, పోలీసులకు సమాచారం అందించడంతో ఈ భారీ దోపిడీ విషయం వెలుగులోకి వచ్చింది. దొంగలు కేవలం రాములు ఇంటితో ఆగకుండా, అదే గ్రామంలోని మరో మూడు ఇళ్లలో కూడా చోరీలకు పాల్పడ్డారు. మాణిక్యరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో రెండు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ సహాయంతో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఒకే రాత్రి నాలుగు ఇళ్లలో చోరీలు జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## పేద మహిళలకు చీరల పంపిణీ చేసిన తలసాని

**హైదరాబాద్ (భారత శక్తి)** శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సనత్ నగర్ లోని బి కె గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో పేదలకు ఉచితంగా భోజనం వడ్డిస్తూ ఆకలి తీర్చడం, చాలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారని ప్రశంసించారు. అంతేకాకుండా మదర్స్ డే ను పురస్కరించుకుని పేద మహిళలకు చీరలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇవే కాకుండా ఉచిత వైద్య శిబిరాలను కూడా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పార్థసారథి, ఇతర సభ్యులను అభినందించారు.

## ఖైరతాబాద్ డబుల్ బెడ్ రూమ్‌లకు తాళాలు వేసారు

- స్థలాలు కోల్పోయిన అర్హులైన లబ్ధిదారులు.

**హైదరాబాద్ (భారత శక్తి)** ఖైరతాబాద్ ఇందిరా నగర్ లో డబుల్ బెడ్ రూమ్ లకు తాళాలు వేసారు. తమకు అన్యాయం చేసి ఎమ్మెల్యే అక్రమంగా తన అనుచరులకు ఇళ్లను కేటాయించారని ఆరోపిస్తూ బాధితులు ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. తమకున్న స్థలాలలో చిన్నపాటి ఇల్లులు నిర్మించుకొని జీవితాలు వెల్లదిస్తున్న తమకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని చెప్పి ఉన్న స్థలాలను గుంజుకొని తమకు ఇల్లు ఇవ్వలేదని కన్నీరు పెట్టుకున్నారు. పదేళ్ల క్రితం తమ స్థలాలను తీసుకొని ఇళ్లను కేటాయించకుండా వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యే తానం నాగేందర్ తమ పట్ల అన్యాయంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎమ్మార్వో ఆర్డీవో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి చుట్టు తిరుగుతున్న న్యాయం చేయడం లేదని వాపోయాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ గూడును ఆలకించి నిజమైన లబ్ధిదారులమైన తమకు ఇళ్లను కేటాయించడంతోపాటు ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలను వెలికి తీయాలని విజ్ఞప్తి చేశారు.

## పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని నిరసన



**కౌతాళం (భారత శక్తి)** కేంద్రం పెంచిన పెట్రోల్ డీజిల్ వెంటనే తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్లో రాస్తారోక చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కే మల్లయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పేద ప్రజలకు, రైతులకు ఏ కష్టం రాకుండా చూసుకుంటామని చెప్పి, దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసిన వెంటనే లీటర్కు మూడు రూపాయలు చొప్పున పెంచి ప్రజలకు , రైతులకు ,సామాన్య ప్రజల పైభారాలు మోపినారని వారు అన్నారు. ఆటో కార్మికులు ఫైనాన్స్ అప్పులు తెచ్చుకుని ఆటోలు నడిపితే ,ఈ పెట్రోల్, డీజిల్ పెంచడం ద్వారా ఆటోలు కూడా నడపలేని స్థితికి రావడమైనది ,అందుకు పెట్రోల్ కాకుండా ఆటోకు తాడు కట్టి మనుషులే లాగుకునే పోయే పరిస్థితులు,వస్తున్నాయని ,ఆటోకు తాడు కట్టి నిరసన వ్యక్తం చేశారు.. ఈ రాస్తారోకో లో కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కన్వీనర్ బి. ఈరన్న నాయకులు తాయప్ప, ప్రహల్లాద రెడ్డి ,ఆటో కార్మికులు ఈరన్న , తిప్పయ్య స్వామి, కాజా ,హుస్సేని, శ్రీరామ్ ,ఎల్లప్ప రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి

**చిత్తూరు (భారత శక్తి)** చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పి.కొత్తకోట రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న లారీనికారు ఢీకొంది. ఘటనలొఓ కారులో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారు తెలంగాణకు చెందినవారుగా గుర్తించారు.

## ఇంధన ధరలపెంపుపై ఎమ్మెల్యే నిరసన

**హైదరాబాద్ (భారత శక్తి)** డీజిల్, పెట్రోల్ ధరలను నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎల్బీనగర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అడ్డూఅదుపూ లేకుండా ఇంధన ధరలను పెంచుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అవలంబిస్తున్న ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల తరఫున గళం విప్పడానికే ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి అన్యాయమైన ధరల పెంపును అడ్డుకునేందుకు ప్రజలందరినీ చైతన్యవంతం చేస్తామని, కేంద్రం దిగివచ్చే వరకు భవిష్యత్తులో కూడా తమ ఆందోళన కార్యక్రమాలు, పోరాటాలు నిరంతరాయంగా కొనసాగుతాయని సుధీర్ రెడ్డి హెచ్చరించారు.

## భార్య విడిచిపెట్టడంతో భర్త ఆత్మహత్య

**హైదరాబాద్ (భారత శక్తి)** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోహెడ గ్రామంలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గత నాలుగు సంవత్సరాల క్రితం గోవర్ధన్, సరిత అనే యువతి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సరిత గోవర్ధన్ లు తురకయంజల్ లో నివాసం ఉండేవారూ. వీరిద్దరికి బాబు జన్మించాడు. గోవర్ధన్ ను కాదని సరిత పుట్టిన బాబును కూడా అమ్మి మరో వివాహం చేసుకోవడం సరిత తన బంధువులచే కొట్టించిందని సమాచారం. దాంతో మనస్థాపం చెందిన గోవర్ధన్, కారులో తన ఫోన్లో వీడియో చిత్రీకరించి ఉరేసుకొని గత 4 రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరిద్దరికి సంబంధించిన పూర్తి సమాచారం ఫోన్లో ఉందని సూసైడ్ లేఖ రాసి ఆత్మహత్య చేసుకోవడంతో గోవర్ధన్ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసారు. పోలీసలు ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు...

## కూకట్ పల్లిలో ఓట్లు తొలగిస్తున్నారు

- ఎమ్మెల్యే మాధవరం ఆరోపణ

**హైదరాబాద్ (భారత శక్తి)** కూకట్ పల్లి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ పేరిట డివిజన్లలో ఓట్ల తొలగింపు చేపట్టారు అని కూకట్ పల్లి బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్ బడే భాయ్, చోటే భాయ్ గా వ్యవహరిస్తున్నారు అని మండిపడ్డారు. ఫతేనగర్ డివిజన్ లో గౌతమ్ నగర్ 351 నుండి 366 వరకు ఉన్న అన్ని ఓట్లను మున్సిపల్ అధికారులు తొలగించారు అని వెల్లడించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 40 వేల ఓట్లను తొలగించడం ఏమిటి అని ప్రశ్నించారు.

ఇది ఇలానే కొనసాగితే తాము కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండున్నర ఏళ్లు కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న కేటీఆర్, కెసిఆర్ పైన భయపెట్టే విధంగా కేసులు పెడుతూ నోటీసులు ఇవ్వడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. మరోవైపు మోడీ వంటనూనెను తగ్గించాలి కార్లను వాడకూడదు అని చెబుతూ తన కాన్వాయ్ తగ్గించాడు తప్ప పెట్రోల్ రేట్లు పెంచి ప్రజల పైన భారం వేసారని అన్నారు. ఎంత కష్టం వచ్చినా ప్రభుత్వాలు భరించాలి తప్ప ప్రజలపై వేసి ఇబ్బందికి గురి చేయొద్దని సూచించారు. అధికారులు కాంగ్రెస్ నాయకుల మాటలు విని వారికి లబ్ధి చేకూరేలా చేస్తే రాబోయే కాలంలో తమ ప్రభుత్వం వస్తే ఒకరిని కూడా వదిలిపెట్టమని హెచ్చరించారు

## రీసర్వే పారదర్శకంగా జరగాలి

- సిపిఐ మండల కార్యదర్శి, పెద్దుల్లపల్లి ప్రభాకర్

**బ్రహ్మంగారిమఠం(భారత శక్తి)** బ్రహ్మంగారి మఠం మండలంలోని సోమిరెడ్డి పల్లె గ్రామపంచాయతీలో జరుగుతున్న రీసర్వే పారదర్శకంగా జరగాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ...... బ్రహ్మంగారిమఠం మండలంలో సోమిరెడ్డి పల్లె గ్రామపంచాయతీలో గత వారం రోజులుగా జరుగుతున్న రీసర్వేలో అవకతవకలు జరుగుతున్నాయని, అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులకు అనుకూలంగా రి సర్వే అధికారులు పనిచేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు తావివ్వకుండా రీసర్వే అధికారులు భూ హక్కుదారులకు ఆ భూమి చెందేలా రిసర్వేలో గుర్తించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 2014 నుండి 2026వ సంవత్సరం వరకు బ్రహ్మంగారి మఠం మండలంలో వేల ఎకరాలు భూ ఆక్రమణలు జరిగాయని, ఈ ఆక్రమణలు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరగడం దురదృష్టకరం అని ఆయన అన్నారు. ఈ ఆక్రమణలను బహిర్గతం చేయడానికి 2025 సెప్టెంబర్ లో మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు గోల్డెన్ సర్వే పేరుతో మండలం మొత్తం మీద ఎంత భూమి కబ్జా అయింది ఎన్ని ఎకరాలు హక్కుదారుల చేతిలో ఉంది.

సర్వే చేపించడం జరిగింది. అయితే ఆ సర్వేలో భూమిని అయితే గుర్తించారు. గాని ఆ భూమి ఎంతమంది హక్కుదారులకు ఇచ్చారు. ఎంత ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని రిపోర్టు ఇంతవరకు ఎక్కడ బయట బహిర్గతం చేయకపోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. గోల్డెన్ సర్వే పేరుతో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఖాళీలు ఉన్నాయని కేవలం రాజకీయ పార్టీ నాయకులకు సమాచారం ఇచ్చినట్లుగా గోల్డెన్ సర్వే తరువాత అధిక సంఖ్యలో భూకబ్జాలు జరిగాయని ఎక్కడ కూడా భూకబ్జాలను అరికట్టడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన మండిపడ్డారు. ఇంతకీ గోల్డెన్ సర్వే ఏమైంది గోల్డెన్ సర్వే పేరుతో అధికారులు కాలయాపన చేసి మూడు నెలలపాటు విధులకు డుమ్మా కొడుతూ సర్వేల పేరుతో బయట తిరుగుతూ ప్రభుత్వ నిధులు కూడా దుర్వినియోగం చేశారని ఆయన దుయ్యబట్టారు. సోమిరెడ్డి పల్లె గ్రామపంచాయతీలో చీటీపాయ, సోమిరెడ్డి పల్లె ఆర్ అండ్ ఆర్, ఓబుల్ రాజు పల్లి ఆర్ అండ్ ఆర్,, కొండుగారి పల్లె తిప్ప, నరసన్నపల్లె పొలము అదేవిధంగా వంకలు వాగులు ఇవన్నీ కూడా భారీ మొత్తంలో ఆక్రమణలు జరిగాయని, ఈ రీ సర్వేలో ఆక్రమణలు గుర్తించి హక్కుదారులకు భూములు ఇచ్చేలా రీసర్వే అధికారులు మరియు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కబ్జాదారుల చేతుల్లో వందల ఎకరాలు ఉన్నప్పటికీ రెవిన్యూ అడధికారులు వారి వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని ఆయన పేర్కొన్నారు. చుక్కల భూములు వాగు పోరంబోకు మునక ప్రాంతం భూములు ఇవన్నీ కూడా ప్రభుత్వ ఆధీనంలోని భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలి. అదేవిధంగా వ్యక్తులకు ఇచ్చిన భూములపై కబ్జాదారుల నుండి ఆ భూమిని కాపాడి భూ హక్కుదారులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఈ నెల 17వ తేదీ వరకే మాత్రమే ఆ నాలుగురు ఇంచార్జిలుగా కొనసాగుతారు

**గోకవరం (భారత శక్తి)** మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులను జగ్గంపేట నియోజకవర్గంలోని పలు మండలాలకు ఇంచార్జిలుగా నియమిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వారు నాలుగురు కూడా ఈ నెల 17 తేదీ వరకు మాత్రమే ఇంచార్జిలుగా ఉంటారని, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరం మండలా నికి చెందిన బీజేపీ నాయకులు మట్టా మంగరాజు, జగ్గంపేట ఇంచార్జిగా, సత్తి వెంకటరెడ్డి గండేపల్లి ఇంచార్జిగా, కొన వెంకట సురేష్ కిర్లంపూడి ఇంచార్జిగా, శ్రీ కామినేని జయశ్రీ గోకవరం ఇంచార్జిగా నియమించినట్లు వచ్చిన సమాచారంతో జగ్గంపేట, రాజానగరం, రంపచో డవరం మూడు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తనకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేయడం జరిగిందన్నారు. దీనిపై పార్టీ అధిష్టానం పెద్దలతో మాట్లాడగా వారు తనకు ఇచ్చిన సమాచారం మేరకు వారు ఆయా మండలాల ఇంచార్జిలుగా ఈ నెల 17 వరకు మాత్రమే కొనసాగుతారని తెలుపారు. ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు.

## అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటన



**అద్దంకి (భారత శక్తి)** సంతమాగులూరు మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరం పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. అనంతరం 10వ తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ప్రతి మండలంలో టాప్ 5లో నిలిచిన విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున నగదు అందజేసారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి గొట్టిపాటి, కలెక్టర్ రాజాబాబు పంపిణి చేసారు. 84 మంది లబ్ధిదారులకు రూ.69 లక్షలకు పైగా చెక్కులు, ఎల్ఓసీ పత్రాలు అందజేసారు.

## ఘనంగా యెర్నిమాండ జాతర

**విశాఖపట్నం (భారత శక్తి)** విశాఖలోని జ్ఞానాపురంలోని శ్రీ యెర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా వార్డు భారీగా మహిళలు అభిషేకాలు నిర్వహించారు. 41 వార్డు స్థానిక మాజీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ సహకారంతో 501 బిందెలతో మహిళలు అమ్మవారికి అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో 41 వార్డు అధ్యక్షులు కోడి గుడ్ల శ్రీధర్ పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మ వారిని వేడుకున్నట్లు తెలిపారు. భారీగా మహిళలు తరలి రావడంతో అమ్మవారి సన్నిధి సందడిగా మారింది.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

- రూ.3లక్షల జరిమానా
- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

**(భారత శక్తి)** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం (ఖీాయాఈ) కఠిన చర్యలు అమలు చేస్తోంది. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 27/2019 కేసులో ఈ ముద్దాయి తిరుపతి-చెన్నై రోడ్ లోని గాజులమండ్యం జంక్షన్ వద్ద అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, వేలూరు జిల్లా ఆర్కాట్ తాలూకా,మొస్సూర్ పాళ్యం గ్రామానికి చెందినవాడు, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీ కులశేఖర్ గారు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

## హైదరాబాద్లో సీఏ విద్యార్థి అనుమానాస్పద మృతి

**హైదరాబాద్ (భారత శక్తి)** మియాపూర్ ప్రాంతంలోని గోకుల్ ప్లాట్స్లో అద్దెకు ఉంటున్న సీఏ విద్యార్థి జనార్ధన్ అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. రూములో ఉరి వేసుకున్నట్టు కనిపించినా ఒంటి నిండా రక్తం ఉండడంతో ఎవరో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారని స్థానికుల ఆరోపణ. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి



**ఖమ్మం(భారత శక్తి)** ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏసీలు, వైద్య పరికరాలు లో వోల్టేజ్ సమస్యతో పనిచేయడంలేదు. దాంతో రోగులు, డాక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరాకు సరిపడా ట్రాన్స్ఫార్మర్లు లేక, లో వోల్టేజ్ సమస్యలతో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, బాలింతల విభాగంలో ఏసీలు పని చేయడంలేదు. 240 రావాల్సిన వోల్టేజ్ కేవలం 180 నుండి 200 మాత్రమే రావడంతో పరికరాలు తరచుగా కాలిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఏసీలు లేక ఆపరేషన్ థియేటర్, ఐసీయూల నుండి దుర్వాసన వస్తుందని సిబ్బంది ఫిర్యాదు. పలు విభాగాల్లో అత్యవసర పరికరాలు కూడా పని చేయకపోవడంతో సరైన చికిత్స అందించలేకపోతున్నామని వైద్యుల అసంతృప్తి. ఎండాకాలంలో ఏసీలు పనిచేయక రోగులు, వైద్యులు ఇబ్బంది పడుతున్నారని సరిపడా ట్రాన్స్ఫార్మర్లు అమర్చి, నాణ్యమైన విద్యుత్ అందించాలని సిబ్బంది కోరుతున్నారు.

# వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు

**హైదరాబాద్,** తెలంగాణలో కొత్తగా మరికొన్ని నగరాలకు ఔటర్ రింగ్ రోడ్డులు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఇతర ప్రాంతాలకు సంబంధించి మెగా గ్రోత్ కారిడార్‌ల్లో ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై మున్సిపల్‌శాఖకు సూచించారు. రాష్ట్రంలో మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి, వాటి ప్రణాళికలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణలోని ప్రతిపాదిత మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు పలు సూచనలు చేశారు.'మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ గ్రోత్ కారిడార్ ఏర్పాటు ప్రణాళికలు రూపొందించాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ కలిపి గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలి. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్‌ను, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు కావాలి. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలి. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలి. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలతో పాటు ఇతర అంశాలన్నీ గ్రోత్ కారిడార్లలో స్పష్టంగా ఉండాలి' అని రేవంత్ రెడ్డి సూచించారు.'తెలంగాణలో రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి ప్రణాళికలు, పనులు చేపట్టాలి. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుతో ఆ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారుతాయి. ఆ విమానాశ్రయానికి కావలసిన నీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌ను రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతుంది. గ్రోత్ కారిడార్లలో వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా ప్రతిదీ డిజైన్ చేయాలని స్పష్టంగా ఉండాలి. నగరాల్లో ఖర్చును తగ్గించుకోవడానికి ఈవీ వాహనాలను ప్రవేశపెట్టాలి. లీజుకు తీసుకునే వాహనాలు కూడా ఈవీ వాహనాలే ఉండాలి. ప్రతి చోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా ప్రణాళికలు ఉండాలి' అన్నారు.'మున్సిపాలిటీలలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలి. ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో రేడియేషన్ తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలి. నగరాలు, పట్టణాల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఏఐ వినియోగం కోసం సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకోవాలి. భూగర్భ డ్రైనేజీ, స్మార్ట్ పోల్స్, రోడ్లు, ఎస్టీపీలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఈవీ వంటి అంశాల పైన ప్రతి చోట ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి' అని ముఖ్యమంత్రి సూచించారు

# బ్రాండ్ పేరిట బరితెగింపు!

**మెదక్, నల్గొండ** పసిపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ, వారి భవిష్యత్తుకు పునాది వేయాల్సిన అంగన్వాడీ కేంద్రాలు ఇప్పుడు అవినీతి తిమింగలాలకు కాసుల కురిపించే కేంద్రాలుగా మారాయి. నల్లగొండ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, ట్యూబ్లైట్ల సరఫరా పేరుతో లక్షల రూపాయల ప్రజాధనాన్ని నిలువునా ముంచేశారు. బ్రాండెడ్ వస్తువుల ధరలు చూపించి.. నాసిరకం మోడళ్లను అంటగడుతూ దాదాపు రూ. 10 లక్షల మేర చేతివాటం ప్రదర్శించిన వైనం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్ గా మారిందనే ప్రచారం జోరుగా సాగుతుంది.వాస్తవానికి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో అంగన్వాడీల రూపురేఖలు మార్చాలని భావిస్తే, క్షేత్రస్థాయి అధికారులు మాత్రం ఆయన ఆశయాలకు తూట్లు పొడిచినట్లు తెలుస్తుంది. మినరల్ ఫండ్స్ నిధులను మళ్లించేందుకు వేసవి సెలవులను అస్త్రంగా చేసుకున్న అక్రమార్కులు, బినామి టెండర్లతో ఐసీడీఎస్ కార్యాలయాన్నే అవినీతికి అడ్డాగా మార్చేశారు. రూ. 2200 ఫ్యాన్కు బిల్లు పెట్టి రూ. 1400 వస్తువును సరఫరా చేస్తూ నయా స్కామ్కు తెరలేపారని జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి.నల్లగొండ జిల్లాలోని 802 అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, 1060 కేంద్రాలకు ట్యూబ్లైట్లు సరఫరా చేసేందుకు కలెక్టర్ మినరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.20 లక్షలు కేటాయించారు. అయితే కాంట్రాక్ట్ నిబంధనలను సదరు కాంట్రాక్టర్ తుంగలో తొక్కినట్లు తెలుస్తుంది. టెండర్ ప్రకారం రూ. 2,243 విలువైన 'క్రాంప్టన్ హైస్పీడ్ హెచ్పీ ప్లస్' మోడల్ సరఫరా చేయాలి. కానీ వాస్తవికంగా సరఫరా అయింది మాత్రం కేవలం రూ. 1,400 విలువ చేసే 'సీవైండ్' మోడల్. అంటే ప్రతి ఫ్యాన్ మీద రూ. 843 నొక్కేసినట్లు విశ్వసనీయ సమాచారం.అంటే ఒక్క ఫ్యాన్ల కొనుగోలులోనే రూ. 7 లక్షల కుంభకోణం జరిగినట్లు అంచనాలు వేస్తున్నారు. ఇదే సమయంలో రూ. 264 విలువైన 'ఫిలిప్స్ 3-ఇన్-1 ఎల్ఈడీ' లైట్లకు బదులుగా, మార్కెట్లో కేవలం రూ. 110 లకే దొరికే అత్యంత నాసిరకమైన స్లిమ్ మోడళ్లను సరఫరా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో దాదాపు రూ. 2 లక్షల నిధులు పక్కదారి పట్టాయనీ స్థానికంగా వినిపిస్తుంది సాధారణంగా ఏప్రిల్లో జరగాల్సిన సరఫరాను కావాలనే వేసవి సెలవుల వరకు సాగదీసినట్లు సమాచారం. అంగన్వాడీ కేంద్రాలు మూసి ఉంటే.. ఎవరూ క్వాలిటీని తనిఖీ చేయరనేది వీరి మాస్టర్ ప్లాన్. జిల్లా కొనుగోలు కమిటీ పర్యవేక్షణ లేకుండానే మెటీరియల్ను నేరుగా సెక్టార్ ఆఫీసులకు పంపించి, సూపర్వైజర్ ల ద్వారా సంతకాలు చేయించుకోవడం వెనుక పెద్ద నెట్వర్కే ఉందనేది అందరు గమనిస్తున్న విషయమే.ఈ మొత్తం స్కామ్ వెనుక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ఒక డిప్యుటేషన్ ఉద్యోగి పాత్ర ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.

వాస్తవానికి నకిరేకల్ పరిధిలో ఉండాల్సిన ఆ వ్యక్తి, జిల్లా ఆఫీసులో చక్రం తిప్పుతూ హైదరాబాద్కు చెందిన తన బినామీలతో టెండర్లు వేయించి ఈ దోపిడీకి తెరలేపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సంగారెడ్డి జిల్లాలో అంగన్వాడీలను అభివృద్ధి చేసిన అనుభవంతో నల్లగొండలోనూ అదే మార్పు తేవాలని వాస్తవికంగా కలెక్టర్ భావించి ఫిట్టింగ్ చార్జీలు కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చి మరీ నిధులు కేటాయిస్తే.. క్షేత్రస్థాయిలో యంత్రాంగం మాత్రం ఆయన నమ్మకాన్ని వమ్ము చేస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయినాణ్యత లేని ఫ్యాన్లు, ట్యూబ్లైట్ల వల్ల భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరు? కేవలం కమిషన్ల కోసం చిన్నారుల సౌకర్యాలను తాకట్టు పెట్టిన ఈ నిధుల వేటగాళ్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమార్కుల నుంచి కాజేసిన నిధులను రికవరీ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు బలంగా కోరుతున్నారు. అలాగే అవినీతి తంతుకు తెరలేపిన వ్యక్తులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

# ఇంటర్ విద్యలో భారీ మార్పులు

**హైదరాబాద్,** ఇంటర్ విద్యలో కీలక మార్పులుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఈ నూతన విధానం అమలు చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. మొత్తంగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టింది. సైన్స్ విద్యార్థులకు గతంలో ఉన్న 30 మార్కుల ప్రాక్టికల్స్ విధానాన్ని రెండు సంవత్సరాలకు విభజించింది. ఇకపై ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీకి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు.

ప్రాక్టికల్స్ పరీక్షలకు ఫస్ట్ ఇయర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కులు కేటాయించనున్నారు. గణితంలోనూ యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టింది. గణితంలో 75 మార్కులకు బదులు 60 మార్కులకు ఫైనల్ (థియరీ) పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్నల్ అసెస్మెంట్‌కు ఒక్కో ఏడాదికి అంటే ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌కు 15 మార్కులు చొప్పున కేటాయించనున్నారు. అదేవిధంగా హ్యూమానిటీస్‌లో కూడా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు 20 మార్కులు కేటాయిస్తారు.ఫైనల్ థియ రీ పరీక్షలు 100 మార్కులకు బదులు 80 మార్కులకే నిర్వహించనున్నారు. భాషా (లాంగ్వేజెస్) సబ్జెక్టులలోనూ 100 మార్కులకు బదులు 80 మార్కులకు ఫైనల్ థియరీ పరీక్షలు, 20 మార్కులు ఇంటర్నల్ అసెస్మెంట్‌కు కేటాయించనున్నారు. ఎంఈసీ మ్యాథమెటిక్స్‌కు గతంలో ఇంటర్నల్ అసెస్మెంట్ ఉండేది కాదు. 75 మార్కులకు థియరీ పరీక్షే ఉండేది. కానీ ఇప్పుడు 20 మార్కులను ఇంటర్నల్ అసెస్మెంట్‌కు, 80 మార్కులు థియరీ పరీక్షకు కేటాయిస్తారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు

## - భూమన సైకిల్ పై సవారీ

**తిరుపతి** పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం పైన ఎక్కడ చూసినా సామాన్యుల నుంచి నిరసనలు వస్తుంది. తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి నగరంలో సైకిల్ తొక్కారు. దేశ ప్రదాని మోదీ సూచనల ప్రకారం అందరం ఈ కష్టకాలంలో ఇంధనం వాడకాన్ని తగ్గించడానికి ప్రయత్నం చేద్దామని పిలుపునిచ్చారు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా భారీ ఖర్చులు తగ్గించాలని కోరారు. తిరుపతి పుణ్యక్షేత్రం ఎంతో మంది యాత్రికులు రాకపోకలు జరుగుతుంటాయి. ప్రతి ఒక్కరూ సామాజిక భాద్యతగా తిరుపతి నగరం లో ప్రజలు ఇంధనం వాడకాన్ని తగ్గించాలని కోరారు.

# గులాబీ జోరు అందుకుంటుందా

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణాకు మోడీ వచ్చి సగం రోజు అక్కడే ఉండి చేసిన రాజకీయ కలకలం అంతా ఇంతా కాదు, సీఎం రేవంత్ రెడ్డిని తమతో కలవమని బంపర్ ఆఫర్ ఇచ్చారు. దాంతో ఎవరికి తోచిన విధంగా వారు దీని మీద విశ్లేషించి రచ్చ చేశారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్డీయే బలోపేతం మీద మోడీ మిత్రులతో చర్చించారు అన్న వార్తలతో అటు ఆంధ్రాలో వైసీపీ ఇటు తెలంగాణాలో బీఆర్ఎస్ కూడా ఉలిక్కిపడి ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ లోకి దిగిపోతున్నాయి. కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ లో తాజాగా బీఆర్ఎస్ సీనియర్లతో అతి ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఆరు గంటల సేపు ఈ మీటింగ్ సాగింది అని అంటున్నారు. ఈ మీటింగ్ వేరీ సీరియస్ గానే సాగింది అని అంటున్నారు. ఏకంగా బీఆర్ఎస్ ని గ్రౌండ్ నుంచి టాప్ లెవెల్ వరకూ కొత్త రూపుతో షేపుతో తీర్చిదిద్దాలని కేసీఆర్ పార్టీ వర్గాలకు దిశా నిర్దేశం చేశారని అంటున్నారు బీఆర్ఎస్ విషయంలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాలని కూడా డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. అలాగే బీఆర్ఎస్ భవిష్యత్తు కార్యాచరణపై కూడా లోతైన చర్చ సాగింది అని అంటున్నారు. బీఆర్ఎస్ ని పూర్తిగా గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధినాయకుడు కేసీఆర్ పార్టీ వర్గాలకు సూచించారు అని అంటున్నారు. గతానికి భిన్నంగా తెలంగాణా రాజకీయం మారుతోంది అని బీఆర్ఎస్ పెద్దలు గుర్తించారు. బీజేపీ తెలంగాణాలో అధికారం విషయంలో గట్టి పట్టుదలతో ఉందని కూడా అర్థం అవుతోంది. మోడీ బహిరంగ సభలో అయితే వచ్చేది బీజేపీనే అని స్ట్రాంగ్ స్టేట్మెంట్ ఇచ్చారు. బీజేపీ కనుక ఒక చోట అధికారంలోకి రావాలనుకుంటే దానికి సంబంధించి గ్రౌండ్ వర్క్ చాలా ముందుగానే రెడీ చేసి పెట్టుకుంటుంది. దానికి తాజా ఉదాహరణ పశ్చిమ బెంగాల్ లో ఆ పార్టీ ఘన విజయం. అసలు ఓటమి లేదు అనుకున్న మమతా బెనర్జీ ఓటమి పాలు అయ్యారు. దాంతో అంతకంటే బలమైన ప్రాంతీయ పార్టీల నేతలు ఎవరూ లేరని అంటున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కూడా పూర్తి స్థాయిలో అలెర్ట్ అవుతోంది అని అంటున్నారు ఇక బీఆర్ఎస్ ని బూత్ లెవెల్ నుంచి గ్రామ వార్డు స్థాయి నుంచి కమిటీలతో నింపాలని నిర్ణయించారు. అలాగే నియోజకవర్గం స్థాయి జిల్లా స్థాయి వరకూ కూడా బలమైన సమర్థులైన నాయకులతో పార్టీని పటిష్టం చేయాలని కూడా నిర్ణయించారు ఇక పార్టీ శ్రేణులలో సరికొత్త ఉత్సాహం నింపాలని రానున్న రోజులలో నేతలంతా జనంలో ఉంటూ బీఆర్ఎస్ ని పరుగులు పెట్టించాలని కూడా తీర్మానించారని అంటున్నారు. జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికలు జరిగినా విజయమే పరమావధిగా పార్టీ పోరాడాలని కూడా నిర్ణయించారు. మొత్తానికి 2028 ఎన్నికలకు బీజేపీ రెడీ అని మోడీ గట్టిగా చెప్పి వెళ్లారు. దాంతో బీఆర్ఎస్ కూడా జోరు చేస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి రానున్న రోజులలో బీఆర్ఎస్ స్పీడ్ ఏ విధంగా ఉంటుందో.

# ఏలూరు జిల్లాలో ఎస్ఐ దాష్టీకం

## - ఓ యువకుడిని చితకబాదిన పెదవేగి ఎస్ఐ హరి గోపాల్

**ఏలూరు** మందు తాగావంటూ కారణం లేకుండా దేవరపల్లి రాజా అనే యువకుడిపై పెదవేగి ఎస్ఐ హరి గోపాల్ విచక్షణారహితంగా దాడి చేయడం వివాదానికి దారి తీసింది. వాతలు తేలేలా దారుణంగా కొట్టడంతో బాధితులు ఆసుపత్రి పాలయ్యారు. పోలీసులు కావాలనే తన కొడుకుపై కక్షపూరితంగా ప్రవర్తించారని బాధుతుడి తల్లి కుమారి ఆవేదన వ్యక్తం చేసింది. దాడిని అడ్డుకుంటూ వీడియో తీస్తున్నా వదలకుండా ఎస్సై, కానిస్టేబుళ్లు గొడవకు దిగారు. చట్టాన్ని తమ చుట్టంగా వాడుకుంటూ పోలీసులే అరాచకం సృష్టిస్తున్నారని బాధితుడి కుటుంబం మండిపడింది.

# ఘనంగా కోట నీలిమ జన్మదిన వేడుకలు

**సికింద్రాబాద్** కాంగ్రెస్ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సనత్ నగర్ ఇంచార్జి కోట నీలిమ జన్మదిన వేడుకలను రాంగోపాల్ పేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు త్రికాల మనోజ్ ఆధ్వర్యంలో సెటిలైట్ హోటల్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన కోట నీలిమ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కటౌట్ కు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేసవి నేపథ్యంలో వాహనదారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సనత్ నగర్ నియోజకవర్గం లోని పలు అభివృద్ధి పనులతో పాటు ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన ఘనత ఆమెకే దక్కుతుందని అన్నారు. మహిళా నాయకురాలిగా అంచలంచెలుగా ఆమె ఎదిగిన తీరు ఆదర్శనీయమని, భవిష్యత్తు రాజకీయాలలో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకునే విధంగా ఆమెకు వెన్నంటే ఉంటామని ఆమె అభిమానులు, పార్టీ శ్రేణులు తెలియచేశారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, సిఎన్జి గ్యాస్ ధరలను ఉపసంహరించాలి

## - సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్

**విజయవాడ** పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేసారు. పెట్రోల్ పై రూ.3.29, డీజిల్ పై రూ.3.14, కిలో సిఎన్జి గ్యాస్ రూ.2 మేర పెంచడం దుర్మార్గం. 5 రాష్ట్రాల ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల భారం మోడీ ప్రభుత్వం మోపుతుందని ముందు నుండి చెబుతూనే ఉన్నామని అన్నారు.ఈ భారం రవాణా రంగంపై పడి పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, విదేశాంగ విధానాల ఫలితంగా ప్రజలపై భారాలు పడుతున్నాయి . పెట్రోల్ డీజిల్ ధరల భారం పై దేశవ్యాప్తంగా ప్రజలు నిరసన తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రధాని

**విశాఖపట్నం** విశాఖపట్నం వేదికగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ప్రధాని మోదీ ఇటీవల ప్రజలకు ఇస్తున్న పొదుపు సూచనలు వినడానికి బాగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో అవి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బంగారం కొనవద్దు, విదేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవద్దు, సేంద్రియ వ్యవసాయం చేయాలంటూ మోదీ చెబుతున్న మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయం వల్ల శ్రీలంక ఎలాంటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందో చూశామని, ఇప్పుడు భారత్‌లో కూడా అదే ప్రయోగాలు చేయడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు.దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలను పక్కదారి పట్టించడానికే మోదీ ఇలాంటి వింత సూచనలు చేస్తున్నారని రాఘవులు ఆరోపించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ కాన్సెప్ట్‌ను ప్రోత్సహించడం వెనుక రాబోయే రోజుల్లో పెట్రోల్ ధరలను భారీగా పెంచే కుట్ర ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలకు నీతులు చెప్పడం మానేసి, ప్రపంచ శాంతి కోసం అమెరికా యుద్ధం ఆపాలని మోదీ డిమాండ్ చేయాలని సూచించారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం లక్కీడ్రా




**సిద్దిపేట** బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ప్రక్రియ లో చేరే విద్యార్థులకు సంబంధించి లక్కీ డ్రా ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి నేతృత్వంలో జరిగింది. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఎస్టీ విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కూల్ లలో 3 వ తరగతిలో మొత్తం 5 సీట్లు ఉండగా 3 మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని వారికి నేరుగా సర్టిఫికెట్ వెరిఫై చేసి 3 తరగతిలో అడ్మిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.5వ తరగతిలో మొత్తం 3 సీట్లు ఉండగా 5 దరఖాస్తు చేసుకోగా వీరికి లక్కీ డ్రా ద్వారా 3 గురిలో ఒక బాలిక ఇద్దరు బాలురనీ ఎంపిక చేశారు. ఒకరిని రిజర్వ్ లో ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైన ఎస్టీ విద్యార్థులకు సర్టిఫికెట వెరిఫై చేసి సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఆయా తరగతులలో విద్యను అభ్యసిస్తారని తెలిపారు. బాగా చదవాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలిపారు.కలెక్టర్ వెంట ఏ ఓ రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పల్టీ కొట్టిన ట్రాక్టర్ : డ్రైవర్ మృతి



**పోరుమామిళ్ల( బి కోడూరు)** బద్వేల్ నియోజకవర్గం బి. కోడూరు మండలంలోని రామసముద్రం చెరువు దగ్గరి లో పల్టీ కొట్టిన ట్రాక్టర్. ఈ సంఘటనలో అక్కడికక్కడేడ్రైవర్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు బి కోడూర్ మండలంలోని మాధవరాయునిపల్లె నివాసి. ఈ ఘటన తో ఆ గ్రామ ప్రజలు ఆందోళన చెందారు. కుటుంబ సభ్యులు తీవ్రగ్భ్రాంతికి లోనయ్యారు. మృతుని కుటుంబానికి సాయం చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు

## బక్రీద్ పండుగ నేపథ్యంలో

# పోలీస్ చెక్‌పోస్టుల ఏర్పాటు

## - తనిఖీలను ముమ్మరం చేసిన కరీంనగర్ కమిషనరేట్ పోలీస్



రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ రవాణా నివారణే ధ్యేయంగా సరిహద్దు ప్రాంతాలలో ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచడంతో పాటు విధుల్లో ఉండే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు, భద్రతా పరికరాలను సమకూర్చుతున్నట్లు పేర్కొన్నారు.ఇందులో భాగంగానే కరీంనగర్ పరిధిలోని మగ్దూంపూర్ చెక్‌పోస్టును సీపీ గురువారం అర్ధరాత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ లైట్ రిఫ్లెక్టర్ జాకెట్లు, సరిపడా లైటింగ్ వసతి మినహా మిగిలిన రక్షణ పరికరాల కొరత ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందిస్తూ తనిఖీలలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా శనివారం నుండి ప్రతి చెక్‌పోస్టు వద్ద అన్ని రకాల వసతులను విధిగా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను సీపీ ఆదేశించారు.ఇకపై ప్రతి చెక్‌పోస్టు వద్ద రాత్రి వేళల్లో తనిఖీల కోసం 3 టార్చ్ లైట్లు,వాహనాలను నిలిపివేసేందుకు మరియు సిబ్బంది రక్షణ కొరకు 3 ఎల్ఈడీ బాటన్లు, అత్యవసర అలర్ట్‌ల కోసం సిబ్బంది వద్ద విజిల్స్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.వీటితో పాటు చెక్‌పోస్టుల గుండా వెళ్లే ప్రతి వాహనం మరియు వ్యక్తుల కదలికలను నిరంతరం రికార్డ్ చేసేందుకు వీలుగా 2 సీసీటీవీ కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేసి పక్కా నిఘా ఉంచాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో సిబ్బంది సుదూర ప్రాంతాల వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా తగినన్ని లైట్ రిఫ్లెక్టర్ జాకెట్లను ధరించాలని, అత్యవసర సమాచార మార్పిడి కోసం ప్రత్యేక కమ్యూనికేషన్ బేస్ సెట్లను ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. అలాగే చెక్‌పోస్టుల మీదుగా రాకపోకలు సాగించే అనుమానాస్పద వాహనాల వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, చట్టవిరుద్ధమైన రవాణాకు అడ్డుకట్ట వేసేందుకే ఈ తనిఖీలను ముమ్మరం చేసినట్లు సీపీ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రజలు మరియు వాహనదారులు చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

# భూసేకరణ పనులను వేగవంతం చేయండి

## - ఆర్డీవో ఓబులేసు

**తుగ్గలి:**పత్తికొండ ఆర్డిఓ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో ఓబులేసు శుక్రవారం రోజున తుగ్గలి తహసిల్దార్ రవి అధ్యక్షతన జియో మైసూర్ సంస్థ ప్రతినిధులతో తుగ్గలి తహసిల్దార్ కార్యాలయం నందు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో భాగంగా ఆర్డీవో ఓబులేసు మాట్లాడుతూ జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పనులకు సంబంధించిన భూసేకరను త్వరగా చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జియో మైసూర్ భూసేకరణకు ఎర్రగుడి,పగిడిరాయి,జొన్నగిరి గ్రామాలలో గల ప్రభుత్వ భూములను, ఆసైన్డ్ భూములను,పట్టా భూములకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సుదర్శన్, మండల సర్వేయర్ సుధాకర్,విలేజ్ సర్వేయర్ రాజశేఖర్, జియో మైసూర్ సంస్థ జీ.యం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో రక్తపాతం..

## - నరసరావుపేటలో ఘోర హత్య..!



**పల్నాడు (భారత శక్తి)** కేంద్రం నరసరావుపేటలో అర్ధరాత్రి ఘోర హత్య కలకలం రేపింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన సంచలనంగా మారింది.గత రాత్రి సుమారు 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు, నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.ఈ ఘటనతో నరసరావుపేట పట్టణంలో భయాందోళనలు నెలకొన్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏపీలో మరో ఘోర ప్రమాదం..

## - పూర్తిగా కాలిపోయిన కావేరి ట్రావెల్స్ బస్సు

**హైదరాబాద్ (భారత శక్తి)** నుంచి తిరుపతి వెళుతున్న కావేరి ట్రావెల్స్ బస్సుప్రకాశం జిల్లా రాజుపాలెం వద్ద ఇంజిన్‌లో చెలరేగిన మంటలుడ్రైవర్ అప్రమత్తతతో క్షేమంగా బయటపడిన ప్రయాణికులుఆంధ్రప్రదేశ్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలు ప్రయాణికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా ప్రకాశం జిల్లా రాజుపాలెం వద్ద కావేరి ట్రావెల్స్ బస్సులో అగ్నిప్రమాదం సంభవించింది. హైదరాబాద్ నుండి తిరుపతి వెళ్తున్న ఈ బస్సు ఇంజిన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్, అప్రమత్తమై బస్సును వెంటనే నిలిపివేశారు. ఆ సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉండగా, మంటలు వ్యాపించకముందే వారంతా సురక్షితంగా కిందకు దిగడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులందరూ క్షేమంగా బయటపడటంతో అధికారులు, బంధువులు ఊపిరిపీల్చుకున్నారు.

# నిర్మాతలు వర్సెస్ ఎగ్జిబిటర్లు

**హైదరాబాద్,(భారత శక్తి)** రామ్ చరణ్ 'పెద్ది' సినిమా విడుదలకు ముందు టాలీవుడ్‌లో నిర్మాతలు వర్సెస్ ఎగ్జిబిటర్లు అన్నట్లుగా మారింది. ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నిన్న కీలక నిర్ణయం తీసుకుంది. సింగిల్ స్క్రీన్‌లలో పర్సంటెజీ విధానానికి అంగీకరించిన నిర్మాతల సినిమాలనే ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటించింది.ఈ నిర్ణయంపై యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ బుధవారం మీడియా సమావేశం నిర్వహించింది. రవిశంకర్ యలమంచిలి, నాగవంశీ, సాహు గారపాటి, సతీష్ కిలారు తదితరులు ప్రెస్ మీట్‌లో పాల్గొన్నారు. చిత్ర పరిశ్రమలో ఎగ్జిబిటర్లతో పాటు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. మూడు సెక్టార్లు కూర్చుని మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు.రవిశంకర్ మాట్లాడుతూ, తాము ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. సినిమా అనేది ఏ ఒక్కరి కష్టం కాదని పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో ఒక ఎకో సిస్టమ్ ఉందని తెలిపారు. ఎగ్జిబిటర్ల ఇబ్బందులను తాము అర్థం చేసుకుంటామని అన్నారు. అయితే పరిశ్రమలో అందరూ కలిసి మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎగ్జిబిటర్ వ్యవస్థలో మార్పు రావాలని, కానీ ఇప్పటికిప్పుడు మార్పు రావాలంటే కష్టమని అన్నారు.హరిహర వీరమల్లు విడుదల సమయంలో పర్సంటేజీ విధానం బయటకు వచ్చిందని, ఆ తర్వాత మరెన్నో సినిమాలు విడుదలయ్యాయని అన్నారు. ఇప్పుడు పెద్ది సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.పర్సంటేజీ విధానాన్ని అమలు చేసే సినిమాలనే ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని నాగవంశీ అన్నారు. ఎగ్జిబిటర్లు అడుగుతున్న పర్సంటేజీని తాము ఇవ్వలేమని అన్నారు.

మల్టీప్లెక్స్‌లు ఉన్న ఒక ఎగ్జిబిటర్ సింగిల్ స్క్రీన్ కష్టాల గురించి మాట్లాడటం, అలాగే పర్సంటేజీ ప్రకటించిన 23 థియేటర్లు లీజులోనే ఉండటం హాస్యాస్పదమని అన్నారు.ఇప్పుడు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో బాల్కనీ టికెట్ రేటు 200 లోపే ఉంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే... 175 రూపాయలు. ఆన్ లైన్ టికెటింగ్ యాప్స్ అయిన పేటీఎమ్, బుక్ మై షోలో బుక్ చేస్తే 200 అవుతుంది. బాల్కనీ తర్వాత వంద రూపాయలు, నేల టికెట్టు 50 రూపాయలు ఉంది. సినిమా విడుదలైనప్పటి నుంచి మొదటి వారం లేదా పది రోజులు టికెట్ రేట్లు పెంచుకోవడానికి అనుమతి లభిస్తే ఆ రేటు 200 నుంచి 400 లేదా 500 వరకు వెళుతోంది. బెనిఫిట్ షో రేట్లు అయితే 1000 నుంచి 2000 వరకు ఉంటున్నాయి.

ఇప్పుడు టికెట్ రేట్లు పెంచమని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ స్పష్టంగా చెప్పడం వల్ల మొదటగా నష్టపోయే సినిమా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది'యే.జూన్ 4న 'పెద్ది' విడుదల అవుతోంది. సినిమాకు కావాల్సిన బజ్ ఆల్రెడీ విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు తీసుకు వచ్చాయి. అభిమానులు, ప్రేక్షకులు కొందరు నాలుగు వందలు అయినా టికెట్ పెట్టి సినిమా మొదటి వారం సినిమా చూసేందుకు రెడీ. ఆల్రెడీ టికెట్ రేట్లు గురించి ప్రభుత్వంతో చిత్ర నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడినట్టు తెలిసింది. జీవో వచ్చినా సింగిల్ స్క్రీన్ థియేటర్లు టికెట్ రేట్లు పెంచి సినిమా ప్రదర్శించేందుకు ససేమిరా ఒప్పుకోమని చెబితే నిర్మాతకు వచ్చే వసూళ్ళకు పెద్ద గండి పడుతుంది. మైత్రి డిస్ట్రిబ్యూషన్, సింగిల్ స్క్రీన్ ఎగ్జిబిటర్స్ మధ్య కొన్ని రోజులుగా ఇష్యూలు ఉన్నాయి. ఇప్పుడు అవి 'పెద్ది' మీద ఎఫెక్ట్ చూపించేలా

# ఎస్ఐఆర్ పారదర్శకంగా జరపాలి

**హైదరాబాద్** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ,ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బలమురి వెంకట్ ,ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ,నవీన్ యాదవ్, శ్రీ గణేష్ , కార్పొరేషన్ చైర్మన్ లు ,ఇతర ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ చాలా పారదర్శకంగా జరపాలని ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేసారు.

# బండి వ్యవహారంపై అధిష్టానం ఆరా

**హైదరాబాద్, (భారత శక్తి)** తెలంగాణ బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కు పెద్ద తిప్పలే ఎదుర వుతున్నాయా? పుత్రుడి కారణంగా ఆయన సంపాయించుకున్న పేరు, పరపతి ఇబ్బందుల్లో పడిపోయిందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. బండి కుమారుడు భగీరథ్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాంటూ.. బాలిక వాంగ్మూలం ఇవ్వడం... దీనిపై కేసు నమోదు కావడం తెలిసిందే.

అయితే.. వాస్తవానికి నాలుగు రోజులుగా ఈ వ్యవహారం నలుగుతున్నా.. అనూహ్యంగా ఇప్పుడు ఢిల్లీ వరకు పాకింది. 'కేంద్ర సహాయ మంత్రి బండి కుమారుడిపై పోక్సో కేసు నమోదైంది" అంటూ.. మంగళవారం సాయంత్రం హోరెత్తి పోయింది. అంతేకాదు.. దీనికి కర్ణాటకలోని మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు.. మాజీ ఎంపీ..ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతాన్ని కూడా జతకలిపి మీడియాలో పెద్ద ఎత్తున చర్చలు, వివరణలు, వార్తలు ప్రసారం చేశారు.

ఈ పరిణామం జరుగుతున్న క్రమంలోనే కేంద్ర మహిళా కమిషన్ తోపాటు.. కేంద్ర హోం శాఖ(దీనిలోనే బండి సంజయ్ సహాయ మంత్రిగా ఉన్నారు) ఆరా తీసినట్టు కూడా మీడియా వెల్లడించింది. నిజానికి ఇప్పుడు ఎన్నికలు అయిపోయాయి కాబట్టి సరిపోయిందని.. లేకపోతే.. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఈ వ్యవహారమే బీజేపీని ఇరుకున పెట్టి ఉండేదన్న చర్చ కూడా జరిగింది. ఇదిలావుంటే.. అసలు ఏం జరిగిందన్న విషయంపై కేంద్ర హోం శాఖ వర్గాలు కూడా ఆరా తీశాయి. దీనిపై తెలంగాణ డీజీపీని నివేదిక కోరే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు.. కేంద్ర మంత్రి బండి నుంచి కూడా వివరణ తీసుకుంటారన్న చర్చ జరిగింది. ఎలా చూసుకున్నా.. బండి కుమారుడి వ్యవహారం ఢిల్లీ వరకు చేరడం గమనార్హం. ఈ విషయంలో తన కుమారుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని బండి సంజయ్ చెబుతున్నారు. దీనిని తొలుత రాజకీయ కుట్రగా ఆయన పేర్కొన్నా.. తరువాత తప్పు చేసి ఉంటే.. తన కుమారుడైనా శిక్షకు అర్హుడే అన్నారు.

సో.. దీంతో వ్యవహారం.. ముదురుతున్న సంకేతాలు వస్తున్నాయి. మరో వైపు.. భగీరథ్ కనిపించకుండా తప్పించుకోవడం.. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్న దరిమిలా.. మరింతగా అనుమానాలు బలపడుతున్నాయి. ఇప్పుడు కేంద్రం కూడా జోక్యం చేసుకుంటే.. పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుందని అంటున్నారు. మరి ఏంజరుగుతుందో చూడాలి

# యాక్టివ్ మోడ్‌లోకి కొడాలి

**విజయవాడ, (భారత శక్తి)** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అవకాశం ఉన్నంతవరకు కూటమి పార్టీల్లో చేరిపోయారు. అయితే ఆ ఛాన్స్ లేని వారంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండిపోయారు. కానీ చాలామంది నేతలు పెద్దగా యాక్టివ్ గా లేరు. గతంలో దూకుడుగా ఉన్న నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సైలెంట్ పాటిస్తున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి కొడాలి నాని అయితే రాజకీయాలకు దూరంగా కనిపిస్తున్నారు. అయితే తాజాగా ఆయన జగన్మోహన్ రెడ్డిని ప్రత్యేకంగా కలిశారు. కీలక చర్చలు జరిపారు. దీంతో పార్టీలో కొడాలి నాని యాక్టివ్ అవుతారు అన్న టాక్ వినిపిస్తోంది. గుడివాడలో మాత్రమే కాదు కృష్ణా జిల్లా పార్టీ బాధ్యతలను తీసుకుంటారని తెలుస్తోంది. అదే జరిగితే ఆయన మునుపటి మాదిరిగా దూకుడు ప్రదర్శించే అవకాశం ఉందిమొన్నటి ఎన్నికల్లో గుడివాడ నుంచి ఐదోసారి పోటీ చేసిన కొడాలి నాని కి భారీ ఓటమి ఎదురయింది. అప్పటివరకు తనను ఓడించే నాయకుడు ఎవడు అంటూ బహిరంగంగానే సవాల్ విసురుతూ వచ్చారు. ముఖ్యంగా చంద్రబాబు తో పాటు లోకేష్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకునేవారు. ఈ క్రమంలో ఆయన నోటి నుంచి వచ్చే బూతులు జుగుప్సాకరంగా ఉండేవి. ఆయన వ్యాఖ్యలను ఎక్కువ మంది తప్పు పట్టేవారు. అయితే ఏపీలో వైసిపి ఓడిపోయి కూటమి రావడంతో కొడాలి నాని కి షాక్ తప్పలేదు. ఆయన అరెస్టు కచ్చితంగా ఉంటుందన్న ప్రచారం నడిచింది. కానీ ఎంత లోనే ఆయన అనారోగ్యానికి గురయ్యారు. గుండె నొప్పితో ముంబైలోని ఓ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పొందారు. తరువాత కొద్ది రోజులపాటు హైదరాబాదులోని ఇంటికి పరిమితం అయ్యారు. కోలుకోవడంతో తిరిగి పార్టీలో యాక్టివ్ అవుతారన్న టాక్ వినిపించింది. తాజాగా విదేశీ పర్యటన నుంచి తాడేపల్లి కి చేరుకున్న జగన్మోహన్ రెడ్డిని కలిశారు కొడాలి నాని. వారిద్దరి మధ్య కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కృష్ణా జిల్లాలో టిడిపి కూటమి బలంగా ఉంది. చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇటువంటి సమయంలో సరైన నాయకత్వం అవసరం. అందుకే కొడాలి నానిని జగన్మోహన్ రెడ్డి పిలిచి మాట్లాడినట్లు తెలుస్తోంది. గుడివాడ నియోజకవర్గంలో క్రియాశీలకం కావడంతో పాటు కృష్ణాజిల్లా బాధ్యతలను తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి సూచించారట. మునుపటిలా దూకుడుగా వ్యవహరించాలని ఆదేశించారట. అయితే అందుకు నాని సరేనన్నారట. అయితే అరెస్టు ఉంటుందన్న భయంతో కొడాలి నాని ఉన్నారట. ఎందుకంటే ఆయన స్నేహితుడు వల్లభనేని వంశీ మోహన్ దాదాపు 150 రోజులపాటు జైలు జీవితం అనుభవించారు. అనారోగ్యానికి గురయ్యారు. తనకు అటువంటి పరిస్థితి వస్తుందని కొడాలి నాని కి తెలుసు. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి సూచిస్తున్నట్టు యాక్టివ్ అవుతారా? లేదా? అనేది చూడాలి.

# 16 రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

**న్యూఢిల్లీ, (భారత శక్తి)** భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఇప్పుడు మూడో దశకు చేరుకుంది. ఈసీ వెలువరించిన తాజా ఆదేశాల ప్రకారం.. పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, హర్యానాతో పాటు తెలుగు రాష్ట్రాలు సహా మొత్తం 16 రాష్ట్రాలు , 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. గతేడాది బీహార్‌లో ప్రారంభమైన ఈ స్పెషల్ రివిజన్, ఇప్పుడు దేశంలోని మెజారిటీ రాష్ట్రాలకు విస్తరించింది.ఈ మూడో దశలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల డేటాను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇందుకోసం సుమారు 3.94 లక్షల మంది బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరిస్తారు. మరణించిన వారి పేర్లు తొలగించడం, చిరునామాలు మారిన వారి వివరాలను సరిచేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, డూప్లికేట్ ఎంట్రీలను ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్న వాటిని తొలగించడం ఈ డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యం. రాజకీయ పార్టీలు కూడా తమ తరపున 3.42 లక్షల మంది బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి ఈ ప్రక్రియను పర్యవేక్షించవచ్చు.ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సెన్సస్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని, ఈ గాఎఖీ షెడ్యూల్‌ను ఈసీ ఖరారు చేసింది. రెండింటికీ ఒకే రకమైన యంత్రాంగం అందుబాటులో ఉండటం వల్ల పనులు వేగంగా పూర్తవుతాయని కమిషన్ భావిస్తోంది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ , లడఖ్ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, సెన్సస్ ఫేజ్-2 పనుల దృష్ట్యా, అక్కడ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని ఈసీ స్పష్టం చేసింది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియ మే నెలాఖరు నాటికి ముమ్మరం కానుంది. ఇప్పటికే మొదటి రెండు దశల్లో భాగంగా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రత్యేక ప్రక్షాళన పూర్తయింది. అక్కడ సుమారు 59 కోట్ల మంది ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. తాజా మూడో దశతో కలిపి దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి రానుంది. ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ లింకింగ్ వంటి అంశాలపై కూడా ఈ సమయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ ప్రాధాన్యతని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొని, బూత్ స్థాయిలో సహకరించాలని ఈసీ కోరింది. 2027లో జరగబోయే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందే లోప రహిత ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలనే పట్టుదలతో కమిషన్ ఈ భారీ కసరత్తును నిర్వహిస్తోంది

# హిమంత్‌కు కేంద్రంలో కీలక పదవి

**న్యూఢిల్లీ, (భారత శక్తి)** అస్సాంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. హిమంత బిశ్వశర్మ వరుసగా రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. మే 12న పదవీ బాధ్యతలు చేపట్టారు. బీజేపీ మూడోసారి అధికారం చేపట్టడంతో ఆయన రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజల మధ్య ప్రవేశం, విద్యా సంస్కరణలతో ప్రజా నేతగా ఎదిగిన హిమంత, సర్బానంద సోనోవాల్ ప్రభుత్వంలో మంత్రిగా విద్యా వ్యవస్థను బలోపేతం చేశారు. అధికారులు రాత్రి పాఠశాలల్లో ఉండేలా చేసిన వినూత్న చర్యలు విశేష ప్రశంసలు అందుకున్నాయి.ఎన్నికల ప్రచారంలో 'మోదీ ప్రభుత్వం' పాటలు, పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, రన్నింగ్‌లతో వినూత్న వ్యూహాలు రూపొందించారు. 2019, 2021 అసెంబ్లీ, 2024 లోక్‌సభ, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నినాదం కీలకం. ఈ విధానాలు బీజేపీ గెలుపును నిర్ధారించాయి.హిమంతను బీజేపీ జాతీయ నాయకుడిగా రూపొందిస్తోంది. మహారాష్ట్ర, హర్యాణ, గోవా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బెంగాల్ సీఎంలు 50 ఏళ్ల లోపు యువకులు. వీరు దీర్ఘకాలిక రాజకీయ భవిష్యత్తును సూచిస్తున్నారు. యోగి ఆదిత్యనాథ్ తర్వాత హిమంతకు అలాంటి ఇమేజ్ ఏర్పాటు జరుగుతోంది.నార్త్ ఈస్ట్‌లో బీజేపీ బలాన్ని పెంచిన హిమంత, యూపీ, జార్ఖండ్, ఒడిశా, బెంగాల్ ఎన్నికల్లో ప్రచారం చేశారు. హైదరాబాద్ వినాయక నిమజ్జనంలో పాల్గొన్నారు. అస్సాం?బెంగాల్ మధ్య శత్రుత్వాలను అధిగమించి, 'మామ' అనే స్నేహపూర్వక సంబోధన పొందారు. 1980ల వరకు బెంగాలీ?అస్సామీ గొడవలను ఏకం చేసిన ఆయన ప్రచార వ్యూహాలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించాయి. హిమంత యూపీ ఎన్నికల్లో ప్రచారం చేశాడు. లోక్‌సభ ఎన్నికల సమయంలో పలు రాష్ట్రాల్లో ప్రచారం చేశారు. హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనంలో పాల్గొన్నారు

# రోడ్డు పక్కన వాహనాలు పార్క్ చేస్తున్నారా..

## - బీకేర్‌ఫుల్, తెలంగాణలో కొత్త రూల్స్!

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణలో వాహనాల పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలపడం, రోజుల తరబడి వదిలేయడం వంటి చర్యలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ కొత్త పార్కింగ్ పాలసీ ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూపుదిద్దుకున్న ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, వాహనదారుల జేబుకు చిల్లు పడటమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.ఈ ముసాయిదాలోని నిబంధనల ప్రకారం ఇకపై ఎక్కడపడితే అక్కడ వాహనాన్ని పార్క్ చేస్తే కేవలం జరిమానాతో వదిలిపెట్టరు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా, ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో ఉన్న వాహనాలను అధికారులు వెంటనే టోయింగ్ చేసి స్వాధీనం చేసుకుంటారు. వాహన యజమాని తన బండిని తిరిగి పొందాలంటే టోయింగ్ ఛార్జీలు, వాహనాన్ని యార్డులో ఉంచినన్ని రోజులకు రోజువారీ పార్కింగ్ ఫీజు చెల్లించాలి.

అంతేగాక ఆ వాహనంపై ఉన్న పెండింగ్ చలాన్లు, ఇతర జరిమానాలు మొత్తం చెల్లించిన తర్వాతే వాహనాన్ని అప్పగిస్తారు.ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం వాహనాల వేలం. అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాన్ని నెల నుంచి 45 రోజుల్లోగా యజమాని క్లెయిమ్ చేసుకోకపోతే, ఆ వాహనాన్ని ప్రభుత్వపరం చేసి బహిరంగ వేలం వేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇలా స్వాధీనం చేసుకున్న వాహనాలను భద్రపరిచేందుకు పీపీపీ పద్ధతిలో ప్రత్యేక పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా రవాణా శాఖ ప్రతిపాదించింది.నిర్బంధించిన వాహనాలకు విధించే రోజువారీ పార్కింగ్ ఫీజులను కూడా ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రాంతాలను బట్టి ఈ ఛార్జీలు మారతాయి. ద్విచక్ర వాహనానికి రోజుకు రూ.20 నుంచి రూ.30, ఆటోకు రూ.35 నుంచి రూ.50, కారుకు రూ.60 నుంచి రూ.80, బస్సు లేదా లారీకి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేయాలని ప్రతిపాదించారు. ఎవరైనా వాహనాలను రోడ్లపై వదిలేసి వెళితే గతంలో జరిమానా విధించేవారు.. ఇకపై అలా కాదు జరిమానాలతో పాటుగా వాహనాన్ని స్వాధీనం చేసుకుంటారు. టోయింగ్ ఛార్జీలను కూడా వాహన యజమాని చెల్లించాల్సి ఉంటుంది.. అంతేకాదు ఆ వాహనాన్ని పోలీసుల దగ్గర ఉంచిన అన్ని రోజులకు పార్కింగ్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ వాహనంపై ఏవైనా పెండింగ్ చలాన్లు ఉన్నా ఇతర డాక్యుమెంట్లకు సంబంధించి ఏవైనా జరిమానాలు ఉన్నా చెల్లించాల్సిందే. ఒకవేళ వాహన యజమాని నెల నుంచి 45 రోజుల్లో క్లెయిమ్ చేయకపోతే ఆ వాహనాన్ని వేలానికి పంపే అవకాశం ఉంటుంది. వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన సమయంలో, బ్రేక్‌డౌన్ అయిన సందర్భంలో.. ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో వాహనాల్ని టోయింగ్ చేయాలని రవాణాశాఖ ముసాయిదాలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.ఈ వాహనాలు టోయింగ్, పార్కింగ్ ఫీజులకు సంబంధించి కూడా రవాణాశాఖ ఛార్జీలను ప్రతిపాదించింది. నగరాలు, గ్రామీణ ప్రాంతాల వారీగా ఈ ఛార్జీలు వేర్వేరుగా ఉన్నాయి. ఈ వాణాలను పార్క్ చేసేందుకు కొత్తగా పీపీపీ (ప్రభుత్వ ప్రైవేట్) భాగస్వామ్యంలో పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు. ఈ వాహనాలకు నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలను బట్టి రోజువారి పార్కింగ్ ఫీజులు నిర్ణయించిన్లు తెలుస్తోంది. బైక్‌లకు రోజుకు రూ.20 నుంచి 30, ఆటోలకు రూ.35 నుంచి 50, కార్లకు రూ.60 నుంచి 80, బస్సులకు రూ.200 నుంచి రూ.300 రోజుకు చెల్లించాలని ముసాయిదాల రవాణాశాఖ ప్రతిపాదించింది.ప్రస్తుతం ముసాయిదా దశలో ఉన్న ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తుది మార్పులతో అమలు చేయనుంది.

# హాట్ స్పాట్‌గా కొంపల్లి

**హైదరాబాద్, (భారత శక్తి)** హైదరాబాద్ ఉత్తర ప్రాంతంలో ఐటీ విస్తరణ కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా కండ్లకోయలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గేట్‌వే ఐటీ పార్క్ పనులు వేగవంతం కావడంతో, ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా మారుతోంది. ఐటీ కంపెనీల రాకతో వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తుండటం వల్ల ఐటీ నిపుణుల దృష్టి ఇప్పుడు మేడ్చల్, కొంపల్లి వైపు మళ్లింది.పశ్చిమ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో స్థిరాస్తి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో, మధ్యతరగతి గృహ కొనుగోలుదారులు కొంపల్లి, దాని చుట్టుపక్కల ప్రాంతాలపై మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ ఇప్పటికీ బడ్జెట్ ధరలో నాణ్యమైన విల్లాలు, అపార్ట్‌మెంట్లు అందుబాటులో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. కండ్లకోయ ఐటీ పార్క్ పూర్తయితే ఈ ప్రాంతంలో నివాసాల డిమాండ్ మరిన్ని రెట్లు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మెరుగైన మౌలిక సదుపాయాలు మరియు కనెక్టివిటీ ఈ ప్రాంతానికి అదనపు బలాన్ని ఇస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్ , జాతీయ రహదారికి సమీపంలో ఉండటం వల్ల ప్రయాణం సులభతరంగా మారింది. దీనికి తోడు మెట్రో రైల్ రెండో దశ విస్తరణపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం కూడా రియల్ ఎస్టేట్ వృద్ధికి ఊతమిస్తోంది.కొంపల్లి, గుండ్లపోచంపల్లి, సుచిత్ర వంటి ప్రాంతాల్లో వెలుస్తున్న కొత్త ప్రాజెక్టులలో ఆధునిక వసతులు, విశాలమైన పార్కులు మరియు కమ్యూనిటీ హాల్స్ వంటి సదుపాయాలు ఉండటంతో ఐటీ ఉద్యోగులు ఇక్కడ స్థిరపడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తక్కువ ధరలో లగ్జరీ జీవనశైలిని కోరుకునే వారికి నార్త్ హైదరాబాద్ ఇప్పుడు అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోంది.

# అప్పుల పాలవుతున్న జీహెచ్ఎంసి

**హైదరాబాద్ (భారత శక్తి)** ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన జీహెచ్ఎంసీకి భరోసా కల్పించాల్సిన సర్కారు సంస్థ ఉనికిని ప్రశ్నార్థకం చేసింది. జీహెచ్ఎంసీని సైబరాబాద్ (సీఎంసీ), మల్కాజిగిరి (ఎంఎంసీ)గా విభజించిన సర్కారు..ఆస్తుల విభజన, అప్పులను సీజీజీ నేతృత్వంలో కమిటీ వేయగా.. దాదాపు రూ. 4,717 కోట్ల అప్పులను సర్కారు ఆదుకోవాలంటూ ప్రతిపాదనలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే అప్పులను టెకోవర్ చేసుకునేందుకు ససేమిరా అంటున్నది. ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) ద్వారా సర్దబాటు చేసుకోవాలంటూ ఉచిత సలహా ఇవ్వడం విశేషం..కాగా బల్దియా చేసిన వేల కోట్ల అప్పులను నేరుగా టేకోవర్ చేసేందుకు సాంకేతిక ఇబ్బందులు ఉన్న దృష్ట్యా, పన్ను బకాయిల రూపంలో నిధులను సర్దుబాటు చేసి సంస్థను బలోపేతం చేయాలని నిర్ణయించింది.తెలంగాణ వార్తలు ప్రభుత్వ భవనాల నుంచి రావాల్సిన భారీ బకాయిలను వన్ టైమ్ సెటిల్ మెంట్ ద్వారా చెల్లించడం.. అప్పుల భారాన్ని తగ్గించాలని ఇటీవల కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. అయితే ఇప్పటి వరకు ఎ లాంటి అధికారిక జీవో వెలువడలేదు. ఈ తరుణంలోనే ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన ఆస్తి పన్నును ఓటీఎస్ ద్వారా సర్దుబాటు చేయడం ద్వారా మూడు కార్పొరేషన్లకు సుమారు రూ. 1,686 కోట్లు తక్షణమే అం దుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు..మిగిలిన దాదాపు రూ.3వేల కోట్ల అప్పులు ఏడాది కాలంలో ఒక్క జీహెచ్ఎంసీతోనే ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జీహెచ్ఎంసీకి ఆరేండ్లుగా రావాల్సిన స్టాంపు డ్యూటీ రూ.3,030 కోట్లను గతేడాది జనవరి నెలలో రిలీజ్ చేసింది. మొత్తం రూ. 3,169 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో స్టాంప్ డ్యూటీకి సంబంధించి రూ. 3030 కోట్లు, మ్యూటేషన్ ఫీజుల కింద రూ. 139 కోట్లు రావాల్సి ఉండగా, ఇందులో స్టాంప్




డ్యూటీ మొత్తాన్ని బల్ధి యా పర్సనల్ డిపాజిట్స్ (పీడీ) అకౌంట్‌లో జమ చేసింది. అయితే ఈ నిధులను రెవెన్యూ ఖర్చు కోసం మాత్రమే వినియోగించాలని నిబంధన పెట్టింది.డెవలప్‌మెంట్‌కు ఒకేసారి వాడుకునేందుకు వీలులేకపోవడం, ఉద్యోగుల జీతాలు, మెయింటనెన్స్ లోన్ల రీ పేమెంట్స్ కోసం వినియోగించారు. మొత్తంగా రూ. 1000 కోట్లను మాత్రమే వినియోగించుకున్నారు. ఇంకా నెలవారీగా ఈ నిధులను రెవెన్యూ ఖర్చులకు వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్న తరుణంలో, కుడి చేత్తో ఇచ్చి ఎడమ చేత్తో తీసుకున్నట్లుగా సర్కారు బల్ధియా ఈ నిధులను వెనక్కి తీసుకున్న కోలుకోని షాక్‌కు గురి చేసింది. ఉన్న ఫళం గా రూ. 2వేల కోట్లకు పైగా లాగేసుకుని కనీసం ఆ ప్రస్తావన తీసుకురాకపోవడంపై తీవ్రంగా మండిపడుతున్నారు.జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విడగొట్టి, ఒకో దానికి రూ. 500 కోట్లు ఇస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు..ఆ హామీని గాలికి వదిలేశారు. స్పెషల్ ఆఫీసర్ జయేశ్ రంజన్ ప్రతి కార్పొరేషన్‌కు రూ. 500కోట్ల మేర నిర్వహణ ఖర్చులకు ఇస్తామని ప్రకటించారు. కానీ బడ్జెట్‌లో కనీసం నయా పైసా కేటాయింపులు జరపలేదు. ఫలితంగా నగర శివారులోని 27 పురపాలికలను జీహెచ్ఎంసీలో కలపడం ద్వారా ఆ ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయన్న ఆశలు ఆవిరైపోయాయి. విలీనం ముందు బడంగ్‌పేట, నార్సింగి, మణికొండ పురపాలికలు ప్రతి ఏటా రూ.200కోట్ల మేర సర్‌ప్లస్‌లో బడ్జెట్ ఉండేదని, ఇప్పుడు మౌలిక వసతుల కల్పనపై తీవ్ర ప్రభావం పడుతుందని స్థానికులు మండిపడుతున్నారు.

# గ్రేటర్ సిటీలుగా విజయవాడ, తిరుపతి

**విజయవాడ,(భారత శక్తి)** ఏపీలో రెండు నగరాలు గ్రేటర్ సిటీలుగా మారనున్నాయి. విజయవాడ, తిరుపతిలకు గ్రేటర్ హోదా రానుంది. ఈ రెండు నగరాల్లో 138 పంచాయతీల విలీన ప్రతిపాదనల్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నంలో మరో 63 పంచాయతీలను చేర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు గ్రామాల విలీనానికి సంబంధించి అంశంపై ఫోకస్ పెట్టారు. త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు..ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రెండు నగరాలను 'గ్రేటర్' హోదాకు మార్చబోతోంది. విజయవాడ, తిరుపతి నగరాల గ్రేటర్ ప్రతిపాదనలకు సంబంధించి మరో అప్డేట్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం రెండు నగరాల విస్తీర్ణం పెంచేందుకు.. 10 మండలాల్లోని 138 గ్రామ పంచాయతీలను విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం పరిధిలోకి మరో 64 పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం జనగణన పూర్తయ్యేలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. వాస్తవానికి గ్రేటర్ నగరాల ప్రతిపాదనలపై ఇప్పటికే నిర్ణయం తీసుకోవాల్సింది కానీ జనగణన కారణంగా పక్కన పెట్టారు.విజయవాడ గ్రేటర్ సిటీ ప్రతిపాదనలో భాగంగా ఆ? మండలాల్లో ఉన్న 75 పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని 2014-2019 మధ్య ప్రతిపాదనలు వచ్చాయి. కానీ గత ఐదేళ్లు ఈ ప్రతిపాదనల్ని పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం తాజాగా ఈ ప్రతిపాదనల్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. విజయవాడ గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటైతే కేంద్రం నుంచి నిధులు కూడా వస్తాయి.. అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.. అందుకే ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. విజయవాడలోకి ఇప్పటికే చుట్టుపక్కల ఉన్న ఎన్నో గ్రామాలు, పట్టణాలు కలిసిపోయాయి.. కానీ మున్సిపాలిటీలో, గ్రామ పంచాయతీలు హోదాలోనే ఉన్నాయి. అందుకే అభివృద్ధికి అవకాశం లేకుండా పోయింది. అందుకే విలీన ప్రక్రియను పూర్తిచేసి విజయవాడను గ్రేటర్ కార్పొరేషన్‌గా మార్చాలని భావిస్తున్నారు.తిరుపతిని గ్రేటర్ కార్పొరేషన్‌గా ఏర్పాటు, గ్రామాల విలీనానికి సంబంధించి గతేడాది తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. తిరుపతి రూరల్, రేణిగుంట, చంద్రగిరి మండలాల్లోని 64 గ్రామాలను గ్రేటర్ తిరుపతిలోకి విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే మంగళం, అవిలాలలు తిరుపతి నగరంలో కలిసిపోయాయి.. అవి పంచాయతీలుగా ఉండటంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రతిపాదించిన గ్రామాలతో పాటుగా నగరంలో కలిసిన ప్రాంతాలతో గ్రేటర్ తిరుపతి నగరపాలక సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. విలీన ప్రక్రియపై త్వరలోనే క్లారిటీ వచ్చే ఛాన్సుంది అంటున్నారు.గ్రేటర్ విశాఖపట్నంలోకి 64 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ గ్రామాలు ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఉన్నాయి. తాజాగా ప్రతిపాదించిన గ్రామాల్లో 60శాతం నగరంలో కలిసిపోయాయి. అందుకే ఈ పంచాయతీలను గ్రేటర్ పరిధిలోకి తీసుకుంటే మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా గ్రామ విలీనం చాలా ముఖ్యమని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి, భీమిలి, గాజువాక మున్సిపాలిటీలు గ్రేటర్ విశాఖపట్నంలో విలీనమైన తర్వాతే అభివృద్ధి చెందాయని చెబుతున్నారు. మొత్తం మీద విజయవాడ, తిరుపతి గ్రేటర్ సిటీలుగా మారబోతున్నాయి.. విటు గ్రేటర్ విశాఖపట్నంలో మరికొన్ని గ్రామాలు విలీనంకానున్నాయి

# జగన్ మావిగన్ యూ టర్న్...

**విజయవాడ, (భారత శక్తి)** ఏపీ రాజకీయాల్లో ఒకప్పుడు మూడు రాజధానుల మంత్రం పఠించిన వైసీపీ హఠాత్తుగా మావిగన్ అనే ఊహాజనిత రాజధానిని ప్రకటించింది. జగన్ రెడ్డి ప్రకటించిన ఆ రాజధాని కాస్తా ఇప్పుడు ఆ పార్టీకి మింగుడు పడని వ్యవహారంగా మారింది. అమరావతికి పోటీగా అత్యంత ఖర్చు తక్కువతో ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయవచ్చని అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించినా, అది క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ పొందకపోగా.. తీవ్ర స్థాయిలో ఎకసెక్కాలకు గురవుతోంది. సోషల్ మీడియాలో వస్తున్న సెటైర్లు, విమర్శలకు సమాధానం చెప్పుకోలేక ఇప్పుడు వైసీపీ శ్రేణులు ఈ అంశంపై వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నాయి.అమరావతిని అవినీతి గనిగా అభివర్ణిస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా మావిగన్ మోడల్‌ను తెరపైకి తెచ్చినప్పుడు వైసీపీ నేతలు ఆకాశమే హద్దుగా మాట్లాడారు. కానీ, అది కేవలం ఒక ఊహాజనిత పదంగానే మిగిలిపోయిందని, దానికి ఎలాంటి శాస్త్రీయ పునాది లేదని మేధావుల నుంచి వచ్చిన విమర్శలతో ఆ పార్టీ డిఫెన్స్‌లో పడింది. అసలు మావిగన్ అనే పేరు వినగానే జనాల్లో వస్తున్న నవ్వులు చూశాక, ఈ అంశంపై చర్చ పెడితే పరువు పోవడం ఖాయమని గ్రహించిన నేతలు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రోజా వంటి వారు సైతం ఇప్పుడు ఆ రెండు ప్రాంతాలు ఒక్కటే కదా అంటూ సర్దుబాటు మాటలు మాట్లాడుతుండటం ఆ పార్టీలో నెలకొన్న అయోమయానికి నిదర్శనం.అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చి, నిధులు కూడా మంజూరు చేస్తున్న తరుణంలో మావిగన్ ప్రస్తావన వైసీపీకి సెల్ఫ్ గోల్‌లా మారింది. ఒకవైపు అమరావతిలో పనులు శరవేగంగా జరుగుతుంటే, కేవలం ప్లాన్-బి అంటూ లేని కారిడార్ గురించి మాట్లాడటం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతుందని ఆ పార్టీకి ఆలస్యంగా జ్ఞానోదయం అయినట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు మేధావులతో చర్చలు లేవు, సోషల్ మీడియాలో పోస్టులు లేవు. కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన ఈ మావిగన్ సిద్ధాంతాన్ని జనం మరిచిపోయేలా చేయడమే ఇప్పుడు వైసీపీ ముందున్న ఏకైక మార్గంలా కనిపిస్తోంది.అమరావతిని దెబ్బకొట్టాలని తీసిన మావిగన్ అస్త్రం తిరగబడి సొంత పార్టీకే తగిలింది. రాజకీయంగా మైలేజ్ వస్తుందని ఆశించిన ఈ కాన్సెప్ట్ కాస్తా, ఇప్పుడు కేవలం మీమ్స్‌కు మాత్రమే పరిమితం కావడంతో వైసీపీ నేతలు ఇప్పుడు గన్ తీసి పక్కన పెట్టి, మళ్ళీ పాత సంక్షేమ రాగాన్నే అందుకోవాలని చూస్తున్నారు.

# ఘర్ వాపసీ కష్టాలు

**నెల్లూరు (భారత శక్తి)** వైసీపీ నుంచి చాలా మంది నేతలు గత రెండేళ్ళుగా బయటకు పోయారు, వివిధ కారణాలతో అనేక మంది పార్టీకి గుడ్ బై కొట్టారు. ఫ్యాన్ నీడన తమకు ఉక్కబోతగా ఉందని చెప్పి మరీ తలాఖ్ అనేశారు. వైసీపీలో ఏళ్ళ తరబడి పనిచేసిన వారు పునాదుల నుంచి ఉన్న వారు వైఎస్సార్ కుటుంబంతో తరాలుగా పనిచేస్తున్న వారు కూడా పార్టీ గేటు దాటారు. ఇదంతా ఒక విధంగా ఆశ్చర్యంగా సాగింది. రాజకీయాల్లో ఇవన్నీ మామూలు అయినా ఏ పార్టీకి అయినా మొదటి నుంచి ఉన్న వారు కొనసాగుతారు. అయారాం గయారాం ల విషయం అందరికీ ఎరుకే. కానీ పునాదుల నుంచి ఉన్న వారే వెళ్ళి పోవడం అంటే అది వైసీపీకి కలవరం కలిగించే అంశమే అని కూడా విశ్లేషణలు ఉన్నాయి.వైసీపీలో జగన్ తరువాత నంబర్ టూ అనిపించుకున్న విజయసాయిరెడ్డి పార్టీని వీడుతారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు, ఆయన పార్టీ నుంచి చాలా సైలెంట్ గా నిష్క్రమించారు. అలాగే వైసీపీతోనే సర్వం అనుకున్న మాజీ మంత్రులు మోపిదేవి వెంకట రమణ, ఆళ్ల నాని, సామినేని ఉదయభాను, జగన్ బంధువు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వంటి వారు చాలా సులువుగా బంధాలను తెంపుకుని బయటకు వెళ్ళారు. ఇక మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీల జాబితా చూస్తే చాలానే ఉంది. అంతవరకూ ఎందుకు ఎమ్మెల్సీలుగా ఇంకా చేతిలో అధికారం ఉన్నా కూడా వైసీపీ వద్దు అని పదవులు సైతం వదులుకుని వెళ్ళిన వారూ ఉన్నారు. అయితే వీరంతా వైసీపీ భారీ ఓటమికి సంబంధించిన బాధలోనో లేక కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టి సొంత ఇబ్బందుల వల్లనో వెళ్ళారని అంతా అనుకున్నారు. వైసీపీ అధినాయకత్వం కూడా అలాగే భావించి కొన్నాళ్ళకు అయినా వారంతా రిటర్న్ అవుతారు అని ఊహించింది. అయితే ఇతర పార్టీలలో చేరి ఇబ్బందులు పడుతున్నా తాము వైసీపీలోకి తిరిగి వెళ్లేది లేదని చాలా మంది నేతలు బాహాటంగా ప్రకటిస్తున్నారు అంటే వైసీపీ అంటే వారికి ఎంతటి వెగటు పుట్టిందో అర్థం కావడం లేదని అంటున్నారు. తాజాగా ఒంగోలు జిల్లా దిగ్గజ నేత మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అయితే తాను ఎట్టి పరిస్థితిల్లోనూ వైసీపీ గడప తొక్కేది లేదని అన్నారు. తన భవిష్యత్తు అంతా జనసేనలోనే అని క్లారిటీ ఇచ్చారు. అయినా తనను టార్గెట్ చేసి తాను వైసీపీలోకి వస్తున్నారు అని ప్రచారం చేయిస్తున్నారు అని మండిపడ్డారు. తాను జనసేనలో ఒక వేళ ఇబ్బంది పడినా వైసీపీకి వచ్చిన నొప్పి ఏంటని బాలినేని ప్రశ్నించారు. వైసీపీ నుంచి వెళ్ళిన మరో కీలక నేత విజయసాయిరెడ్డి వీలైనపుడల్లా వైసీపీని విమర్శిస్తూనే ఉన్నారు. వైసీపీ అధికారంలోకి రావడం కష్టమని ఆయన జోస్యం చెబుతూ వస్తున్నారు. అంతే కాదు వైసీపీకి ఏపీని ఏలా అభివృద్ధి చేయాలో విజన్ లేదని లేటెస్ట్ గా ఆయన హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో టీడీపీకి వైసీపీకి ఆల్టర్నేషన్ గా థర్డ్ ఫోర్స్ రావాలని కూడా ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. ఇదే విషయం పదే పదే చెబుతున్నారు. దాంతో విజయసాయిరెడ్డి ఇదిగో అదిగో వచ్చేస్తున్నారు అని జరుగుతున్న ప్రచారం అంతా ఒట్టిదే అని అంటున్నారు. ఇక ఇదే తీరున అనేక మంది మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారని అంటున్నారు. వీరంతా తమకు ఇతర పార్టీలలో చాన్స్ లేకపోయినా ఓకే కానీ తిరిగి వైసీపీలోకి వెళ్ళమని అంటున్నారు అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు. వైసీపీ ఓటమి తరువాత పార్టీని పటిష్టం చేయాలని చూస్తోంది. చాలా చోట్ల పాత కాపులు లేక ఇబ్బందులు వస్తున్నాయి. దాంతో అనుభవం ఉన్న వారు గతంలో పార్టీలో పనిచేసిన వారు వస్తే ఘర్ వాపసీ కింద ఓకే చెబుతారు అన్న ప్రచారం ఉంది. మరి వైసీపీలోకి వచ్చే నాయకులు ఎవరు అన్నదే చర్చగా ఉంది. చిత్రమేంటి అంటే చాలా మంది ఏ పార్టీలో చేరకుండా వెయిట్ చేస్తున్నారు మరి వీరిలో ఎవరైనా తిరిగి వైసీపీ వైపు వస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

# పిఠాపురం పెద్దన్న పవనే..



**కాకినాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ తన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గానికి ప్రజా ప్రతినిధిగానే కాకుండా.. తన రాజకీయానికి హ్యూమన్ టచ్ ఇస్తున్నారు. పిఠాపురం మొత్తాన్ని ఆత్మీయ కుటుంబంగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా ప్రతినిధి పాత్రకు భిన్నంగా, ఆయన అక్కడ ఒక కుటుంబానికి పెద్దన్న తరహాలో ప్రతి ఇంటి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా, నియోజకవర్గంలోని పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో భరోసా కల్పిస్తూ, ఒక పెద్దన్న తన కుటుంబం పట్ల చూపే బాధ్యతను ఆయన నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఆయన చూపిస్తున్న శ్రద్ధ అందర్నీ ఆశ్చర్య పరుస్తోంది. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యాభ్యాసం కల్పించడంతో పాటు, తల్లిదండ్రులు లేని చిన్నారులకు భగవంతుని బిడ్డలు అని పేరు పెట్టి తన సొంత జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఒక తండ్రి తన పిల్లల చదువు కోసం ఎలాగైతే తపన పడతారో, పవన్ కళ్యాణ్ గారు కూడా పిఠాపురం విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్నారు. విద్యా సంస్థలను ఒప్పించి ఉచిత అడ్మిషన్లు ఇప్పించడం ద్వారా ఒక తరం భవిష్యత్తును ఆయన తీర్చిదిద్దుతున్నారు.సంక్షేమ పథకాలను కేవలం ప్రభుత్వ ఫైళ్లకు పరిమితం చేయకుండా, పండుగ వచ్చిందంటే పిఠాపురంలోని ప్రతి ఆడబిడ్డకు తన తరఫున చీరలు పంపడం, కష్టాల్లో ఉన్న రైతులకు అండగా నిలవడం ఆయనకు అలవాటుగా మారింది. ఉపాధ్యాయుల సమస్యలైనా, సామాన్యుల ఆరోగ్య అవసరాలైనా పవన్ ఉన్నారు అనే ధీమా ఇప్పుడు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తోంది. క్షేజలు ఆయనను ఒక నాయకుడిలా కంటే, తమ ఇంటి పెద్ద దిక్కులా భావించి కష్టాలు చెప్పుకుంటున్నారు. వాటిని ఆయన పరిష్కరిస్తున్నారు.పిఠాపుం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్ గా మార్చే క్రమంలో పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ఈ వ్యక్తిగత సహాయ ? సామాజిక బాధ్యత ఫార్ములా ఒక సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికింది. నియోజకవర్గవ్యాప్తంగా 580 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 31 మంది విద్యార్థులను గుర్తించి, వారి ఆసక్తికి అనుగుణంగా నచ్చిన కోర్సుల్లో చేర్పించే బాధ్యతను పవన్ కళ్యాణ్ స్వయంగా చేపట్టారు. వీరిలో రాష్ట్రస్థాయిలో 598 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థి కూడా ఉన్నారు.ఇప్పటికే తల్లిదండ్రులు లేని పిల్లలకు తన జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న ఆయన, ఇప్పుడు ఈ విద్యా సాయం ద్వారా మరో ముందడుగు వేశారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, విద్యార్థుల కెరీర్ పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ చొరవతో పలు ప్రముఖ విద్యా సంస్థలు ఈ 31 మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. విద్యార్థులు ఏ కాలేజీలో చదవాలనుకుంటున్నారో, ఏ కోర్సుపై వారికి ఆసక్తి ఉందో తెలుసుకొని, సంబంధిత యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి ఈ అవకాశాన్ని కల్పించారు.తన పిలుపును గౌరవించి విద్యార్థులకు బాసటగా నిలిచిన విద్యా సంస్థలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో నాయకులు హామీలు ఇవ్వడం సహజం, కానీ ఇచ్చిన హామీలను దాటి తన వ్యక్తిగత చొరవతో, సొంత జీతంతో ప్రజలకు సాయం చేయడం పవన్ కళ్యాణ్ ప్రత్యేకతను చాటుతోంది. పిఠాపురం నియోజకవర్గంలో విద్యార్థుల పట్ల ఆయన చూపిస్తున్న ఈ ఆదరణ కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రజాప్రతినిధులకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది. సామాన్య విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్న పవన్ కళ్యాణ్ పిఠాపురం వాసుల మనసు గెల్చుకుంటున్నారు.అభివృద్ధి పనుల కోసం నిధులు తేవడం ఒక ఎత్తు అయితే, తన వ్యక్తిగత ఆదాయాన్ని ప్రజల కోసం ఖర్చు చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం మరో ఎత్తు. పిఠాపురం ప్రజల పట్ల ఆయన చూపిస్తున్న ఈ వాత్సల్యం, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ఒక ఆత్మీయ అనుబంధంగా మారుతోంది.

# బొత్స స్థానంలో వరుదు...

**విజయనగరం (భారత శక్తి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అధినేత జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని బెంగళూరు వచ్చారు. అక్కడి నుంచి తాడేపల్లి కి చేరుకున్నారు. పార్టీ సీనియర్లతో వరుసగా సమావేశాలు జరుపుతారు. వచ్చే నెల నుంచి ఆయన జిల్లాల పర్యటనలు మొదలు పెడతారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి ఆయన పర్యటనలు ఉంటాయని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మరోవైపు జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కొత్తగా పార్టీ తరఫున ఒక నియామకం చేపడతారని తెలుస్తోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. 175 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 11చోట్ల మాత్రమే ఆ పార్టీ గెలిచింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాలేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి. కానీ శాసనమండలిలో మాత్రం 30 మందికి పైగా ఎమ్మెల్సీలు ఆ పార్టీకి ఉన్నారు. అక్కడ మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది తిరుగులేని ఆధిపత్యం. అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ఉంది. అందుకే తనకు దక్కని ప్రతిపక్ష హోదా ఒక సీనియర్ కు ఇవ్వాలని భావించారు జగన్మోహన్ రెడ్డి. అలా బొత్స సత్యనారాయణకు చాన్స్ దక్కింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బొత్స చీపురుపల్లి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కానీ విశాఖ స్థానిక సంస్థల నుంచి బొత్సకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి.. శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఛాన్స్ ఇచ్చారు. అలా ఒక సీనియర్ నాయకుడిగా బొత్స సముచిత స్థానాన్ని దక్కించుకున్నారు.అయితే ఇటీవల తరచూ బొత్స అనారోగ్యానికి గురవుతూ వస్తున్నారు. రాజకీయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బొత్సకు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండేందుకు వీలుపడటం లేదు. ఇప్పటికే కుటుంబ సభ్యులతో పాటు పిల్లలిద్దరూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ గా పని చేసేందుకు సిద్ధమయ్యారు. అందుకే బొత్సను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న క్రియాశీలక పదవుల నుంచి విముక్తి కలిగించాలని కుటుంబ సభ్యులు అధినేత జగన్మోహన్ రెడ్డిని కోరారట. ఆయన సానుకూలంగా స్పందించారట. ఒకవేళ బొత్స వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడి పదవి నుంచి వైదొలిగితే తరువాత ఎవరు అనేది మెదులుతున్న ప్రశ్న. అయితే ప్రముఖంగా వినిపిస్తున్న పేరు వరుదు కళ్యాణి. ఆమె వెనుకబడిన వర్గాలకు చెందినవారు. అనకాపల్లి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. బొత్స స్థానంలో ఆమె ఎంపిక లాంఛనమేనని ప్రచారం నడుస్తోంది. అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# ఏపీలో పొదుపు చర్యలు షురూ...

**విజయవాడ, (భారత శక్తి)**పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా స్పందించింది. . ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ప్రతి ఒక్కరూ తమ కాన్వాయ్‌లను తగ్గించుకుని దేశ ఆర్థిక భద్రతే పరమావధిగా అడుగులు వేస్తున్నారు. నేడు జరిగిన కేబినెట్ సమావేశం ఇందుకు వేదికగా నిలిచింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అధికారిక కాన్వాయ్‌ను 50 శాతం మేర కుదించుకున్నారు. గతంలో సుమారు 10కి పైగా వాహనాలతో వెళ్లే ముఖ్యమంత్రి, నేడు కేవలం 4 వాహనాలతోనే సచివాలయానికి చేరుకున్నారు. తన భద్రతా సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండటానికి, వారి కోసం ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేశారుఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తన కాన్వాయ్‌ను 4 వాహనాలకు పరిమితం చేసుకోవాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. జెడ్ కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. మంత్రి నాదెండ్ల మనోహర్ కేవలం 3 వాహనాల కాన్వాయ్‌తో సచివాలయానికి వెళ్లగా, మంత్రులు అచ్చెన్నాయుడు , మరి కొంత మంది వెళ్లి కేవలం ఒక్కో వాహనంలోనే కేబినెట్ భేటీకి హాజరయ్యారు.మంత్రి నారా లోకేశ్ తన కాన్వాయ్‌ను సగానికి కుదించి, కేవలం రెండు వాహనాలకే పరిమితం చేశారు. భద్రతా ప్రోటోకాల్ ప్రకారం రావాల్సిన ఇతర సిబ్బంది కోసం ఆయన కూడా ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఇది భద్రతను నిర్లక్ష్యం చేయకుండానే పొదుపును ఎలా పాటించవచ్చో తెలియజేస్తోంది. అంతేకాకుండా, మంత్రులు నిమ్మల రామానాయుడు, అనిత, పయ్యావుల కేశవ్ వంటి వారు ఎస్కార్ట్ వాహనాలు లేకుండా సింగిల్ వాహనాల్లోనే సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.అంతర్జాతీయ పరిస్థితుల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఒత్తిడి పెరుగుతోందని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పెట్రోల్, డీజిల్ పొదుపు చేయాలని పిలుపునిచ్చారు.

కేవలం ప్రభుత్వ స్థాయిలోనే కాకుండా, ప్రజలందరూ ఈ పొదుపు యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరారు.సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో క్యాబినెట్ భేటీ జరిగింది. దాదాపు పదికి పైగా వాహనాలతో వచ్చే చంద్రబాబు కేవలం నాలుగు వాహనాలకు మాత్రమే పరిమితం అయ్యారు. భద్రతా సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండేందుకు వారికోసం ఒక బస్సు ఏర్పాటు చేశారు. మంత్రి లోకేష్ సైతం తన కాన్వాయ్ ను తగ్గించుకున్నారు. కేవలం రెండు వాహనాలతో వచ్చారు. సీఎం మాదిరిగా తన సెక్యూరిటీ సిబ్బంది కోసం ఒక బస్సు ఏర్పాటు చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ సైతం తన కాన్వాయ్ ని తగ్గించుకున్నారు. జడ్ క్యాటగిరి లో ఉన్న దుబారా తగ్గించేందుకు వీలుగా పవన్ సగానికి పైగా వాహనాలను తగ్గించుకోవడం విశేషం.చివరికి హోం మంత్రి వంగలపూడి అనిత సైతం తన ప్రోటోకాల్ పక్కన పెట్టి మరి తన వాహన శ్రేణిని తగ్గించుకున్నారు. కొందరు మంత్రులు అయితే సింగిల్ వాహనంలో క్యాబినెట్ భేటీకి హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఎనిమిది పొదుపు అంశాలపై ఏపీ ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించేందుకు నిర్ణయించారు సీఎం చంద్రబాబు. ప్రధాని హైదరాబాద్ పర్యటనలో భాగంగా కీలక సూచనలు ఇవ్వగా ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి విమర్శలు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోడీ ఆచరించి.. మిగతా వారికి చెబితే బాగుంటుందని మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వంలో పొదుపు చర్యలు ప్రారంభం కావడం విశేషం.

# కేంద్రరాజకీయాల్లోకి సీబీఎన్...

**విజయవాడ, (భారత శక్తి)** ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల బిజీ అయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆయన ఇంటికి వెళ్లి చర్చించడం. తరువాత చంద్రబాబు ఢిల్లీ వెళ్లడం.. కేంద్ర మంత్రులతో వరుసగా భేటీలు కావడం? ప్రత్యేకంగా హోం శాఖ మంత్రి అమిత్ షా తో చర్చించడం.. ఇవన్నీ చూస్తుంటే దేశంలో ఏదో రాజకీయ నిర్ణయం ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ప్రధానంగా చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్తారు అన్న ప్రచారం పతాక స్థాయిలో జరుగుతోంది. అన్నింటికీ మించి ఆయన ఈ దేశానికి ఉప ప్రధాని కాబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభం అయింది. అనేక రకాల కథనాలు, గాసిప్స్ వస్తున్నాయి. అయితే మూడు నెలల కిందట ఇటువంటి ప్రచారం జరిగింది. బీహార్ సీఎం గా ఉన్న నితీష్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. త్వరలో ఆయన కేంద్ర మంత్రివర్గంలో చేరుతారన్న ప్రచారం నడుస్తోంది. అయితే అప్పట్లోనే సీఎం చంద్రబాబు తన పదవికి రాజీనామా చేసి ఈ దేశానికి ఉప ప్రధాని అవుతారన్న ప్రచారం నడిచింది.ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ పార్టీ కొద్దిపాటి బలం పెంచుకుంటుందన్న టాక్ వినిపిస్తోంది. భారతీయ జనతా పార్టీలో దెబ్బతిన్న విపక్షాలు ఇప్పుడు ఏకతాటిపైకి వస్తున్నాయి. దాదాపు దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ నేతలంతా బిజెపి పై కారాలు మిరియాలు నూరుతున్నారు. అయితే ఒక్కో రాష్ట్రం బిజెపి స్వాధీనం అవుతున్నా.. సార్వత్రిక ఎన్నికల విషయానికి వచ్చేసరికి ప్రజల మూడ్ మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ నేతలు ఏకతాటి పైకి వస్తే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని బిజెపి పెద్దలు అంచనా వేస్తున్నారు. ఆ కూటమిలోకి చంద్రబాబు చేరితే అదనపు బలం అన్న అంచనాలు కూడా ఉన్నాయి. అందుకే జాతీయస్థాయిలో చంద్రబాబుకు ఉప ప్రధాని పదవి ఇచ్చి.. రాజకీయ మూడ్ మారకుండా? విపక్ష నేతలు బలం పెంచుకోకుండా ఉండేందుకు కేంద్ర పెద్దలు ఇలా ప్లాన్ చేసినట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లడం కుదిరే పని కాదు. ఆయన కేంద్ర రాజకీయాల్లోకి వెళితే సీఎం బాధ్యతలు లోకేష్ కు అప్పగిస్తారన్న ప్రచారం ఉంది. కానీ కూటమి ప్రభుత్వం నడుస్తున్న దృష్ట్యా రాజకీయంగా ఇది ఇబ్బందికర పరిణామం. ఎందుకంటే రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధి పదాన నడుస్తోంది. అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు పనులు కూడా ఊపొందుకుంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లడం అనేది ఊహాజనితం అని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అనే ఒక అంశం పనిచేస్తూ ఉంటుంది.

# ఘనంగా జాతీయ టెక్నాలజీ డే

## - ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షో



**హైదరాబాద్ (భారత శక్తి)** హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ) లో జాతీయ టెక్నాలజీ డే వేడుకలతో పాటు ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి హాజరై ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. సీఎస్ఐఆర్-సీఎంఈఆర్ఐ అభివృద్ధి చేసిన ఈ విద్యుత్ ఆధారిత ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ యంత్రాలు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. డీజిల్ ఆధారిత యంత్రాలకు ప్రత్యామ్నాయంగా రూపొందించిన ఈ పరికరాలు తక్కువ నిర్వహణ ఖర్చు, సులభ వినియోగం, పర్యావరణ హిత పనితీరు వంటి ప్రత్యేకతలను కలిగి ఉన్నాయని వివరించారు.?

మహిళా రైతులు కూడా సులభంగా వినియోగించుకునేలా ప్రత్యేక డిజైన్తో రూపొందించినట్లు వెల్లడించారు. సుస్థిర వ్యవసాయం, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ రోడ్షో ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి ఆసక్తి వ్యక్తం చేశారు. రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, విధాన నిర్ణేతలు సహా 150 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'కాళిదాస్ 2' మూవీ రివ్యూ!



భరత్ హీరోగా 2019లో విడుదలైన 'కాళిదాస్' భారీ విజయాన్ని సాధించింది. ఆ ఏడాది తమిళంలో విడుదలైన హిట్ సినిమాలలో ఒకటిగా నిలిచింది. భరత్ క్రేజ్ ను పెంచిన సినిమాలలో ఇది ఒకటి అనే చెప్పుకోవాలి. ఆ సినిమాకి సీక్వెల్ గా రూపొందినదే 'కాళిదాస్ 2'. మొదటి భాగాన్ని తెరకెక్కించిన సెంథిల్, సీక్వెల్ కి కూడా దర్శకత్వం వహించాడు. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన విడుదలైన ఈ సినిమా, ఈ నెల 12వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగులో నిన్నటి నుంచే అందుబాటులోకి వచ్చింది. అది 500 కుటుంబాలకు పైగా నివసించే గేటెడ్ కమ్యూనిటీ. ఆ రోజు రాత్రి అంతా కలిసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటారు. అయితే గోకుల్ - సంజన దంపతుల కుమార్తె అయిన మూడున్నరేళ్ల పాప 'మిత్ర' కనిపించకుండా పోతుంది. దాంతో పోలీస్ ఆఫీసర్ 'కాళిదాస్' (భరత్) రంగంలోకి దిగుతాడు. సంజన స్నేహితురాలైన 'రూప' (సంగీత మాధవన్ నాయర్) కూడా అదే కమ్యూనిటీలో నివసిస్తూ ఉంటుంది. టీనేజ్ లో ఉన్న కూతురు 'అనన్య'తో కలిసి ఆమె నివసిస్తూ ఉంటుంది. ఆ కమ్యూనిటీకి సంబంధించిన అసోసియేషన్ లో కీలకమైన బాధ్యతలను నిర్వహిస్తున్న కారణంగా, అక్కడి వివరాలను కాళిదాస్ కి అందజేయడంలో 'రూప' ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. కనిపించకుండా పోయిన 'మిత్ర'కి కుక్కపిల్లలు అంటే ఇష్టమని తెలుసుకున్న కాళిదాస్, ఆ వైపు నుంచి కూడా తన ఇన్వెస్టిగేషన్ మొదలు పెడతాడు. ఆ సమయంలోనే ఈ కేసులోకి అసిస్టెంట్ కమిషనర్ వైష్ణవి (భవానిశ్రీ) ఎంటరవుతుంది. 'మిత్ర' డెడ్ బాడీ ఆ కమ్యూనిటీకి సమీపంలో దొరుకుతుంది. ఈ కేసు విషయంలో తలెత్తిన సందేహాలు, 'స్టీఫెన్' (అజయ్ కార్తీ) దిశగా వెళతాయి. గతంలో అతనిపై ఒక రేప్ కేసు .. 'మర్ఫీ' ముఠాకి చెందిన ఒక వ్యక్తి మర్డర్ కేసు ఉండటంతో అతణ్ణి అదుపులోకి తీసుకుంటారు. అయితే లాయర్ నటరాజన్(ప్రకాశ్ రాజ్) వచ్చి, తన జూనియర్ అయిన స్టీఫెన్ కి ఎలాంటి పాపం తెలియదని చెప్పి తీసుకుని వెళతాడు. అప్పుడు 'కాళిదాస్' ఏం చేస్తాడు? 'మిత్ర' మరణానికి కారకులు ఎవరు? 'మర్ఫీ' ముఠాతో స్టీఫెన్ కి ఉన్న సంబంధం ఏమిటి? అనేది మిగతా కథ.గేటెడ్ కమ్యూనిటీకి సంబంధించి మిస్సింగ్ కేసుగా నమోదై, ఆ తరువాత మర్డర్ కేసుగా మారిన ఒక క్రైమ్ థ్రిల్లర్ ఇది. 'మర్ఫీ' ముఠాకి సంబంధించిన ఉసక్తుల మర్డర్ తో ఈ కథ మొదలవుతుంది.

ఆ తరువాత ఒక గేటెడ్ కమ్యూనిటీని నుంచి మూడున్నరేళ్ల పాప మిస్సవ్వడంతో ఈ కథ నెక్స్ట్ లెవెల్ కి వెళుతుంది. అనుమానితుడికి అండగా పెద్ద లాయర్ నిలబడటం ఆడియన్స్ లో మరింత ఆసక్తిని పెంచుతుంది. ఒక అంశంతో మరో అంశానికి ముడిపెడుతూ దర్శకుడు ఈ కథను అల్లుకున్న విధానం ఉత్కంఠను పెంచుతుంది. తెరపై పాప మిస్సింగ్ కేసుకు సంబంధించిన ఇన్వెస్టిగేషన్ నడుస్తూ ఉంటుంది. ఆడియన్స్ కి ఆయా పాత్రలపై అనుమానాన్ని కలిగిస్తూనే దర్శకుడు ఈ కథను గేటెడ్ కమ్యూనిటీలో తిప్పుతూ ఉంటాడు. అయితే జరుగుతున్న తతంగాన్ని చూస్తున్న ప్రేక్షకులకు, అసలు అంతకుముందు ఏం జరిగి ఉంటుందనే ఒక కుతూహలం పెరిగిపోతూ ఉంటుంది. మర్ఫీ ముఠా హత్యల విషయంలో అనుమానితుడు .. పాప మర్డర్ కేసులో అనుమానితుడు ఒక్కడే కావడం, అతను ఆ పాప ఇంటిపైనే పూర్తి ఫోకస్ పెట్టడం .. అతనే నేరస్థుడని పోలీసులు భావిస్తూ ఉంటే, ఆలా అయ్యుండే అవకాశమే లేదని ఒక ప్రముఖ లాయర్ సపోర్టు చేయడం .. ఇలా అన్ని వైపుల నుంచి ఆడియన్స్ లో ఆత్రుతను కలిగిస్తూ వెళతాయి. సస్పెన్స్ తో కూడిన క్రైమ్ థ్రిల్లర్లు ఎప్పుడూ కూడా ప్రేక్షకుల అంచనాలకు అందకుండా ముందుకు వెళ్లినప్పుడే అవి ఎక్కువగా సక్సెస్ అవుతూ ఉంటాయి. ఈ సినిమా హిట్ కావడానికి కారణం కూడా అదేనని అనుకోవాలి. దర్శకుడు రివీల్ చేసేంతవరకూ ఆడియన్స్ లో చాలామంది ఏం జరిగి ఉంటుందనేది ఊహించలేరు. హత్యలు .. అందుకు గల కారణాలను గెస్ చేయలేరు. ముగింపు దగ్గర పడుతున్నా కొద్దీ పలకరించే ట్విస్టులు థ్రిల్ కలిగిస్తాయి.కాళిదాస్ పాత్రలో భరత్ మెప్పించాడు. సంగీత మాధవన్ నాయర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణ అనుకోవాలి. స్టీఫెన్ కార్తీ నటన కూడా బాగుంది. ప్రకాశ్ రాజ్ కనిపించేది తక్కువసేపే అయినా, తనదైన ప్రభావం చూపించారు. లొకేషన్స్ న తెరపైకి తీసుకురావడంలో సురేశ్ బాల కెమెరా పనితనం నచ్చుతుంది.

సామ్ సీఎస్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాను నిలబెట్టేసిందని చెప్పాలి. భువన్ శ్రీనివాసన్ ఎడిటింగ్ వర్క్ చాలా నీట్ గా అనిపిస్తుంది. ఫలానావారే నేరం చేసి ఉంటారనే ఒక విషయాన్ని ముందుగానే మైండులో ఫిక్స్ చేసుకుని ఇన్వెస్టిగేషన్ చేయకూడదు. ఇన్వెస్టిగేషన్ పూర్తికాకముందే ఒక నిర్ధారణకు రాకూడదు. పోలీస్ అధికారుల మధ్య ఉండే ఇగో ఫీలింగ్స్ కారణంగా కూడా ఒక్కో సారి ఆధారాలు జారిపోతూ ఉంటాయి .. అసలైన నేరస్థులు తప్పించుకుంటూ ఉంటారు అనే ఒక సందేశాన్ని కూడా ఇచ్చిన సినిమా ఇది.

# ఆ వివాదం నాలో మార్పు తెచ్చింది

## లోకజ్ఞానం పెంచుకున్నా: నిత్యా మీనన్



తన కెరీర్ ప్రారంభంలో ఒక హీరో గురించి అడిగిన ప్రశ్న, ఆ తర్వాత తనను ఇబ్బంది పెట్టిందని, దీంతో తాను లౌక్యంగా మాట్లాడడం నేర్చుకున్నానని ప్రముఖ సినీ నటి నిత్యామీనన్ అన్నారు. ఆమె కెరీర్ ప్రారంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "ప్రభాస్ ఎవరు?" అని రిప్లయ్ ఇవ్వడం అప్పట్లో చర్చకు దారి తీసింది. ఈ అంశంపై ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు. ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదానని, ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేయడం తనను చాలా ఇబ్బందికి గురిచేసిందని అన్నారు. తన నిజాయతీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఈ విషయాన్ని పెద్దది చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండడం పనికిరాదన్న విషయం అర్థమైందని వెల్లడించారు. కొన్నిసార్లు తెలివిగా మాట్లాడటం అవసరమని తాను తెలుసుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు తన నిజాయతీకి అర్హులు కారని అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఆ తర్వాత తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని అన్నారు. నాడు ప్రభాస్ అంశం కారణంగా తాను ఎంతో ఇబ్బందిపడ్డానని వాపోయారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫొటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు తనకు జీవితంలో ఎంతో నేర్పాయని, అప్పటి నుంచి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారిపోయానని వెల్లడించారు.

## 'పెద్ది' మూవీ నుంచి రామ్ బుజ్జిగా

# దివ్యేందు శర్మ ఫస్ట్ లుక్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన మచ్ అవైటెడ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'తో బాక్సాఫీస్ తుఫాన్ సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్సెస్‌లో చరణ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెంచాయి. ఇప్పుడు ఈ చిత్రానికి పాన్ ఇండియా స్థాయిలో మ్యాసీవ్ ప్రమోషన్స్ ప్రారంభమవుతున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో నిర్మాత వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై 'పెద్ది'ని భారతీయ సినిమాకు కొత్త అనుభూతిని ఇచ్చే విజువల్ స్పెక్టకిల్‌గా రూపొందించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు.ఈలోగా మేకర్స్ మరో సర్ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రంలో మిర్జాపూర్ ఫేమ్ దివ్యేందు శర్మ పోషిస్తున్న పవర్‌ఫుల్ పాత్ర 'రామ్ బుజ్జి'ని పరిచయం చేస్తూ వీడియో రిలీజ్ చేశారు. క్రికెట్ మైదానంలో రామ్ బుజ్జి ఎంట్రీ ఇచ్చిన తీరు, అతని బాడీ లాంగ్వేజ్, రగ్గడ్ యాటిట్యూడ్ పాత్రలోని ఇంటెన్సిటీని బలంగా చూపించాయి.దివ్యేందు శర్మ స్క్రీన్ ప్రెజెన్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కలిసి వీడియోకి మాస్ వైబ్ తీసుకొచ్చాయి. దీంతో 'రామ్ బుజ్జి' పాత్ర సినిమా కథలో ఎంత కీలకంగా ఉండబోతోందోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో మరింత పెరిగింది.ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ స్థాయి ప్రొడక్షన్ వాల్యూస్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయబోతున్నాయి.నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ నవీన్ నూలి ఎడిటింగ్ నిర్వహిస్తున్న ఈ భారీ చిత్రానికి ఇప్పటికే ఫుల్ ఎడిట్ లాక్ అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. 'పెద్ది' జూన్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, జూన్ 3న ప్రీమియర్స్ ప్రారంభం కానున్నాయి.తారాగణం: రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు

## 'నాగబంధం' నుంచి లీలావతిగా అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్



అభిషేక్ నామా దర్శకత్వంలో, విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి.తాజాగా మేకర్స్ 'నాగబంధం' సినిమా నుంచి అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. 'లీలావతి' పాత్రలో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, మిస్టీరియస్‌గా కనిపిస్తోంది.సంప్రదాయ తెలుపు చీరలో, ట్రైబల్ జ్యువెలరీతో అనసూయ కనిపించిన తీరు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తోంది. లీలావతి పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉండబోతోందనే ఫీల్ ఈ పోస్టర్‌తోనే స్పష్టమవుతోంది.ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో 'నాగబంధం' చిత్రం జూలై 3న విడుదల కానుంది.

# మిస్టరీ ప్రధానంగా మేము కాప్‌లం



నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన వెబ్‌సిరీస్ 'మేము 'కాప్'లం'. ప్రదీప్ మద్దాలి దర్శకుడు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమల కీలక పాత్రధారులు. రా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై బి.వి.ఎస్.రవి నిర్మించారు. ఈ నెల 22 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది.గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. మహాదేవపట్నం అనే పల్లెటూరి నేపథ్యంలో సలార్‌రాజు అనే కోడిపుంజు ఆచూకీ తెలుసుకునే ప్రయత్నంలో కామెడీ, మిస్టరీ ప్రధానంగా ట్రైలర్ ఆకట్టుకుంది. గ్రామీణ జీవితం, అక్కడి స్థానిక రాజకీయాలు, కోడిపుంజు మిస్సింగ్ మిస్టరీ వంటి అంశాలతో ఆసక్తిని రేకెత్తించింది. ఈ సిరీస్‌కు సంగీతం: సాకేత్ కోమందూరి, కథ: శోభన్ చిట్టిప్రోలు, దర్శకత్వం: ప్రదీప్ మద్దాలి.

## పోస్ట్ ప్రొడక్షన్ లో 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' మూవీ



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, పవర్ హౌస్ పెర్ఫార్మర్ విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు.షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్, రీ-రికార్డింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలలో అద్భుతమైన సంగీతాన్ని అందించిన జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్, 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.దర్శకుడు పూరి జగన్నాథ్ మ్యూజిక్ డైరెక్టర్‌తో కలిసి రికార్డింగ్ స్టూడియోలో కూర్చొని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనులను పర్యవేక్షిస్తున్నారు. మేకర్స్ రిలీజ్ చేసిన ఫోటో సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది.పూరి మార్క్ ఇంటెన్స్ ఎమోషన్స్, రా యాక్షన్‌కు తగ్గట్టుగా మ్యూజిక్ కూడా పవర్‌ఫుల్‌గా ఉండబోతుంది. ఇప్పటికే ఈ ఎక్స్‌ప్లోసివ్ కాంబోపై భారీ అంచనాలు నెలకొనగా, మేకర్స్ త్వరలోనే మరిన్ని స్ట్రైకింగ్ అప్‌డేట్స్ ఇవ్వబోతున్నారు.ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ లు హ్యూమరస్ పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో గ్రాండ్ పాన్-ఇండియా రిలీజ్ కానుంది. తారాగణం: విజయ్ సేతుపతి, సంయుక్త, టబు, విజయ్ కుమార్

## "స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే"

# కొత్త పోస్టర్ విడుదల




హాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం స్పైడర్ -మన్ : బ్రాండ్ న్యూ డే నుండి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించగా, ఇప్పుడు ఈ కొత్త పోస్టర్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ చిత్రం 2026 జూలై 31న ఇండియా లో ఇంగ్లీష్, హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.కొత్త పోస్టర్‌లో టామ్ హోలాండ్ పోషిస్తున్న పీటర్ పార్కర్ తన హూడీ కింద స్పైడర్-మ్యాన్ సూట్‌ను దాచుకుని కనిపిస్తున్నాడు. "ప్రపంచం పీటర్ పార్కర్‌ను మర్చిపోయినా? అతడు తన బాధ్యతను మాత్రం మర్చిపోలేదు" అనే భావాన్ని ఈ పోస్టర్ బలంగా ప్రతిబింబిస్తోంది. తన నగరాన్ని రక్షించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్న స్పైడర్-మ్యాన్ మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్నాడని ఈ పోస్టర్ సూచిస్తోంది.

స్పైడర్ మ్యాన్ - నో వే హోమ్ ఘన విజయానికి నాలుగేళ్ల తర్వాత, ఈ చిత్రం పీటర్ పార్కర్ జీవితంలో కొత్త అధ్యాయాన్ని చూపించనుంది. ప్రపంచం తనను గుర్తించని పరిస్థితుల్లో ఒంటరిగా జీవిస్తున్న పీటర్, న్యూయార్క్ నగరాన్ని రక్షించడమే తన ధ్యేయంగా మారుతుంది. కానీ కొత్త నేరాల పరంపరతో పాటు అతని జీవితాన్ని కుదిపేసే శక్తివంతమైన శత్రువు రంగంలోకి దిగడంతో కథ మరింత ఉత్కంఠభరితంగా సాగనుంది.సోనీ పిక్చర్స్ సంస్థ ఇండియా ? ఈ చిత్రాన్ని భారతదేశవ్యాప్తంగా అన్ని ప్రీమియం ఫార్మాట్లలో విడుదల చేయనుంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy